పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు
అత్యంత ఆందోళనకరం
- సమాజాన్ని పీడిస్తూ లోతుగా పాతుకుపోయిన సమస్య ఇది
- సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 99 | విజయవాడ, గురువారం 9 నవంబర్ 2023 | 6+8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 9 November 2023 | Rs

ఇంగ్లండ్‌కు ఊరట
- స్టోక్స్ సెంచరీ
- నెదర్లాండ్స్‌పై 160 పరుగుల తేడాతో ఘన విజయం

6

దశలు దశల భరోసా!

- అందరికీ ఒకేసారి కాదు
- అప్పుడు కొంత మందికి ఇప్పుడు కొంత మందికి
- బటన్ నొక్కుడు లాంఛనమే
- కేంద్ర వాటా ఎప్పుడో తెలీదు
- కౌలు రైతులు సందిగ్ధం
- ఇదీ కరువులో అన్నదాతలకు సాయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతన్నలకు వ్యవసాయ పెట్టుబడుల కోసం ప్రభుత్వం ఇస్తామన్న రైతు భరోసా రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులందరికీ ఒకే రోజున బ్యాంకుల్లో జమ కాలేదు. ముఖ్యమంత్రి బటన్ నొక్కాక రోజుకు కొంత మందికి మాత్రమే పడుతున్నాయి. ఈ ఏడాది రెండవ విడత భరోసా సాయం విడుదల చేసేందుకు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో మంగళవారంనాడు సిఎం బటన్ నొక్కి మీ బ్యాంక్ ఖాతాల్లో సొమ్ము పడింది చూసుకోమన్నారు. రైతన్నలు ఆశగా బ్యాంకులకు వెళ్లగా చాలా చోట్ల రైతులకు డబ్బు పడలేదని అధికారుల నుంచి జవాబు రావడంతో నిరాశతో ఇళ్లకు వెనుదిరిగిన ఉదంతాలు ఈ రెండు రోజుల్లో పలు జిల్లాల్లో చోటు చేసుకున్నాయి. గతంలో కూడా సిఎం బటన్ నొక్కాక వారం పది రోజుల వరకు లక్షల మంది రైతులకు భరోసా సొమ్ము జమ కాలేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ఒకేసారి ఏకమొత్తంలో పెట్టుబడి రైతుల చేతుల్లో పెడతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, కేంద్ర పథకం పిఎం కిసాన్‌తో కలిపి అమలు చేయడం వలన ఒకేసారి కాకుండా సంవత్సరంలో మూడు విడతల్లో కొంత కొంత సొమ్ము వేస్తున్నారు. ఆ ఇచ్చేది కూడా లబ్ధిదారులందరికీ ఒకేసారి కాకుండా కొందరికి ఒక రోజు మరికొందరికి మరో రోజు చొప్పున దశలు దశలుగా పడుతుండటంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కరువు నెలకొంది. లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాలేదు. వేసిన పంటలు ఎండిపోయాయి. దిగుబడుల్లో భారీ క్షీణత కనిపిస్తోంది. దుర్భిక్షం వలన పెట్టుబడులు, దిగుబడులు నష్టపోయిన రైతులు ప్రభుత్వం ఇచ్చే స్వల్ప 'భరోసా' కోసం ఎదురు చూస్తున్నారు. రబీ పంటలేసుకోడానికి కొంతైనా ఆసరా అవుతుందని ఆశపడుతుండగా, రైతులందరికీ భరోసా పడకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

రోజుకు కొంత

వరసగా ఐదవ ఏడాది... ఈ ఏడాదిలో రెండవ కిస్తు భరోసా 53.53 లక్షల మంది రైతులకు రూ.4 వేల చొప్పున రూ.3,923 కోట్లు విడుదల చేశామని సర్కారు తెలిపింది. సిఎం బటన్ నొక్కినప్పటికీ రెండు రోజుల్లో అంత మందికీ సొమ్ము పడలేదు. అధికారులనడిగితే ఆధార్, ఫోన్ లింకులు, ఇత్యాది సాంకేతిక కారణాల వలన పడి ఉండకపోవచ్చని సర్ది చెబుతున్నారు. కానీ వాస్తవం వేరేలా ఉంది. ఖజానాలో నిధుల లభ్యతకనుగుణంగా ఏ పూటకాపూట బిల్లుల విడుదలకు సెంటర్ మేనేజ్‌మెంట్ ఫైనాన్షియల్ సిస్టం (సిఎంఎఫ్ఎస్) పని చేస్తోంది. సిఎం బటన్ నొక్కినా అక్కడ అనుమతిస్తేనే అప్పటికి నిధులు విడుదలవుతాయి. బటన్ నొక్కినప్పటికీ అన్ని నిధులూ ఒకే సారి కాకుండా అప్పుడు కొంచెం ఇప్పుడు కొంచెం విడుదలవుతుండటంతో లబ్ధిదారులందరికీ ఒకేసారి కాకుండా దశలు దశలుగా కొన్ని రోజుల్లో జమవుతున్నాయి.

ప్రస్తుతానికి రెండు వేలే...

సొంత భూమి సాగు చేసుకునే రైతులకు భరోసా రెండవ కిస్తు రూ.4 వేలు ఇవ్వాల్సి ఉంటే, వాటిలో రెండు వేలు కేంద్రం, రెండు వేలు రాష్ట్రం ఇవ్వాలి. కేంద్ర పిఎం కిసాన్ కిస్తు రూ.2 వేలపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. అక్టోబర్‌లోఅన్నారు. ఇప్పుడు దీపావళికికానీ, లేదంటే మిగతా 5లో

హోరెత్తిన 'ఉక్కు' నినాదం

- కార్మిక కుటుంబాలతో కలిసి మహాదీక్ష
- వెయ్యి రోజులకు చేరుకున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ దీక్షలు
- ప్రయివేటీకరణపై తాడోపేడో తేల్చుకుంటాం : పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖలో 'ఉక్కు' నినాదం హోరెత్తింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం వెయ్యి రోజులకు చేరుకున్న సందర్భంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద దీక్షా శిబిరానికి కార్మికులు తమ కుటుంబాలతో సహా కలిసి వచ్చి మహాదీక్ష చేపట్టారు. సిపిఎం, సిపిఐ, వైసిపి, టిడిపి, జనసేన, ఆప్, ప్రజాశాంతి పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేస్తే తాడోపేడో తేల్చుకుంటాం' అన్న పోరాట కమిటీ నేతలతో రాజకీయ పార్టీల నేతలూ గొంతుకలిపారు.

మహాదీక్షా శిబిరానుద్దేశించి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. నిరంతరాయంగా పోరాటం కొనసాగించడం వల్లే విశాఖ స్టీల్‌ప్లాంట్ స్టాటజిక్ సేల్ చేయకుండా ఆపగలిగామని అన్నారు. పలు ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో 49 శాతం వాటాలు అమ్మినప్పటికీ, కార్మికుల పోరాట ఫలితంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఒక శాతం కూడా ప్రయివేటుపరం కాలేదన్నారు. విద్యార్థి సంఘాల నుంచి ఉక్కు పోరాటానికి సంపూర్ణ మద్దతు లభించిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మూడుసార్లు బంద్‌లు, రాస్తారోకోలు చేపట్టారని తెలిపారు. ఈ పోరాటానికి బిజెపి మినహా అన్ని ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారని తెలిపారు. పది వేల మందితో విశాఖ బీచ్ రోడ్డులో కిసాన్ సంయుక్త మోర్చా నాయకులతో

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

కలిసి పెద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పది కిలోమీటర్ల మానవహారం, ఐదు కిలోమీటర్ల నడక వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. ఉక్కును రక్షించుకునేందుకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ రాజకీయ నాయకులు పార్లమెంటులో గొంతు విప్పాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ.. విశాఖ ఉక్కుపై జరుగుతున్న కుట్రలను వివరించారు. వైసిపి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ.. త్యాగాల ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటుపరం కానిచ్చేది లేదన్నారు. టిడిపి మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. ప్రయివేటీకరణ చర్యలను కేంద్రం ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు.. ప్రజల సంపదని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, మాజీ విసి బాలమోహన్‌దాస్, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ బి.గంగారావు, పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, కెఎస్ఎన్.రావు మాట్లాడారు.

స్వల్ప ఉద్రిక్తత

మహా దీక్ష జరుగుతుండగానే కొందరు ఉక్కు కార్మికులు, పలు పార్టీల నాయకులు కూర్మన్నపాలెం కూడలిలోని రోడ్డుపై బైఠాయించారు. ఈ క్రమంలో పోలీసులు వచ్చి వారిని పక్కకు లాగే క్రమంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. వామపక్ష పార్టీలు, అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద వున్న గురజాడ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడారు.

విద్యా సంస్థల బంద్ సక్సెస్

- మార్మోగిన 'సేవ్ వైజాగ్ స్టీల్' నినాదం
- రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అరెస్టులు

కర్నూలులో విద్యార్థి, యువజన సంఘాల ర్యాలీ

ప్రజాశక్తి- యంత్రాంగం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు రాష్ట్రంలోని విద్యా సంస్థలు బుధవారం మూతబడ్డారు. ప్రయివేట్ స్కూళ్లు, కాలేజీలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. విద్యార్థి, యువజన సంఘాల అభ్యర్థన మేరకు ఆయా సంస్థల యాజమాన్యాలు ముందుగానే సెలవు ప్రకటించాయి. ప్రభుత్వ పాఠశాలలు కూడా మూతబడ్డారు. అక్కడక్కడా తెరిసిన కొన్ని విద్యా సంస్థలను ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, పివైఎంఎల్, ఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు, కార్యకర్తలు మూయించారు. 'సేవ్ వైజాగ్ స్టీల్' నినాదం, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలనే డిమాండ్ రాష్ట్ర వ్యాప్తంగా హోరెత్తింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పోరాటాలతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. నాడు ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం విద్యార్థులు ప్రాణాలర్పించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఒక్క మిగతా 5లో

జగన్, సిబిఐ, సిబిఐ కోర్టులకు హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సిబిఐ న్యాయస్థానానికి, సిబిఐకి తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై సిబిఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను 2024లో జరిగే అసెంబ్లీ ఎన్నికలలోగా తేల్చాలని మాజీ ఎంపి హరిరామజోగయ్య దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్.వి.శ్రావణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌ను పిల్‌గా పరిగణించేందుకు మొదట హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరాలు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుతం సిఎంగా ఉన్నారని, ఆయనపై పెండింగ్‌లో ఉన్న కేసులు చాలా తీవ్రమైనవని పిటిషనర్ తరుపు న్యాయవాది రాధాకృష్ణ కోర్టు దృష్టికి తెచ్చారు. తన క్లయింట్ దాఖలు చేసిన పిల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కోర్టును కోరారు. పిటిషనర్ వాదనతో ఉన్నత న్యాయస్థానం ఏకీభవించి పిల్‌కు నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

ప్రజల పక్షం ఉన్న వారినే ఎన్నుకోండి

- బిజెపికి జనసేన తాకట్టు
- పరస్పరం దూషణలకే వైసిపి, టిడిపి పరిమితం
- ప్రజా రక్షణభేరి బస్సు యాత్రలో వి.శ్రీనివాసరావు
- విజయవాడలో ముగిసిన యాత్ర

విజయవాడలో జరిగిన సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కృష్ణా, విజయవాడ ప్రతినిధులు

ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారినే ఎన్నుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నాయని, జనసేన పార్టీని పవన్ కల్యాణ్ బిజెపికి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు.

పార్వతీపురం జిల్లా సీతంపేటలో గత నెల 30న ప్రారంభమైన సిపిఎం ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర బుధవారం ఏలూరు మీదుగా కృష్ణా జిల్లాలోకి ప్రవేశించి ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో ముగిసింది. ఈ సందర్భంగా విజయవాడ, హనుమాన్ జంక్షన్, గన్నవరంల్లో జరిగిన సభల్లో శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసినట్లుగానే భవిష్యత్తులో జనసేన పార్టీని పవన్ కల్యాణ్ బిజెపిలో విలీనం చేయడం ఖాయమన్నారు. 'రాష్ట్రానికి మోడీ ఒక వెన్నుపోటు పొడిస్తే, నీవు కూడా మరోపోటు పొడుద్దామని అనుకుంటున్నావా?' అని పవన్ కల్యాణ్‌ను ప్రశ్నించారు. దమ్ము, ధైర్యం ఉంటే రాష్ట్రానికి అన్యాయం చేసిన మోడీని ప్రశ్నించాలని సవాల్ విసిరారు. బిజెపి రోడ్డు మ్యాప్‌లో చిక్కుకున్న పవన్ గురించి తెలుసుకోకుండా ఆయనే తమ బలం అంటూ టిడిపి నేతలు జబ్బలు చరుచుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. వైసిపి, టిడిపి నేతలు ఒకరినొకరు తిట్టుకోవడానికే పరిమితమయ్యారని, అభివృద్ధి, ప్రజా సమస్యల గురించి మాట్లాడడం లేదని విమర్శించారు. వ్యవసాయం చేస్తామన్న కుటుంబాలకు రెండెకరాల భూమి ఇస్తామనిగానీ, కార్మికులు, స్కీం వర్కర్లకు కనీస వేతనం అమలు చేస్తామనిగానీ వైసిపి, టిడిపిలు తమ మ్యానిఫెస్టోల్లో చెప్పడం లేదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వేసిన కోనేరు రంగారావు కమిటీ భూ పంపిణీపై చేసిన సిఫార్సులను వైసిపి ప్రభుత్వం ఎందుకు చెత్తబుట్టలో వేసిందో చెప్పాలని ప్రశ్నించారు. నవరత్నాల పేరుతో ప్రజలకు లక్షలాది రూపాయలు ఇచ్చామని ముఖ్యమంత్రి మిగతా 5లో

డిఇఒలుగా ఎడిలు

- ప్రభుత్వం ఉత్తర్వులు
- ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిల్లా విద్యాశాఖ అధికారుల (డిఇఒ) నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. డిఇఒ కార్యాలయంలో ఉన్న అడిషనల్ డైరెక్టర్లకు డిఇఒలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ బుధవారం జిఒ 282ను విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల పట్ల ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఇచ్చిన 505, 4 జిఒలకు విరుద్ధంగా ఈ ఉత్తర్వులు ఉన్నాయని చెబుతున్నాయి. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు సంబంధించిన 73 జిఒకు అనుగుణంగా డిఇఒ, డిప్యూటీ డిఇఒల నియామకం చేపట్టాలని కోరుతున్నాయి. అకడమిక్ అనుభవం లేని వారితో డిఇఒ పోస్టులు భర్తీ చేయడం కాదని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జిఒ 282ను తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన 73 జిఒ ఆధారంగా వెంటనే ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టాలని కోరారు. కామన్ సర్వీస్ రూల్స్ ప్రక్రియను ప్రభుత్వమే ఆటంకపరచడం ఉపాధ్యాయుల ప్రమోషన్ ఛానల్‌కు తూట్లు పడటం సరికాదని పేర్కొన్నారు. 282 జిఒను రద్దు చేయకపోతే ఇతర ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. అసంబద్ధమైన జిఒ 282ను రద్దు చేయాలని ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి మరో ప్రకటనలో కోరారు.

పల్నాడు జిల్లా మాచర్ల మండలం రాయవరం గ్రామంలో పత్తిపొలంలో నిలిచిన వర్షపునీరు

తూర్పు గాలులతో వర్షాలు

లోపలి పేజీలో..

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో ఐఎఎస్, ఐపిఎస్‌లను ఆర్ఎస్ఎస్ ప్రచారకులుగా మార్చే ప్రయత్నం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో ఐఎఎస్, ఐపిఎస్‌లను ఆర్ఎస్ఎస్ ప్రచార కులుగా మార్చే ప్రయత్నం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వికసిత్ భారత్ ప్రచారం ద్వారా గిరిజనులు, పట్టణ ప్రాంత పేదలను మభ్య పెట్టేందుకు మన్యం పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు జిల్లాలు, 124 అర్బన్ ప్రాంతాల్లో మురికివాడల్లో ఉంటున్న పేదల ప్రాంతాలను ఎన్నుకొన్నదని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఓట్లు గుంజుకునేందుకే అధికారుల బాధ్యతలను దుర్వినియోగం చేస్తోంద న్నారు. మోడీ హయాంలో దేశం విలాప భారత్‌గా మారుతోందని, కరువు కాటకాలు, ఆత్మహత్యలు, అధిక ధరలు, మహిళలు, దళితులు ఆదివాసీలపై అత్యాచారాలు, నిరుద్యోగంతో భరతమాత విలపి స్తోందని ఆగ్రహించారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వ విద్రోహాన్ని, ఆదివాసీలకు చేసిన అన్యా యాన్ని ఎక్కడికక్కడ నిలదీసి ప్రశ్నించాలని కోరారు. అధికారులు ఇలాంటి తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టొద్దని విజ్ఞప్తి చేశారు.

బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించకూడదని శ్రీనివాసరావు కోరారు.

కన్సల్టెన్సీల చేతికి కీలక ప్రాజెక్టులు
- ఔట్‌సోర్సింగ్‌కు 500 కోట్ల విలువైన పనులు
- మోడీ ప్రభుత్వ నిర్వాకం

లోపలి పేజీలో..

భారత్‌లో ఎలన్ మస్క్ ఇంటర్నెట్ సేవలు..!

న్యూఢిల్లీ : టెస్లా, ట్విట్టర్ అధినేత ఎలన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందించే స్టార్ లింక్‌కు భారత్‌లో త్వరలోనే అనుమతులు లభించే అవకాశం ఉందని సమాచారం. దేశంలో శాటిలైట్ ఆధారిత వాయిస్, డేటా కమ్యూనికేషన్ సేవల ప్రారంభం కోసం స్టార్ లింక్ ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకోసం కొన్ని నెలల క్రితమే టెలికం శాఖకు దరఖాస్తు చేసుకుంది. కాగా.. డేటా స్టోరేజీ, ట్రాన్స్‌ఫర్ ప్రమాణాల విషయంలో టెలికం శాఖ పెట్టిన పలు షరతులు, నిబంధనలకు తొలుత స్టార్ లింక్ విముఖత చూపించడంతో ఆ దరఖాస్తును తిరస్కరించింది. దీంతో మరోసారి దరఖాస్తు చేసుకోవడంతో పాటుగా.. స్టార్ లింక్ ఇచ్చిన వివరణలకు ప్రభుత్వం సంతృప్తి చెందిందని రిపోర్టులు వస్తున్నాయి. స్టార్ లింక్‌కు ఒకవేళ అనుమతులు మంజూరు అయి తే రిలయన్స్ జియో స్పేస్ ఫైబర్, ఎయిర్‌టెల్ వన్ వెబ్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు తీవ్ర పోటీని ఇచ్చే అవకాశం ఉంది. మరోవైపు అమెజాన్ కూడా భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కోసం దరఖాస్తు చేసుకుని ఉంది.



చెరువులు, కాలువ స్థలాల్లో ఉంటే 'అసైన్డ్' హక్కు లేదు

మార్గదర్శకాలు విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసైన్డ్ ఇళ్ల స్థలాలపై యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా పేదలకు భారీ లబ్ధి చేకూర్చనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుండగా, దానికి భిన్నంగా మార్గదర్శకాలు విడుదలయ్యాయి. రెవిన్యూ రికార్డు ప్రకారం ఇళ్ల స్థలం జలవనరులు (వాటర్ బాడీ) లో ఉంటే యాజమాన్య హక్కు నిరాకరించాలని పేర్కొన్నారు. దీంతో చెరువులు, వాగులు, వంకలు, కాలువ గట్లపై అసైన్డ్ పట్టా ద్వారా ఇళ్ల స్థలాలు పొందిన వారికి కొత్తగా ఎటువంటి హక్కు లభించదు. పైగా అదే సాకుతో వారిని ఖాళీ చేయించే అవకాశమూ ప్రభుత్వానికి దక్కనుంది. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో పేదలు కాలువగట్లు, చెరువు, పొరంబోకు స్థలాలో నివాసముంటున్న సంగతి తెలిసిందే. ఏళ్ల తరబడి సాగించిన పోరాటాల తరువాత ఈ తరహా స్థలాల్లో ఉంటున్న పేదలకు అప్పటి ప్రభుత్వాలు అసైన్డ్ పట్టాలు ఇచ్చాయి. పది సంవత్సరాల నుండి అసైన్డ్ స్థలాల్లో నివాసముండే వారికి వాటిపై యాజమాన్య హక్కులను కల్పిస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఆ పని చేయకుండా ఇళ్లస్థలాల స్వభావాన్ని గుర్తించాలని విఆర్‌ఓలను ఆదేశించింది. రెవిన్యూ రికార్డుల ప్రకారం ఆ స్థలం జలవనరుల కి కిందకు వస్తుందా రాదో పరిశీలించాలని నిర్దేశించింది. జలవనరుల్లో ఉన్న స్థలాలు మినహామిగిలిన వాటికి యాజమాన్య హక్కులను కల్పించాలని కలెక్టర్లను ఆదేశించింది. దీంతో ప్రభుత్వ చర్యలోని అసలు ఉద్దేశ్యం ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

నిర్ధారణ ఎలా...?

అసైన్డ్ స్థల స్వభావాన్ని నిర్ధారించేందుకు విఆర్‌ఓలు నూరుశాతం క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని మార్గదర్శకాల్లో ప్రభుత్వం పేర్కొంది. డికెటి, రిజిస్టర్లు, అసైన్‌మెంట్ కమిటీ రికార్డులు, ఇతర రెవిన్యూ రికార్డులను విఆర్‌ఓ క్షుణంగా పరిశీలించాలి. జలవనరుల స్థలాన్ని నివాసాలకు కేటాయించి ఉంటే, ఆ విషయాన్ని స్పష్టంగా పేర్కొంటూ నివేదిక తయారు చేయాలి. ప్రతి ఇంటికి సంబంధించిన పూర్తిస్థాయి రికార్డులను తహసిల్దార్‌కు అప్పగించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. అదే విధంగా నివాస స్థలాన్ని ఏ సంవత్సరంలో కేటాయించారు? ఎవరికి కేటాయించారు? అసలైన లబ్దిదారులు ఆ స్థలంలో ఉంటున్నారా? ఆయన వారసులు ఉంటున్నారా? అన్న విషయాన్ని కూడా నిర్ధారించుకుని నివేదికలో విఆర్‌ఓలు పేర్కొనాలి. అనంతరం మండల తహసీల్దారు విఆర్‌ఓ తయారు చేసిన జాబితాను పరిశీలించాలి. అర్హత ఉన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ యాక్ట్‌లోని నిషేధిత ఆస్తుల జాబితా (సెక్షన్ 22ఎ) నుండి తొలగిస్తున్నట్లు గ్రామ/ వార్డు సచివాలయంలో నోటీసు బోర్డులో పెట్టాలి. ఏవైనా అభ్యంతరాలుంటే 7 రోజుల్లో తెలపాలని కోరాలి. అనంతరం ఆజాబితాను ఆర్‌డిఓ/ సబ్ కలెక్టర్‌కు పంపిస్తారు. ఆర్‌డిఓ కార్యాలయానికి చేరిన ఫైలును పరిశీలించిన అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు పంపాల్సి ఉంటుంది. జాయింట్ కలెక్టర్ కూడా ఫైలును పరిశీలించిన అనంతరం డ్రాఫ్ట్ పబ్లికేషన్ కోసం జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతారు. తుది పరిశీలన అనంతరం జిల్లా గెజిట్‌ను కలెక్టర్ విడుదల చేస్తారు.

టిడ్కో ఇళ్లను పాడుబెట్టడం దారుణం

- లబ్ధిదారులకు వెంటనే అప్పగించి బ్యాంకు రుణాలు రద్దు చేయాలి
- గత ప్రభుత్వంపై కక్ష జనంపై తీర్చుకోవడం దారుణం : వి.శ్రీనివాసరావు
- పోణంగిలో టిడ్కో ఇళ్ల పరిశీలన

ఏలూరులోని పోణంగిలో టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

గత ప్రభుత్వంపై కక్షను లబ్ధిదారులపై చూపిస్తూ పూర్తయిన టిడ్కో ఇళ్లను వారికి ఇవ్వకపోవడం నేరపూరిత చర్యని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. వెంటనే వాటిని లబ్ధిదారులకు అందించాలని, ఇళ్ల కోసం లబ్ధిదారులు తీసుకున్న బ్యాంకు రుణాలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజారక్షణ భేరి యాత్రలో భాగంగా ఏలూరు విచ్చేసిన సిపిఎం బృందం పోణంగిలో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయాన్ని పరిశీలించింది. కట్టిన ఇళ్లన్నీ పాడుబడి అడవి మాదిరిగా తుప్పలు కమ్ముకోవడం చూసి నాయకులు నిర్ఘాంతపోయారు. ఇనుప ఊచలన్నీ తుప్పు పట్టిపోవడం, ఇళ్లు కట్టి ఏళ్లు గడిచిపోవడంతో పెచ్చులు ఊడిపోవడం వంటివి ఈ బృందం దృష్టికి వచ్చాయి. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు నేటికీ ఇవ్వకుండా రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేయడం దారుణమన్నారు. పేద కుటుంబాలు డబ్బు కట్టి టిడ్కో ఇళ్ల కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. టిడ్కో ఇళ్లు మూడు కేటగిరీలుగా ఉన్నాయని, వీటిలో రూ.500 చెల్లించినవి, రూ.50 వేలు చెల్లించినవి, రూ.లక్ష చెల్లించినవి ఉన్నాయని వివరించారు. రెండు కేటగిరీల లబ్ధిదారులు బ్యాంకు రుణాలు సైతం తీసుకున్నారని తెలిపారు. ఇళ్లు లబ్ధిదారులకు అందకపోయినా రుణాలు వడ్డీతో కట్టాలని బ్యాంకులు నోటీసులు ఇస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వంపై కక్షతో లబ్ధిదారులను శిక్షించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఒక్క ఏలూరులోనే టిడ్కో ఇళ్ల కోసం లబ్దిదారుల నుంచి రూ.22 కోట్లు వసూలు చేశారని, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్లు వరకూ ఉన్నాయన చెప్పారు. మొత్తం 18 వేల మంది లబ్ధిదారులు ఉండగా, 12 వేల మందిని జగనన్న ఇళ్ల కాలనీల్లోకి పంపించేశారన్నారు. మిగిలిన లబ్ధిదారులకైనా టిడ్కో ఇళ్లను నేటికీ ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్రంలో 2.60 లక్షల టిడ్కో ఇళ్లను నిర్మించారని, అందులో లక్షా 40 వేలు ఇళ్లు రూ.500 చెల్లించినవి కాగా, మరో లక్షా 20 వేల ఇళ్లు బ్యాంకు రుణాలు తీసుకున్నవని వివరించారు. కట్టిన ఇళ్లను పాడుబెట్టడంతో ద్వారబంధాలు పడిపోయాయని, నాణ్యత దెబ్బతిందని, అడవిలో మాదిరిగా పిచ్చి మొక్కలు మొలిచాయని తెలిపారు. గత ప్రభుత్వానికి పేరు రావడం ఇష్టం లేకపోతే జగనన్న అంటూ పేరు పెట్టుకుని లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని సూచించారు. కృష్ణా జిల్లాలో ఐదు వేల టిడ్కో ఇళ్లలో గృహప్రవేశం చేసినట్లు ప్రభుత్వం చెప్పిందన్నారు. అయితే, ఇప్పటికీ కొన్ని టిడ్కో ఇళ్లను పూర్తి చేయకపోవడంతో రూ.వేల కోట్లు వృథా అవుతున్నాయని చెప్పారు. ఏలూరులో ఆరు వేల ఇళ్లు కట్టి పాడుబెట్టారని తెలిపారు. టిడ్కో ఇళ్లకు తీసుకున్న బ్యాంకు రుణాలను రద్దు చేయాలని, ఇప్పటి వరకూ బ్యాంకులకు చెల్లించాల్సిన వడ్డీని ప్రభుత్వమే కట్టాలని డిమాండ్ చేశారు. రుణాలను రద్దు చేస్తే లబ్ధిదారులే ఇళ్లను పూర్తి చేసుకుని స్వాధీనం చేసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, కె.సురేంద్ర, రాష్ట్ర నాయకులు సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి.పి.కిషోర్, సీనియర్ నాయకులు బి.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

భీమవరం సభలో మాట్లాడుతున్న వెంకట్

అదానికి రాష్ట్రాన్ని దోచిపెడుతున్నారు

- ప్రజారక్షణ భేరి సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వెంకట్

ప్రజాశక్తి - భీమవరం

ప్రధాని మోడీతో కలిసి రాష్ట్రాన్ని అదానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దోచిపెడుతున్నారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ ఆరోపించారు. కృష్ణపట్నం, బందర్ పోర్టులు ఇప్పటికే అదానికి కట్టబెట్టారని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అప్పగించేందుకు చూస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడికీ వెళ్లని అదానీ విజయవాడకు ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర పశ్చిమగోదావరి జిల్లాలో రెండోరోజు బుధవారం పర్యటించింది. నరసాపురంలో ప్రారంభమైన యాత్ర పాలకొల్లు, మార్టేరు, తణుకు, తాడేపల్లిగూడెం, కేశవరం మీదుగా భీమవరం చేరుకుంది. పాలకొల్లు గాంధీబొమ్మ సెంటర్ వద్ద రాజ్యాంగ నిర్మాత, అంబేద్కర్, కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాలకు యాత్ర బృందం నివాళులర్పించింది.

భీమవరం ప్రకాశం చౌక్ లో ఏర్పాటు చేసిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అధ్యక్షత వహించగా వెంకట్ ప్రసంగించారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రత్యేక ప్రణాళికతో ప్రజల ముందుకు వచ్చిందన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి విధానాలు అత్యంత ప్రమాదకరంగా మారాయని విమర్శించారు. రైతులు, కౌలు రైతులు, కార్మికుల గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్వింటాలు వరికి కేంద్ర ప్రభుత్వం రూ.రెండువేలు మద్దతు ధర ఇస్తుంటే మరో రూ.700 కలిపి కేరళలోని ఎర్రజెండా ప్రభుత్వం ఇస్తోందన్నారు. ఎపిలో ఉపాధి హామీ పని దినాలు సరాసరి 40 రోజులు, రోజుకు రూ.240 అందిస్తుంటే, కేరళలో 70 రోజుల పని దినాలు, రూ.850 నుంచి 950 వరకు వేతనం అందిస్తున్నారని తెలిపారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి అధికారం కోసం మోడీ ప్రయత్నాలు సాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి మోడీ అన్యాయం చేస్తున్నా కనీసం జగన్ నోరు మెదపడం లేదని మండిపడ్డారు. టిడిపి, జనసేన కూడా మోడీ భజన చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, కె.లోకనాథం, నేతలు కె.ధనలక్ష్మి, ఎవి.నాగేశ్వరరావు, హరిబాబు మాట్లాడారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందాల్సిన జిల్లా పాలకుల నిర్లక్ష్యం కారణంగా వెనుకబడిందన్నారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తక్షణం తెరిపించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.లోకనాథం, మంతెన సీతారాం, రాష్ట్ర నాయకులు ఆంద్ర మాల్యాద్రి పాల్గొన్నారు.

24 నుంచి సమ్మేటివ్ 1 పరీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యార్థులకు ఈ నెల 24 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఎ)-1 పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టరు బి ప్రతాప్ రెడ్డి ప్రాంతీయ, జిల్లా విద్యాశాఖ అధికారులకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 24 నుంచి డిసెంబరు 6 వరకు ఎస్‌ఎ-1 పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 25 నుంచి డిసెంబరు 2 వరకు ఉంటాయని పేర్కొన్నారు. అకడమిక్ కేలండరు ప్రకారం ఈ నెల 4 నుంచే ఎస్‌ఎ-1 పరీక్షలు జరగాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్‌సిఇఆర్‌టి ద్వారా 3, 6, 9 తరగతులకు చేపట్టిన స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్‌ఇఎఎస్) అసెస్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్, జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నేపథ్యంలో షెడ్యూల్ మారుస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయాల వారోత్సవాలు జరగనున్నాయని వివరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

విచారణ నుంచి తప్పుకున్న జడ్జి

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని, వీటిపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేయాలంటూ వైసిపి ఎంపి కనుమూరి రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన వ్యాజ్యం విచారణ నుంచి జస్టిస్ ఆర్ రఘునందన్‌రావు తప్పుకున్నారు. దీంతో ఏ ధర్మాసనం విచారణ చేస్తుందనేది ప్రధాన న్యాయమూర్తి నిర్ణయించనున్నారు. వైసిపి రూపొందించిన వివిధ నిర్ణయాలపై సిబిఐ దర్యాప్తుకు ఆదేశించాలన్న పిల్‌ను బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్ రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. అయితే, ఈ వ్యాజ్యం విచారణ నుంచి వైదొలుగుతున్నట్లు జస్టిస్ రఘునందనరావు ప్రకటించారు. దీంతో పిల్ మరో బెంచ్ ముందు విచారణకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రీని సిజె ఆదేశించారు.

ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సిఇఒగా సజ్జామల వెంకటేశ్వరరావును, రాష్ట్ర ఎన్నికల కమిషన్ అదనపు సిఇఒగా హరీందర్ ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు జిఓ 2180ని ప్రభుత్వం విడుదల చేసింది. అలాగే రాష్ట్రంలో ఉన్న ఇద్దరు అధికారులకు కన్‌ఫర్డ్ ఐఎఎస్‌లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వ సెక్రటరీ పంకజ్ గంగ్వార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో అనిల్‌కుమార్ రెడ్డి, నీలకంఠారెడ్డి ఉన్నారు.

అంబానీ, అదానీలకు కొమ్ముకాస్తున్న కేంద్రం

- ప్రజారక్షణ భేరి యాత్రలో గఫూర్

పల్నాడు జిల్లా చిలకలూరిపేట సభలో మాట్లాడుతున్న ఎంఎ గఫూర్

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకపోగా అదానీ, అంబానీలకు కేంద్రం కొమ్ముకాస్తోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ విమర్శించారు. రైళ్లు, విమానాలను మొత్తంగా దేశాన్నే కేంద్రం అమ్మేస్తోందని, విశాఖ ఉక్కును ప్రయివేటీకరించేందుకు సిద్ధమైందని, జాతీయ రహదారులు కూడా అంచెలంచెలుగా అమ్ముతూ భారీగా టోల్‌ఛార్జీలను పెంచుకునేలా అవకాశమిస్తోందని మండిపడ్డారు. కరువు కోరల్లో రాష్ట్రం చిక్కుకున్నా, కరువు లేదని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజారక్షణభేరి బస్సు యాత్ర బుధవారం పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట మీదుగా బాపట్ల జిల్లాకు చేరుకుంది. బాపట్లలోని పర్చూరు, చీరాల, బాపట్ల, భట్టిప్రోలు మండలం వెల్లటూరు వరకూ కొనసాగింది. ఆయా చోట్ల యాత్రకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. బాపట్ల జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనాలను యాత్ర బృందం సందర్శించింది.

ఈ సందర్భంగా ఆయా మండలాల్లో నిర్వహించిన బహిరంగసభల్లో గఫూర్ మాట్లాడుతూ.. దేశంలో నల్ల డబ్బు ఉందని, తనకు ఒక్క అవకాశం ఇస్తే ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానని చెప్పిన మోడీ చివరికి బ్యాంకుల్లో జన్‌ధన్ ఖాతాలు తెరిపించారని ఎద్దేవా చేశారు. సిఎం జగన్ పరిస్థితి పంజరంలో చిలకలా ఉందన్నారు. బటన్ నొక్కడానికి ఏదో ఒక జిల్లాకు వెళ్లడం, బటన్ నొక్కడం.. ఇంటికి వచ్చి కూర్చోవడంలా ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించి కేంద్ర ప్రభుత్వానికి కొమ్ము కాస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ బిజెపికి తొత్తులయ్యాయని, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాచిపోయిన లడ్డూ తింటూ బిజెపిని భుజానికెత్తుకుని వదలకుండా పట్టుకున్నారని ఎద్దేవా చేశారు. టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు గుడ్డిగా కేంద్రానికి మద్దతు ఇవ్వడం వల్ల రాష్ట్రం నష్టపోతోందన్నారు. ఉపాధి కోసం పేదలు, ఉద్యోగాల కోసం యువత వలసెళ్లిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కరువు, నిరుద్యోగం తాండవిస్తున్నాయని, దేశ వ్యాప్తంగా నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుల బాధతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా ముఖ్యమంత్రికి పట్టడం లేదని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధిని గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు రాలేదని, రైల్వే జోన్ లేదని, పోలవరం ప్రాజెక్టు గురించి ఎవరికీ పట్టడం లేదని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం అన్ని విధాలుగా అన్యాయం చేస్తుంటే సిఎం జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబుకు గానీ ఏమీ పట్టడం లేదన్నారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య, దయా రమాదేవి, కె.ఉమామహేశ్వరరావు, భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలకు కలెక్టర్ల ప్రచారం

- గిరిజనులు, పేదలే టార్గెట్
- రాష్ట్రంలో 15వ తేదీ ప్రారంభం
- ఆర్‌ఎస్‌ఎస్ కోసమే అంటున్న పరిశీలకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజనులు, పేదలు నివశించే ప్రాంతాల్లో సంక్షేమ పథకాల పేరుతో ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల ప్రచారానికి కేంద్ర ప్రభుత్వం తెరతీసింది. దీనికోసం రాష్ట్ర స్థాయి నుండి జిల్లా స్థాయి వరకూ కమిటీలు వేయాలని ఆదేశించడంతో పాటు, జిల్లా కలెక్టర్లకు ఈ ప్రచార బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు విధివిధానాలు రూపొందించింది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో ఆయా ప్రాంతాల్లో తిష్ట వేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్ ఒక ప్రణాళికను రూపొందించింది. దీనినే బిజెపి ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికి జిల్లా కలెక్టర్లు ఛైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. రెండు కేంద్ర ప్రభుత్వ రంగాలకు చెందిన ఇద్దరు ప్రతినిధులతో పాటు, ఇతర ఉన్నతాధికారులను బాధ్యులుగా నియమించింది. రాష్ట్రంలో ఈనెల 15వ తేదీ అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. జిల్లాలోని 329 గ్రామపంచాయతీలకు మూడు వ్యాన్లను కేటాయించి 55 రోజులు ప్రచారం చేయనున్నారు. పార్వతీపురంలో 103 పంచాయతీల పరిధిలో 52 రోజులు ప్రచారం నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని 124 పట్టణ ప్రాంతాల పరిధిలోని 461 ప్రాంతాల్లో 47రోజులు ప్రచారం చేపట్టనున్నారు. గ్రామీణ ప్రాంతంలో 11,325 పంచాయతీలకు 117 వ్యాన్లను కేటాయించారు. 60 రోజులపాటు ఈ వ్యాన్లు ప్రచారం చేయనున్నాయి. జిల్లా కమిటీ తరువాత మండలస్థాయిలో ఎమ్‌డిఓ నేతృత్వంలో మరొక కమిటీ ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించనున్నారు. ప్రచారంలో భాగంగా ప్రధాని మోడీ గురించి పదినిముషాల పాటు చెప్పాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రస్థాయిలో ఇప్పటికే సిఎస్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పడి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాల్సిన ప్రచారం తదితర అంశాలపై చర్చించింది. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రతిఅంశాన్ని కేంద్రం ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. లోకేషన్‌తో సహా వీడియో, ఫోటోలు నిరంతరం అప్‌లోడ్ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. రాష్ట్ర పరిధిలో ఉన్న కలెక్టర్లను కేంద్ర పథకాలపై ప్రచారం చేయమనడం ఏమిటనే అంశంపై ఉన్నతాధికారుల్లోనూ చర్చ సాగుతోంది. ప్రజలనుండి సేకరించి అప్‌లోడ్ చేయించే వీడియోలను బిజెపి విజయాలుగా ప్రచారం చేసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కేంద్ర చర్యలను అడ్డుకోవాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా రేపు నిరసనలు

- వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు వామపక్షాలు ప్రకటించాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు వై సాంబశివరావు, సిపిఐఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్, ఎంసిపిఐయు నాయకులు కాటం నాగభూషణం, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు ఎన్ మూర్తి, ఎస్‌యుసిఐసి నాయకులు బిఎస్ అమర్‌నాథ్, ఫార్వార్డ్‌బ్లాక్ నాయకులు పివి సుందరరామరాజు, ఆర్‌ఎస్‌పి నాయకులు జానకిరాములు బుధవారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. గాజాపై ఇజ్రాయిల్ ఏకపక్షంగా చేస్తున్న యుద్ధం నెల రోజులు దాటిందని, వేలాదిమంది ఈ మారణకాండలో బలవుతున్నారని తెలిపారు. శరణార్థి శిబిరాలపైనా బాంబుదాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పసిపిల్లలు, మహిళలు, పౌరుల శవాలగుట్టలు హృదయ విదారకంగా ఉన్నాయని వివరించారు. దాడులకు వ్యతిరేకంగా ప్రపంచంలో అనేక దేశాల్లో నిరసనలు వెల్లువెత్తుతున్నా అమెరికా ప్రోత్సాహంతో ఇజ్రాయిల్ ఏ మాత్రమూ వెనక్కు తగ్గడం లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను తక్షణమే ఆపేయాలని కోరుతూ ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్ష పార్టీలు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నిరసనలో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, పెద్దయెత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విశాఖ ఉక్కు పోరాటానికి సంపూర్ణ మద్దతు

- టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంటు పరిరక్షణ పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు నిరసనగా పోరాట కమిటీ చేపట్టిన ఉద్యమానికి వెయ్యిరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఒక ప్రకటనలో కార్మికులకు ఆయన ఉద్యమాభివందనాలు తెలిపారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో ప్రజలు సాధించుకున్న స్టీల్ ప్లాంటు జగన్ అనే అవినీతి నేరపాలకుడి వల్ల ప్రైవేటు పరమవుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన దిశ యాప్ పేరుతో ఏదో దందా నడుస్తోందని మరో ప్రకటనలో లోకేష్ పేర్కొన్నారు. మహిళలు డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన యాప్‌ను పురుషుల మొబైళ్లలో బలవంతంగా డౌన్‌లోడ్ చేయించడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. అనకాపల్లి జిల్లా రేగుపాలేనికి చెందిన సైనికుడు సయ్యద్ అలీముల్లాపై పోలీసులు గూండాల్లా దాడి చేయడం దారుణమన్నారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టుల కేసు విచారణ కోసమని నరసరావుపేట నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డిని అక్రమ మద్యం కేసులో ఇరికించారని మరో ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై 100 రోజుల యాక్షన్ ప్లాన్

- టిడిపి పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్లాలని టిడిపి పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్ణయించింది. ఉండవల్లిలోని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నివాసంలో బుధవారం ఈ సమావేశం జరిగింది. టిడిపి-జనసేన ఉమ్మడి ఆత్మీయ సమావేశాలను నియోజకవర్గ స్థాయిలో నిర్వహించాలని నాయకులు నిర్ణయించారు. ఉమ్మడి మేనిఫెస్టో, ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్లు, వైసిపి హయాంలో జరుగుతున్న దోపిడీపై ఆయా సమావేశాల్లో చర్చించాలని పేర్కొన్నారు. కృష్ణా జలాలు, విద్యుత్ ఛార్జీల పెంపు, కరువు వంటి అంశాలపై నియోజకవర్గ స్థాయిలో పోరాడాలని నిర్ణయించారు. నిరుద్యోగ సమస్య, రోడ్లు, పేదల గృహనిర్మాణంలో అవకతవకలు, నిత్యావసర వస్తువుల ధరల పెంపు, ఇసుక దోపిడీ వంటి అంశాలను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి వారి తరపున పోరాడాలని నిర్ణయించారు. దళితులపై జరుగుతున్న దమనకాండను జాతీయ స్థాయిలో ఎండగడుతూ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని పేర్కొన్నారు. భారీ దళిత గౌరవ సభ నిర్వహించాలని, జగన్ పాలనలో నెలకొన్న దళితుల హత్యలు, స్కీమ్‌ల రద్దు, వేధింపులు వంటివాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. బిసిలకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర వ్యాప్తంగా 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలన్నారు. మైనార్టీలకు జరుగుతున్న అన్యాయం, దాడులపై మతపెద్దలు, తటస్థులు, మైనార్టీల హక్కుల కోసం పోరాడే సంఘాలతో కలిసి సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో మైనార్టీ ముఖ్యనేతలు నాలుగు బృందాలుగా ఏర్పడి 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని ఓటరు జాబితా అవకతవకలపై ఎంపిలు, పార్టీ ముఖ్యనేతలు త్వరలో సిఇసిని కలవాలని నిర్ణయించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు, ఒక్కో కుటుంబానికి జరిగే మేలును వివరిస్తూ రూపొందించిన బాండ్స్‌ను ప్రజలకు అందజేయాలని తెలిపారు. కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులకు సంబంధించి న్యాయ పోరాటానికి పార్టీ తరపున న్యాయ సహాయం అందించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, నక్కా ఆనంద్‌బాబు, వంగలపూడి అనిత, ఎంఎ షరీఫ్, కొల్లు రవీంద్ర, రామానాయుడు, పయ్యావుల కేశవ్, బిసి జనార్ధన్ రెడ్డి, అశోక్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థుల అరెస్టులకు సిపిఎం ఖండన

- కేంద్ర ద్రోహానికి రాష్ట్రం వత్తాసా?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్టీలు ప్లాంటు అమ్మకానికి వ్యతిరేకంగానూ, కడప స్టీలు ప్లాంటు చేపట్టాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన చేస్తుంటే సమర్థించాల్సిన ప్రభుత్వం నిర్బంధానికి దిగడం గర్హనీయమని అన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై వారు ఆందోళన చేస్తున్నారని, కడపలో స్టీలు ప్లాంటు నిర్మాణం చేపడితే చదువుకున్న యువతకు ఉపాధి దొరుకుతుందని, అదేమీ చేయని కేంద్రానికి రాష్ట్రం వత్తాసు పలకడం శోచనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇదే వైఖరి కొనసాగిస్తే ప్రజాకోర్టులో ప్రజల ముందు దోషిగా నిలబడాల్సి వస్తుందని శ్రీనివాసరావు హెచ్చరించారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయండి : సిఎం జగన్

- కృతజ్ఞతలు తెలిపిన జర్నలిస్ట్ సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలని ప్రభుత్వ నిర్ణయం పట్ల జర్నలిస్ట్ సంఘాలు, పలువురు సీనియర్ జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ.. ముఖ్యమంత్రిని బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్రావ్, జి ఆంజనేయులు, ఎపి ఎడిటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వివిఆర్ కృష్ణంరాజు, ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు విజయ్‌భాస్కర్, సీనియర్ జర్నలిస్టులు కెబిజి తిలక్, ధారా గోపి, అప్పాజి, ఎమ్‌డి ఇలియాస్, నేమాని భాస్కర్, ఎం రమణమూర్తి, ఎస్ హసీనా, రెహానా, మస్తాన్‌రావు, సతీష్, రవీంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు సిఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క జర్నలిస్టుకూ రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల స్థలాలు ఇవ్వడం జర్నలిస్టులందరికీ సంతోషించదగ్గ విషయమన్నారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాల విషయంలో ఎప్పటికప్పుడు పురోగతిని తనకు నివేదించాలని సిఎం పేర్కొన్నారు. జాప్యానికి తావు లేకుండా, భూముల గుర్తింపు సహా తదితర అంశాలపై నిర్దిష్టమైన ప్రణాళిక ఏర్పాటుచేసుకుని ముందుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సమాచారశాఖ కమిషనరు టి విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ అభివృద్ధిని వివరించేందుకే వై ఎపి నీడ్స్ జగన్

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించేలా మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఎందుకు కావాలనే వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహించనున్నట్లు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని వివరించారు. అడ్డదారిలో అధికారంలోకి వచ్చేందుకు టిడిపి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. 2014-19 టిడిపి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, ప్రజా వ్యతిరేక విధానాలు, వైసిపి హయాంలో 2019 నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సచివాలయాల వారీ వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు.

బస్టేషన్ ప్రమాదంలో రాష్ట్ర ప్రభుత్వమే దోషి

- సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ బస్టేషన్‌లో జరిగిన ప్రమాదంలో రాష్ట్ర ప్రభుత్వమే దోషి అని సిఐటియు పేర్కొంది. ఈ మేరకు బుధవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదంపై ఆర్‌టిసి మేనేజ్‌మెంటు విచారణ కమిటీ వేసిందని, కమిటీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా బస్సు డ్రైవర్, కింది స్థాయి అధికారులను బాధ్యులుగా చేస్తూ ఆర్‌టిసి మేనేజ్‌మెంటు చర్యలు తీసుకుందని తెలిపారు. వాస్తవంగా ఈ ప్రమాదానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. పల్లెవెలుగు నుంచి పై స్థాయిలోని వోల్వో బస్సుల వరకు అత్యధికం కాలం తీరినవే అయినప్పటికీ, వాటి స్థానంలో కొత్తవి కొనకుండా యథాతథంగా కొనసాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు బాధ్యత వహించాలన్నారు. ఆదాయంలో వాటాను తీసుకోవడంలో ఉన్న శ్రద్ధ కొత్త బస్సులను, స్పేర్ పార్ట్స్‌ను కొనడంలో చూపించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి కార్మికుల పనిభారాన్ని తగ్గించాలని, ప్రమాదానికి కారణమైన విధానాలను సవరించుకోవడానికి నిరాకరిస్తోందని, ఈ ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

వైఎస్‌ భాస్కర్‌ రెడ్డికి మధ్యంతర బెయిల్‌

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్‌ వివేకా హత్య కేసులో అభియోగాలను ఎదుర్కొంటున్న వైఎస్‌ భాస్కర్‌రెడ్డికి మధ్యంతర బెయిల్‌ మంజూరైంది. నవంబర్‌ 30వ తేదీ వరకు ఆయనకు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్‌ను సిబిఐ కోర్టు బుధవారం మంజూరు చేసింది. డిసెంబర్‌ 1న ఉదయం 10.30 గంటలకు చంచల్‌గూడ జైలుకు వెళ్లాలని ఆదేశించింది. అలాగే కోర్టులో భాస్కర్‌రెడ్డి తన పాస్‌పోర్టును సరెండర్‌ చేయడంతోపాటు తన చిరునామా వివరాలను కోర్టుకు, సిబిఐకి ఇవ్వాలని స్పష్టం చేసింది. చికిత్స కోసం వెళ్లాల్సి వస్తే ఆ వివరాలను సిబిఐకి తెలపాలని షరతుల్లో పేర్కొంది. కుటుంబ సభ్యులను తప్ప మిగతా ఎవరినీ కలవొద్దని తెలిపింది. సెప్టెంబర్‌ 20 నుంచి వైఎస్‌ భాస్కర్‌రెడ్డి ఎస్కార్ట్‌ బెయిల్‌పై ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ బెయిల్‌ను మధ్యంతర బెయిల్‌గా మారుస్తూ సిబిఐ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఇసుక కేసుపై విచారణ వాయిదా

- చంద్రబాబుపై చర్యలు తీసుకోబోం
- హైకోర్టుకు సిఐడి హామీ

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి అధికారంలో ఉండగా ఉచిత ఇసుక విధానం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వచ్చిందంటూ సిఐడి నమోదు చేసిన కేసులో నిందితుడుగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తొందరపాటు చర్యలు తీసుకోబోమని హైకోర్టుకు సిఐడి తెలియజేసింది. ఇసుక విధానంపై సిఐడి నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్‌ మంజూరు చేయాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్‌ తల్లాప్రగడ మల్లికార్జునరావు విచారణ చేపట్టారు. పిటిషనరు స్కిల్‌ స్కాం కేసులో అనారోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్‌ పొందారని, ఆ బెయిల్‌ గడువు అయ్యే వరకు ఇసుక కేసులో ఆయనపై చర్యలు తీసుకోబోమని సిఐడి తరపు న్యాయవాది శివకల్పనారెడ్డి హామీ ఇచ్చారు. ఇసుక కేసులో కౌంటర్‌ దాఖలుకు గడువు కావాలని కోరారు. అందుకు అనుమతినిచ్చిన హైకోర్టు తదుపరి విచారణ ఈ నెల 20కు వాయిదా వేసింది. టిడిపి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వచ్చిందంటూ గనులశాఖ డైరెక్టరు, ఎపి మైనింగ్‌ డెవలప్‌మెంటు కార్పొరేషన్‌ ఎమ్‌డి వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా చంద్రబాబుపై ఎపి సిఐడి కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్‌ మంజూరు చేయాలని చంద్రబాబు తరపున సీనియర్‌ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు కోరారు.

విశాఖ పోర్టు ఆదాయానికి అదానీ గండి

- 'గ్యారెంటీ కార్గో'పై దొంగ దెబ్బ!
- తమిళనాడు విద్యుత్‌ బోర్డు నుంచి గంగవరానికి మళ్లింపు
- -ఏడాదిలో రూ.70 కోట్లు చిల్లు

ప్రజాశక్తి - గ్రేటర్‌ విశాఖ బ్యూరో

ప్రజల సంపదను కొల్లగొట్టి, ప్రభుత్వ రంగ సంస్థల ఆదాయాన్ని దెబ్బకొట్టే దిశగా అదానీ గ్రూపు కేంద్రంలోని బిజెపితో అడ్డగోలు లాబీయింగ్‌కు పాల్పడుతోంది. గతంలో విశాఖ ఓడరేవులో బెర్తు తీసుకుని సంవత్సరాల తరబడి దాన్ని ఖాళీగా ఉంచేసి కార్గో వ్యాపారం చేయకుండా పోర్టు ఆదాయానికి రూ.వందల కోట్లు నష్టం తెచ్చిన ఈ గ్రూపును వైజాగ్‌ పోర్టు అధికారులు బెదిరింపు అనర్హులుగా ప్రకటించిన విషయం విదితమే. అదానీ గ్రూపు విశాఖ పోర్టుకు ఇతర రాష్ట్రాలతోగల 'గ్యారెంటీ కార్గో'ను దెబ్బతీసే చర్యలకు దిగింది. 40 ఏళ్లుగా విశాఖ పోర్టుకు తమిళనాడు విద్యుత్‌ బోర్డు నుంచి వెళ్ళే థర్మల్‌ కోల్‌ కార్గోను కేంద్రంతో అడ్డగోలు లాబీయింగ్‌ జరిపించి మళ్లించి తన సొంత పోర్టు గంగవరానికి చేర్చుకున్నాడు. దీంతో, 2.5 మిలియన్‌ టన్నుల థర్మల్‌ కోల్‌ గంగవరం పోర్టుకు మళ్లిపోయింది.

అదానీ ఇంకా పోర్టులో అడుగుపెట్టలేదనుకుని ఏమరుపాటుగా ఉన్న వైజాగ్‌ పోర్టు అధికారులకు ఇదొక రకంగా దొంగ దెబ్బే. ఇప్పటికి పోర్టు అధికారులు తేరుకుని హుటాహుటిన చెన్నయ్‌ బయల్దేరి తమిళనాడు ఎలక్ట్రిసిటీ బోర్డు ఉన్నతాధికారుల వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. గతంలో వైజాగ్‌ స్టీల్‌ప్లాంట్‌కు ఏటా అరమిలియన్‌ టన్నుల కోల్‌ ఆస్ట్రేలియా నుంచి వైజాగ్‌ పోర్టుకు వచ్చేది. దాన్ని అదానీ గంగవరం పోర్టు తన్నుకుపోయిన విషయం తెలిసిందే.

అదానీ వెనక ప్రధాని!

సుమారు 40 సంవత్సరాల నుంచి విశాఖ పోర్టును తమిళనాడు విద్యుత్‌ బోర్డు వ్యాపార భాగస్వామిగా చేసుకుని 'గ్యారెంటీ కార్గో'కు సహకారం అందిస్తోంది. ఒడిశా రాష్ట్రంలోని ఐబి వ్యాలీ నుంచి విశాఖకు రైలు మార్గంలో ఏటా 2.5 మిలియన్‌ టన్నుల థర్మల్‌ కార్గో వస్తోంది. దీన్ని కోల్‌ షిప్పుల ద్వారా తమిళనాడుకు సేల్‌ చేస్తారు. రైలు ర్యాకులలో ఐబి వ్యాలీ నుంచి అన్‌లోడింగ్‌ అవ్వడం ఆనవాయితీ. ఆ తర్వాత విశాఖ పోర్టు ద్వారా చెన్నయ్‌, ట్యుటికోరిన్‌కు ఈ థర్మల్‌ కోల్‌ వెళ్లేది. ఎన్నాళ్లుగానో అన్‌లోడింగ్‌ చేస్తారు. రైలు మార్గంలో వచ్చే ఈ సరుకును విశాఖ పోర్టు సిబ్బంది అన్‌లోడింగ్‌ చేసి పోర్టు స్టాక్‌ యార్డుల్లో ఉంచి షిప్పుల్లోకి తరలించినందుకు ఆదాయం లభించేది. ఇది విశాఖ పోర్టుకు వచ్చే గ్యారెంటీ కార్గో. తద్వారా ఏటా రూ.70 కోట్ల ఆదాయం లభించేది. 2022-2023 సంవత్సరంలో తమిళనాడు ఎలక్ట్రిసిటీ బోర్డు నుంచి ఈ ఆర్డర్‌ విశాఖ పోర్టుకు రాలేదు. పోర్టు అధికారులు ఆరా తీయగా అదానీ అడ్డంకి గంగవరం పోర్టుకు మళ్లించుకున్న విషయం తెలుసుకున్నారు.

ఉన్నతాధికారులే మేలుకున్నారంటే!

మూడు రోజుల క్రితమే పోర్టు ట్రాఫిక్‌ డిపార్టుమెంట్‌, పోర్టు అడ్మినిస్ట్రేటివ్‌ అధికారి కార్యాలయ సిబ్బంది చెన్నయ్‌కు వెళ్లి పరిస్థితిపై ఆరా తీశారు. థర్మల్‌ కోల్‌ సరుకు రవాణాకు విశాఖ పోర్టు రూ.190 వసూలు చేస్తుండగా, గంగవరం పోర్టు అంతకన్నా తక్కువకే చేస్తోందని విద్యుత్‌ బోర్డు అధికారులు చెప్తున్నారు.

హాస్టళ్లలో వసతుల కొరతపై కదలిక

- గోడి పాఠశాలకు రూ.84 లక్షలు కేటాయింపు
- వెంటనే పనులు చేపట్టాలని హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

బిఆర్‌ అంబేద్కర్‌ కోనసీమ జిల్లా, జి అల్లవరం మండలం, గోడి గ్రామంలోని డాక్టర్‌ బిఆర్‌ అంబేద్కర్‌ గురుకుల బాలురు పాఠశాల/జూనియర్‌ కాలేజీలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.84 లక్షలు మంజూరు చేసిందని హైకోర్టుకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సి సుమన్‌ తెలిపారు. పిటిషనరు తరపున సీనియర్‌ న్యాయవాది సత్యప్రసాద్‌ వాదిస్తూ.. కోర్టు కల్పించుకున్నాకే ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. ఇదే పరిస్థితుల్లో రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్స్‌ ఉన్నాయన్నారు. గోడి పాఠశాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ న్యాయవాది పి బాబ్జీ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై నివేదిక సమర్పించాలని గతంలో రాజమండ్రి ప్రిన్సిపల్‌ డిస్ట్రిక్‌ జడ్జికి హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు వివరాలను డిస్ట్రిక్‌ జడ్జి అందజేశారు. పాఠశాలలో మొత్తం 400 మంది విద్యార్థులకు రెండే టాయిలెట్స్‌ ఉన్నాయని, నేలపైనే విద్యార్థులు నిద్రపోతున్నారని, పరుపులు, మంచాలు లేవని నివేదికలో పేర్కొన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, గోడీ రెసిడెన్షియల్‌ పాఠశాల కోసం కేటాయించిన రూ.84 లక్షలు సద్వినియోగం చేసేందుకు పనుల పర్యవేక్షించాలని ఇద్దరు ఇంజినీర్లను ఆదేశించింది. పనుల నాణ్యతపై నివేదిక కూడా తెప్పించుకుంటామని తెలిపింది. పనుల ప్రమాణాలకు ఇద్దరు ఇంజినీర్లు బాధ్యత వహించాలంది. పనుల తీరు తెన్నులపై స్టేటస్‌ రిపోర్టు సమర్పించాలని సాంఘిక సంక్షేమశాఖను ఆదేశించింది. విచారణను 4 వారాలకు వాయిదా వేస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ధీరజ్‌ సింగ్‌ ఠాకూర్‌, జస్టిస్‌ ఆర్‌ రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ప్రకటించింది.

Paper Publication
(Substituted Service)
FORM NO.14
[See Regulation 33 (2)]

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam, Sai Baba Street,
Daba Gardens, Visakhapatnam - 530020

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME-TAX ACT, 1961)

R.P.No.48 of 2021 in OA No.955 of 2017

Bank of Baroda (e-Dena Bank), Governorpeta Branch,
Vijayawada, Krishna District
Versus
M/s Suresh Enterprises & Others

To
(CD 1) M/s. Suresh Enterprises, rep by its proprietor Sri Maddineni Suresh, D.No.3-28-18/167, 5th lane, Rajendra Nagar, Guntur-522006
(CD 2) Sri Maddineni Suresh, S/o. M.Rama Rao, D.No.3-28-18/167, 5th lane, Rajendra Nagar, Guntur-522006
(CD 3) Sri Maddineni Sudhakar, S/o. M.Rama Rao, Flat No.1, Chalapathhi Paradise, 2nd Line, Venkataramana Colony, Guntur-522006

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL VISHAKHAPATNAM in OA/955/2017 an amount of Rs.1,14,09,646/- along with pendentellite and future interest @ 11.00 % p.a. with Monthly rests minus Rs.1,03,31,000/- (realized by way of sale of property through e-auction which is conducted on 07-02-2019; Part satisfaction memo was also filed on 10-02-2020) w.e.f. 24-10-2017 till realization and costs has become due against you (Jointly and severally / Fully / Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on 25/11/2023 at 10:30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay : -
   (a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
   (b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date: 07/08/2023

(B.N.S.V.S.K.BANGARRAJU)
Recovery Officer

ఎమ్మెల్యేను అరెస్టు చేస్తున్న పోలీసులు

మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల అరెస్టు

- గ్రావెల్‌ తవ్వకాల పరిశీలనను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - మండపేట(డాక్టర్‌ బిఆర్‌.అంబేద్కర్‌ కోనసీమ)

గ్రావెల్‌ తవ్వకాల పరిశీలనకు వెళ్తున్న డాక్టర్‌ బిఆర్‌ అంబేద్కర్‌ కోనసీమ జిల్లా మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టిడిపి అమలాపురం పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గంటి హరీష్‌మాథుర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకూ వారిని పోలీస్‌స్టేషన్‌లోనే నిర్బంధించారు. మండపేట మండలం కేశవరం గ్రామంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామనే నెపంతో చదును పేర ఎర్ర గ్రావెల్‌, మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వయంగా తవ్వకాల వద్దకు పరిశీలనకు బుధవారం ఉదయం ఆయన ఇంటి నుంచి హరీష్‌ మాథూర్‌తో కలిసి బయలు దేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని గృహనిర్బంధం చేసేందుకు ప్రయత్నించారు. టిడిపి, నాయకులు అడ్డుకోవడంతో కొద్దిపాటి ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యేతో పాటూ మాథూర్‌ను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి కపిలేశ్వరపురం మండలం అంగర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాత్రి ఏడు గంటల వరకూ అక్కడే నిర్బంధించి, అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ అరెస్టును తీవ్రంగా ఖండించారు. పోలీసు యంత్రాంగం ప్రభుత్వానికి తొత్తుగా మారిందన్నారు. అక్రమాలను నిలదీస్తున్న ప్రతిపక్ష నేతలపై పోలీసులను అడ్డంపెట్టుకుని వైసిపి ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయిస్తోందని, అక్రమ పాలనకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు.

ధాన్యం రవాణా వాహనాలకు జిపిఎస్‌ బిగించే నిర్ణయాన్ని ఉపసంహరించాలి

- ఆంధ్రప్రదేశ్‌ కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ధాన్యం రవాణా చేసే వాహనాలకు జిపిఎస్‌ అమర్చాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రం తూచ తప్పకుండా అమలు చేయడానికి రాష్ట్రం సిద్ధమైందని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్‌ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ, ఎం హరిబాబు కోరారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. రైతులు ధాన్యాన్ని బ్లాక్‌ మార్కెట్‌కు తరలించే పరిస్థితి రాష్ట్రంలో లేదని, కానీ రూ.2,950 పెట్టి యంత్రాన్ని అమర్చుకోవాలనడం సరికాదని అన్నారు. అలాగే ఎడ్లబండికి కూడా జిపిఎస్‌ యంత్రాన్ని పెట్టాలంటున్నారని ఆగ్రహించారు. రైతులు యంత్రాన్ని కొనుక్కుని పెట్టుకోవాలని, లేనిపక్షంలో అధికారులే బిగించి రైతు నుండి మొత్తాన్ని రాబట్టాలని ఆదేశించడం వేధించడమేనని అన్నారు. సొంత ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని తరలించుకున్నా భారం పడే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. జిపిఎస్‌ యంత్రం పెట్టిన భారాన్ని వాహన యజమానులు రైతుల మీదే వేస్తారని, ఈ నేపథ్యంలో జిపిఎస్‌ యంత్రం పెట్టాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

10న శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శన కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుమల

డిసెంబరు 23 నుండి జనవరి 1వ తేదీ వరకు శ్రీవారి దర్శనానికి సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, శ్రీవాణి దర్శన టికెట్లు, గదుల కోటాను నవంబరు 10న టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను ఉదయం 10 గంటలకు, రూ.20 వేల శ్రీవాణి దర్శన టికెట్లను మధ్యాహ్నం 3 గంటలకు, గదుల కోటాను సాయంత్రం 5 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామని టిటిడి పేర్కొంది.

ICICI Home Finance

కార్పోరేట్‌ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్‌ ఫైనాన్స్‌ కంపెనీ లిమిటెడ్‌ ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్‌, అందేరి -కుర్లా రోడ్‌, అందేరి (ఈస్ట్‌), ముంబాయి-400059, ఇండియా

శాఖ కార్యాలయం: సుప్రియ టవర్స్‌, అప్పర్‌ గ్రౌండ్‌ ఫ్లోర్‌, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్‌-522002

[రూల్‌ 8(6)కు నిబంధన చూచుట]

స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ (ఎన్‌ఫోర్స్‌మెంట్‌) రూల్స్‌, 2002 యొక్క రూల్‌ 8(6)కు నిబంధనతో చదువుతూ సెక్యూరిటైజేషన్‌ అండ్‌ రీకన్‌స్ట్రక్షన్‌ ఆఫ్‌ ఫైనాన్షియల్‌ అస్సెట్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఆఫ్‌ సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ యాక్ట్‌, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు.

సెక్యూర్డ్‌ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖపెట్టిన/చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్‌ ఫైనాన్స్‌ కంపెనీ లిమిటెడ్‌ యొక్క అధీకృత అధికారి ద్వారా లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఆ పద్ధతిన" మరియు "ఏదిఏమైనా ఆవిధంగా" విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది, సంక్షిప్త వివరాల ప్రకారం దిగువ ఇవ్వబడినాయి;

క్ర. సం	రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీతలు/ హామీదారులు/చట్టబద్ధ వారసుల పేర్లు/ లోను ఖాతా నం.	ఏవైనా తెలిసిన రుణభారాలతో సెక్యూర్డ్‌ అస్సెట్‌(ల) వివరాలు,	మొత్తం బకాయిలు	రిజర్వ్‌ ధర / బయానా మొత్తం	ఆస్తి తనిఖీ తేది మరియు సమయం	వేలం తేది మరియు సమయం
(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)
1.	లక్కెపోగు బుజ్జి (రుణగ్రహీత), లక్కెపోగు రాజు (సహ రుణగ్రహీత) లోను ఖాతా నం.: LHGTR00001395671 & LHGTR00001400444	గుంటూరు, నరసరావుపేట ఉపజిల్లా పరిధి, ములకలూరు గ్రామం యొక్క డో.నం.531లో రెసిడెన్షియల్‌ ఇల్లు	Rs. 28,85,278/- October 31, 2023	Rs. 29,97,750/- / Rs. 2,99,780/-	December 04, 2023 11:00 AM 03:00 PM	December 19, 2023 02:00 PM 03:00 PM

మా వేలం ఏజెన్సీ గ్లోబ్‌టెక్‌ వెబ్‌సైట్‌ (URL Link-https://BestAuctionDeal.com) మీద ఆన్‌లైన్‌ వేలం నిర్వహించబడును. 18 డిసెంబర్‌, 2023న సా.5.00 గం.లలోపు వరకు తదుపరి వడ్డీతో మొత్తం బకాయిలు చెల్లించుటకు తనాఖదారులు/నోటీసు ఇవ్వడమైనది లేకపోతే ఈ సెక్యూర్డ్‌ అస్సెట్స్‌ పైన షెడ్యూల్‌ ప్రకారం విక్రయించబడును.

కాగోరు బిడ్డర్‌(లు) బయానా (ఇఎండి) ఆర్‌టిజిఎస్‌/డిమాండ్‌ డ్రాఫ్ట్‌ (డిడి) (కాలమ్‌ ఇ చూచుట) ఐసిఐసిఐ హోమ్‌ ఫైనాన్స్‌ కంపెనీ లిమిటెడ్‌, సుప్రియ టవర్స్‌, అప్పర్‌ గ్రౌండ్‌ ఫ్లోర్‌, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్‌-522002 లేదా 18 డిసెంబర్‌, 2023న సా.04:00 గం.లలోపు దాఖలు చేయాలి. దయచేసి గమనించండి, కాగోరు బిడ్డర్‌(లు) ఒకవేళ పైన పేర్కొన్న సమయం ప్రకారం వారి ఆఫర్‌ దాఖలు చేయనట్లయితే అప్పుడు టెండర్‌ డాక్యుమెంట్‌ల యొక్క సంతకంచేసిన కాపీ ఐసిఐసిఐ హోమ్‌ ఫైనాన్స్‌ కంపెనీ లిమిటెడ్‌, సుప్రియ టవర్స్‌, అప్పర్‌ గ్రౌండ్‌ ఫ్లోర్‌, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్‌-522002 లేదా 18 డిసెంబర్‌, 2023న సా.05:00 గం.లలోపు దాఖలు చేయాలి. బయానా డిమాండ్‌ డ్రాఫ్ట్‌ (డిడి) "ఐసిఐసిఐ హోమ్‌ ఫైనాన్స్‌ కంపెనీ లిమిటెడ్‌-ఆక్షన్‌" పేరిట ఏదైనా జాతీయ/షెడ్యూల్డ్‌ బ్యాంక్‌ నుండి గుంటూరు వద్ద చెల్లించాలి.

తనిఖీకి సంబంధించిన ఏదైనా తదుపరి వివరణలకు, వేలం నియమాలు మరియు షరతులు లేదా టెండర్ల దాఖలు, 7021072869 మీద ఐసిఐసిఐ హోమ్‌ ఫైనాన్స్‌ కంపెనీ లిమిటెడ్‌ను లేదా మా సేల్స్‌ అండ్‌ మార్కెటింగ్‌ పాట్నర్‌ నెక్సెన్‌ సొల్యూషన్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ను దయచేసి సంప్రదించండి.

అధీకృత అధికారి ఎలాంటి కారణం చూపకుండా అన్ని బిడ్‌లు లేదా ఏదైనా తిరస్కారం చేసే హక్కు కలదు. విక్రయం వివరాణత్మక నియమాలు మరియు షరతులు, https://www.icicihfc.com/ దయచేసి చూడండి..

తేది: 09 నవంబర్‌, 2023
ప్రదేశం: గుంటూరు

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్‌ ఫైనాన్స్‌ కంపెనీ లిమిటెడ్‌

విద్యాభివృద్ధికి కృషి

- ప్రవీణ్‌ ప్రకాష్‌

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమగ్ర శిక్ష ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ ప్రకాష్‌ అన్నారు. సమగ్ర శిక్ష 7వ కార్యవర్గ సమావేశం ప్రవీణ్‌ ప్రకాష్‌ అధ్యక్షతన బుధవారం జరిగింది. సమగ్ర శిక్ష కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ద్వారా అత్యుత్తమ కార్యక్రమాలు అమలు చేసే రాష్ట్రాలుగా ఎపితోపాటు హర్యానా, ఉత్తరప్రదేశ్‌ నిలిచాయని చెప్పారు. ప్రఖ్యాత కార్యక్రమాల నివేదికలను జాతీయ స్థాయిలో ప్రదర్శించే అవకాశం ఈ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం కల్పించడం గర్వకారణమని తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో ఇండియా టుడే ఆధ్వర్యాన తిరుపతిలో జరిగే సభల్లో సమగ్ర శిక్ష తరపున చేపడుతున్న విద్యాసంస్కరణలను వివరించేందుకు అవకాశం దక్కిందని సమగ్ర శిక్ష డైరెక్టరు బి శ్రీనివాసరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్‌ సురేష్‌కుమార్‌ పాల్గొన్నారు.

దొంగ ఓట్ల కోసమే సచివాలయ వ్యవస్థ

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు
- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దొంగ ఓట్ల కోసమే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసినట్లు కనిపిస్తోందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. ఈ వ్యవస్థ ఎన్నికల ప్రక్రియలో వేలుపెట్టి ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడటం రివాజుగా మారిందని ఆరోపించారు. ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ముకేష్‌కుమార్‌ మీనాను సచివాలయంలో టిడిపి నాయకులతో కలిసి ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఒక్కో వ్యక్తికి మూడు, నాలుగు చోట్ల దొంగ ఓట్లు కల్పించారని, ప్రభుత్వ పెద్దలు, మంత్రులుగా ఉన్నవారికి కూడా ఉన్నాయని వివరించారు. కేవలం దొంగ ఓట్లతోనే వచ్చే ఎన్నికల్లో గెలవాలని జగన్‌ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన తప్పులను జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్తున్నా.. స్పందించకపోవడంతో రాష్ట్ర ఎన్నికల కమిషనరును కలుస్తున్నామని వివరించారు. పైస్థాయి నుంచి వచ్చే ఆదేశాలను జిల్లా కలెక్టర్లు బుట్టదాఖలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే వాటిని పరిష్కరించడం లేదని తెలిపారు. మరలా కొత్తగా ఫామ్‌-6, ఫామ్‌-7, ఫామ్‌-8 ఇతర వివరాలు అడగడం సరికాదన్నారు. దొంగ ఓట్ల నమోదు, అర్హుల ఓట్లు తొలగింపు, ఓటర్ల జాబితాలో తప్పులు చేస్తున్న కిందిస్థాయి అధికారులు, వారికి సహకరిస్తున్న కలెక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామని చెప్పారు. విజయవాడ సెంట్రల్‌ నియోజకవర్గంలో 12 వేల దొంగ ఓట్లు చేర్చారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. అచ్చెన్నాయుడుతోపాటు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంఎ షరీఫ్‌, వర్ల రామయ్య, ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు, అధికార ప్రతినిధి మాణిక్యరావు తదితరులు ఉన్నారు.

సోషల్‌మీడియాలో అసభ్య పోస్టులు పెడితే చర్యలు తప్పవు

- సిఐడి చీఫ్‌ ఎన్‌ సంజయ్‌

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగేలా సోషల్‌ మీడియాతో అసభ్యంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐడి చీఫ్‌ ఎన్‌ సంజయ్‌ తెలిపారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సోషల్‌ మీడియాలో వస్తున్న పోస్ట్‌లపై నిఘాను పెట్టామని తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డిపైన వారి కుటుంబ సభ్యులపై అసభ్య పోస్టులు పెట్టే వారి ఆస్తులను అటాచ్‌ చేస్తామని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే కొన్ని సోషల్‌ మీడియా అకౌంట్స్‌ గుర్తించామని.. నిందితుల ఆస్తులు కూడా అటాచ్‌ చేసే దిశగా చర్యలు వుంటాయని తెలిపారు. ప్రతిపక్ష నేతలపై సోషల్‌ మీడియాలో వస్తున్న పోస్టులపైనా కూడా చర్యలు ఉంటాయని అన్నారు. న్యాయ వ్యవస్థను కించపరిచేలా పోస్టులు పెట్టిన వారిపై కూడా చర్యలు ఉంటాయని తెలిపారు. విదేశాల నుంచి పెట్టే పోస్టుల విషయంలో ఆయా దేశాల ఎంబసీలతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. 202 సోషల్‌ మీడియా అకౌంట్స్‌ను మానిటరింగ్‌ చేస్తున్నామని వెల్లడించారు. 2 నెలల్లో కొత్తగా 31 కొత్త సోషల్‌ మీడియా అకౌంట్స్‌ గుర్తించామని అన్నారు. అసభ్య పోస్టులను షేర్‌, లైక్‌ చేస్తున్న వారిపై 2,972 సైబర్‌ బుల్లయింగ్‌ షీట్స్‌ ఓపెన్‌ చేసినట్లు తెలిపారు.

IKF FINANCE

ఐకెఎఫ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌

హెడ్‌ ఆఫీస్‌: #40-1-144, కార్పొరేట్‌ సెంటర్‌, ఎం.జి.రోడ్‌, విజయవాడ-520 010.
బ్యాంకు ఇ మెయిల్‌ ఐడి: auctions@ikffinapp.com, ఫోన్‌ నం.: 0866-2474633.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన
అనుబంధం-4-ఎ (రూల్‌ 6(2) మరియు 8(6)కు నియమలను చూడండి)

సెక్యూరిటీ ఇంటెరెస్ట్‌ (ఎన్ఫోర్స్‌మెంట్‌) రూల్స్‌, 2002 యొక్క రూల్‌ 6(2) మరియు 8(6)కు నియమాలతో చదువబడే సెక్యూరిటైజేషన్‌ అండ్‌ రీకన్‌స్ట్రక్షన్‌ ఆఫ్‌ ఫైనాన్షియల్‌ అసెట్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఆఫ్‌ సెక్యూరిటీ ఇంటెరెస్ట్‌ యాక్ట్‌, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన. సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తులు **ఐకెఎఫ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌**కు తాకట్టు/చార్జ్‌చేయబడినవి, వాటిని **ఐకెఎఫ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌** యొక్క అధీకృత అధికారిచేత భౌతికంగా స్వాధీనంచేసుకోబడినవి, పట్టికలో పేర్కొన్న రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి **ఐకెఎఫ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌**కు మిగతా బకాయిలను రాబట్టుట కొరకు ఇ-వేలంలో **"ఎక్కడ ఏది", "ఎలా ఉన్నది అక్కడనే" మరియు "అది అలాగే"** ప్రాతిపదికన విక్రయించబడుతుంది. రుణగ్రహీతలు మరియు హామీదారుల వివరాలు, బకాయి మొత్తాలు, స్థిరాస్తి సంక్షిప్త వివరణ మరియు వాటిపై తెలిసిన రుణభారాలు, స్వాధీనం విధానం, రిజర్వు ధర మరియు ధరావత్తు, వేలం తేది మరియు సమయం ఇక్కడ క్రింద ఇవ్వబడ్డాయి :

రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు/తాకట్టుదారుల పేరు: **(1) మెసెర్స్‌. తేజశ్రీ సాయి అగ్రో ఫారమ్స్‌, మేనేజింగ్‌ పాట్నర్‌ శ్రీ.నెక్కలపు వెంకటేశ్వరరావు, ద్వారా ప్రాతినిధ్యం,** డో.నం.126/1, బయ్యనగూడెం, పెనుబల్లి (గ్రా మరియు మం), ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్ట్రం-507302. 2) నెక్కలపు వెంకటేశ్వరరావు, తండ్రి. జయరామరావు, 3) నెక్కలపు విజయలక్ష్మి, భర్త. ఎన్‌. వెంకటేశ్వరరావు, ఇరువురి నివాసం : డో.నం.25-269, ఎల్‌ఐసి కార్యాలయం రోడ్డు, ఎంప్లాయిస్‌ కాలనీ, నూజివీడు-521201, ఏలూరు జిల్లా, 4) సూర్యదేవర అజయ్‌, తండ్రి. ప్రసాద్‌ సూర్యదేవర, ఫ్లాట్‌ నం.9, భవ్యాస్‌ నందనం, సంగమిత్ర స్కూల్‌ ప్రక్కన, కూకట్‌పల్లి, హైదరాబాద్‌-500072

మొత్తం బకాయి : **08.11.2023 నాటికి రూ.4,50,43,993/- (నాలుగు కోట్ల యాభై లక్షల నలభై మూడు వేల తొమ్మిది వందల తొంభై మూడు రూపాయలు మాత్రమే)** తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు.

స్వాధీనత విధానం : (నిర్మాణాత్మకం/భౌతికం) : భౌతిక స్వాధీనత

ఆస్తుల వివరణ

అంశం నం.1 : నూజివీడు సబ్‌ రిజిస్ట్రీ ఏరియా అధికార పరిధిలో నూజివీడు మున్సిపాలిటీలో ఉన్న ఆస్తి ఆర్‌.ఎస్‌.నం.402/1, డో.నం.24-250 విస్తీర్ణం 335.5 చ.గ.లు. మరియు **హద్దులు : తూర్పు**: 33' అ.లు. వెడల్పు మున్సిపల్‌ రోడ్డు, **దక్షిణం:** మీర్జాపురం ఎస్టేట్‌ ఇరిగేషన్‌ కెనాల్‌, **పడమర:** బసవరాజు కనకదుర్గాంబ ద్వారా ఇతరులకు విక్రయించబడిన ఆస్తి, **ఉత్తరం:** ఇరిగేషన్‌ కెనాల్‌.

అంశం నం.2 : నూజివీడు సబ్‌ రిజిస్ట్రీ ఏరియా అధికార పరిధి, నూజివీడు మున్సిపాలిటీలో ఉన్న ఆస్తి ఆర్‌.ఎస్‌.నం.404, డో.నం.25-283 విస్తీర్ణం 200 చ.గ.లు. మరియు **హద్దులు : తూర్పు:** తనఖాదారు ఆస్తి, **దక్షిణం:** మోపిదేవి భవాని శంకరరావు ఆస్తి, **పడమర:** తనఖాదారు ఆస్తి, **ఉత్తరం:** సవరం నాగేశ్వరరావు ఆస్తి.

అంశం నం.3 : నూజివీడు సబ్‌ రిజిస్ట్రీ ఏరియా అధికార పరిధి, నూజివీడు మున్సిపాలిటీ లో ఉన్న ఆస్తి ఆర్‌.ఎస్‌.నం.404, డో.నం.25-283 విస్తీర్ణం 200 చ.గ.లు. మరియు **హద్దులు : తూర్పు:** తనఖాదారు ఆస్తి, **దక్షిణం:** మోపిదేవి భవాని శంకరరావు ఆస్తి, **ఉత్తరం:** సవరం నాగేశ్వరరావు ఆస్తి.

అంశం నం.4 : నూజివీడు సబ్‌ రిజిస్ట్రీ ఏరియా అధికార పరిధి, నూజివీడు మున్సిపాలిటీ లో ఉన్న ఆస్తి ఆర్‌.ఎస్‌.నం.404, బ్లాక్‌ నం.25, డో.నం.25-269 విస్తీర్ణం 422.80 చ.గ.లు. మరియు **హద్దులు : తూర్పు** : తనఖాదారు ఆస్తి, **దక్షిణం:** డ్రైనేజి కెనాల్‌, **పడమర:** ఏలప్రోఫ్లు కృష్ణ కుమారి ఆస్తి, **ఉత్తరం:** తనఖాదారు ఆస్తి.

రిజర్వు ధర: రూ.1,96,91,100/-; ధరావత్తు (ఇఎండి): రూ.19,69,110/-

బిడ్‌ పెంపుదలు: రూ.25,000/- మరియు అట్టి గుణాంకాలు. | ఇఎమ్‌డి డిపాజిట్‌: 15.12.2023న లేదా అంతకు ముందు

వేలం తేది మరియు సమయం: 16.12.2023 మరియు సమయం: ఉ.11.00గం.లు నుండి 12.00గం.లు

డిపాజిట్‌ చేయాల్సిన ధరావత్తు (ఇఎండి) వివరాలు: ఇందు దిగువ పేర్కొన్న ఖాతా వివరలకు ఆర్‌టిజిఎస్‌/ఎన్‌ఇఎఫ్‌టి రూపేనా ధరావత్తు మొత్తాన్ని డిపాజిట్‌ చేయవలెను: **ఖాతా నం: 11520200015059, ఐఎఫ్‌ఎస్‌సి: ఎఫ్‌డిఆర్‌ఎల్‌ 0001152, బ్యాంకు పేరు: ది ఫెడరల్‌ బ్యాంక్‌ లిమిటెడ్‌, బ్రాంచి: గవర్నర్‌పేట్‌, విజయవాడ-520 002, నం.ఎల్‌ఐఇఎన్‌ ఖాతా (ఆఫీసు ఖాతా).**

సంప్రదించాల్సిన వ్యక్తి మరియు పరిశీలించు తేది: **శ్రీ డి.శ్రీనివాసరావు, మొబైల్‌ నం.9866509585. తేది: 27.11.2023 నుండి 02.12.2023, ఏదేని పనిదినమున ఉ.11.00 గం. నుండి సా.4.00 గం. మధ్య** అమ్మకం యొక్క వివరణాత్మక నియమలు మరియు నిబంధనల కొరకు, దయచేసి ఐకెఎఫ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌ లో ఇవ్వబడిన లింకు **http://auctions@ikffinapp.com** ను పరిశీలించండి.

తేది: 08.11.2023, ప్రదేశం: నూజివీడు — సం/- అధీకృత అధికారి, ఐకెఎఫ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌

LIC HFL — LIC HOUSING FINANCE LTD — With you, for your dream home

ఎల్‌ఐసి హౌసింగ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌
#27-10-1/1, ఫస్ట్‌ ఫ్లోర్‌, ఉమియా నివాస్‌, అత్తారత్తయ్య స్ట్రీట్‌, గవర్నర్‌పేట, విజయవాడ-520002.

స్వాధీనతా ప్రకటన

SARFA & ESI Act 2002 (అనుబంధం-IV) రూల్‌ 8(1) క్రింద స్థిరాస్తి కొరకు

సెక్యూరిటైజేషన్‌ అండ్‌ రీకన్‌స్ట్రక్షన్‌ ఆఫ్‌ ఫైనాన్షియల్‌ ఎస్సెట్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ఆఫ్‌ సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ చట్టం-2002 సెక్షన్‌ 13(12) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్‌(ఎన్‌ఫోర్స్‌మెంట్‌) రూల్స్‌ 2002 నందలి రూల్‌ 3 క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, **ఎల్‌ఐసి హౌసింగ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌, విజయవాడ ఏరియా ఆఫీస్‌.** యొక్క అధీకృత అధికారి నోటీసులో పేర్కొన్న బకాయిసొమ్ము నోటీసు తేదీ నుండి 60రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా దిగువ పేర్కొన్న ఋణగ్రహీతలను వారిని దిగువ పేర్కొన్న తేదీలలో డిమాండ్‌ నోటీసు జారీచేసినారు.

1) ఋణగ్రహీత పేరు: శ్రీమతి మంగిపూడి వెంకట సాయి నాగ కత్యాయణి (ఋణగ్రహీత / అప్లికెంట్‌), శ్రీ మంగిపూడి పూర్ణచంద్రశేఖర్‌ (సహ-ఋణగ్రహీత/కో-అప్లికెంట్‌), డి.నెం.74-25-1/1, ఫ్లాట్‌ నెం.టిఎఫ్‌-2, VCR ఎస్టేట్స్‌, అశోక్‌నగర్‌, విజయవాడ. **లోన్‌ నెం. 720100001508. డిమాండ్‌ నోటీసు తేది: 27-05-2023. బకాయి సొమ్ము: రూ.25,05,998/-** (అక్షరాల ఇరవై ఐదు లక్షల ఐదు వేల తొమ్మిది వందల తొంభై ఎనిమిది రూపాయలు మాత్రమే) మరియు మొత్తం బకాయి వసూలు అయ్యేవరకు జమకూడు భవిష్య వడ్డీ, ఆకస్మిక ఖర్చులు & వ్యయాలు మొ॥. **సూచనప్రాయ స్వాధీనత తేది: 03-11-2023.**

స్థిరాస్తి యొక్క షెడ్యూలు / వివరములు : షెడ్యూలు-ఎ ఆస్తి: కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, చౌడవరం గ్రామము, చౌడవరం గ్రామపంచాయతీ ఏరియా, సమీప డోర్‌ నెం.3-45, ఆర్‌.యస్‌.నెం.383/9 నందు 1008.27 చ॥గ॥ మొత్తం విస్తీర్ణము గల ఫ్లాట్‌ నెం.1, 2 మరియు 3 రెసిడెన్షియల్‌ స్థలము స్థిరాస్తికి సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** షెడ్యూలు ఆస్తి మరియు ఇతరుల ఆస్తికి హక్కు కలిగిన 33 అ॥ వెడల్పుగల రోడ్డు; **దక్షిణం:** కొడాలి గాంధీ మరియు ఇతరులకు చెందిన ఆస్తి; **పడమర:** మన్నే వెంకటేశ్వరరావు మరియు ఇతరులకు చెందిన ఆస్తి; **ఉత్తరం:** ఫ్లాట్‌ నెం.4.

షెడ్యూలు-బి ఆస్తి: కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, చౌడవరం గ్రామము, చౌడవరం గ్రామపంచాయతీ ఏరియా, మన్నేవారి స్ట్రీట్‌, రామాలయం మరియు వాటర్‌ ట్యాంక్‌ దగ్గర, శ్రీ షిర్డిసాయి ఎన్‌క్లేవ్‌, గ్రౌండ్‌ఫ్లోర్‌లో 842 చ॥అ॥ (ప్లింత్‌ ఏరియా), 200 చ॥అ॥ (కామన్‌ ఏరియా) మరియు స్టిల్ట్‌ ఫ్లోర్‌లో 100 చ॥అ॥ (పార్కింగ్‌ ఏరియా) వెరశి మొత్తము 1142 చ॥అ॥ విస్తీర్ణములోని ఫ్లాట్‌ నెం.101 మరియు అవిభాజ్యపు మరియు అనిర్ధిష్టపు భాగమైన 50.41 చ॥గ॥ లేదా 42.15 చ॥మీ॥ విస్తీర్ణముతో సహా యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** శూన్యాకాశము; **దక్షిణం:** శూన్యాకాశము; **పడమర:** ఉమ్మడి వరండా; **ఉత్తరం:** శూన్యాకాశము.

2) ఋణగ్రహీత పేరు: శ్రీమతి గాయత్రి కొండూరి (ఋణగ్రహీత / అప్లికెంట్‌), ఇంటి నెం.13-281-3, సెకండ్‌ ఫ్లోర్‌, SSS హోమ్స్‌, కానూరు, విజయవాడ. **లోన్‌ నెం. 720100001462. డిమాండ్‌ నోటీసు తేది: 27-05-2023. బకాయి సొమ్ము: రూ.27,66,919/-** (అక్షరాల ఇరవై ఏడు లక్షల అరవై ఆరు వేల తొమ్మిది వందల పంతొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు మొత్తం బకాయి వసూలు అయ్యేవరకు జమకూడు భవిష్య వడ్డీ, ఆకస్మిక ఖర్చులు & వ్యయాలు మొ॥. **సూచనప్రాయ స్వాధీనత తేది: 03-11-2023.**

స్థిరాస్తి యొక్క షెడ్యూలు / వివరములు : షెడ్యూలు-ఎ ఆస్తి: కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, చౌడవరం గ్రామము, చౌడవరం గ్రామపంచాయతీ ఏరియా, సమీప డోర్‌ నెం.3-45, ఆర్‌.యస్‌.నెం.383/9 నందు 1008.27 చ॥గ॥ మొత్తం విస్తీర్ణము గల ఫ్లాట్‌ నెం.1, 2 మరియు 3 రెసిడెన్షియల్‌ స్థలము స్థిరాస్తికి సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** షెడ్యూలు ఆస్తి మరియు ఇతరుల ఆస్తికి హక్కు కలిగిన 33 అ॥ వెడల్పుగల రోడ్డు; **దక్షిణం:** కొడాలి గాంధీ మరియు ఇతరులకు చెందిన ఆస్తి; **పడమర:** మన్నే వెంకటేశ్వరరావు మరియు ఇతరులకు చెందిన ఆస్తి; **ఉత్తరం:** ఫ్లాట్‌ నెం.4.

షెడ్యూలు-బి ఆస్తి: కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, చౌడవరం గ్రామము, చౌడవరం గ్రామపంచాయతీ ఏరియా, మన్నేవారి స్ట్రీట్‌, రామాలయం మరియు వాటర్‌ ట్యాంక్‌ దగ్గర, శ్రీ షిర్డిసాయి ఎన్‌క్లేవ్‌, మూడవ అంతస్తులో 842 చ॥అ॥ (ప్లింత్‌ ఏరియా), 200 చ॥అ॥ (కామన్‌ ఏరియా) మరియు స్టిల్ట్‌ ఫ్లోర్‌లో 100 చ॥అ॥ (పార్కింగ్‌ ఏరియా) వెరశి మొత్తము 1142 చ॥అ॥ విస్తీర్ణములోని ఫ్లాట్‌ నెం.404 మరియు అవిభాజ్యపు మరియు అనిర్ధిష్టపు భాగమైన 50.41 చ॥గ॥ లేదా 42.15 చ॥మీ॥ విస్తీర్ణముతో సహా యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** ఉమ్మడి వరండా; **దక్షిణం:** లిఫ్ట్‌ మరియు శూన్యాకాశము; **పడమర:** శూన్యాకాశము; **ఉత్తరం:** శూన్యాకాశము.

3) ఋణగ్రహీత పేరు: రాపూరు ఆషా (ఋణగ్రహీత), రాపూరు అనీల్‌కుమార్‌ (సహ-ఋణగ్రహీత), నివాసం: డోర్‌ నెం.19-24/4, కెసిపి సిద్ధార్థ స్కూల్‌ దగ్గర, వినాయకనగర్‌, విజయవాడ, కృష్ణా జిల్లా-520007. **లోన్‌ నెం. 711400009380. డిమాండ్‌ నోటీసు తేది: 24-02-2023 మరియు ఇదే డిమాండ్‌ నోటీసు తిరిగివచ్చినందున రెండు దినపత్రికలలో అనగా ఈనాడు మరియు ది హిందూ లో 17-08-2023 న ప్రచురించబడినది. బకాయి సొమ్ము: రూ.25,25,090.14/-** (అక్షరాల ఇరవై ఐదు లక్షల ఇరవై ఐదు వేల తొంభై రూపాయలు మరియు పద్నాలుగు పైసలు మాత్రమే) మరియు మొత్తం బకాయి వసూలు అయ్యేవరకు జమకూడు భవిష్య వడ్డీ, ఆకస్మిక ఖర్చులు & వ్యయాలు మొ॥. **సూచనప్రాయ స్వాధీనత తేది: 03-11-2023.**

స్థిరాస్తి యొక్క షెడ్యూలు / వివరములు : షెడ్యూలు-ఎ ఆస్తి: విక్రయ దస్తావేజు నెం.7175/2021 లోని ఆస్తి. కృష్ణా జిల్లా, విజయవాడ తూర్పు సబ్‌-రిజిస్ట్రార్‌ ఇలాకా, ఎనికేపాడు గ్రామపంచాయతీ ఏరియా, ఎనికేపాడు గ్రామము, ఆర్‌యస్‌ నెం.154/1బి, సమీప డోర్‌ నెం.7-57, అసెస్‌మెంట్‌ నెం.119 నందు 225.5 చ॥గ॥ లేదా 188.54 చ॥మీ॥ విస్తీర్ణములో అవిభాజ్యపు మరియు అనిర్ధిష్టపు భాగమైన 34.5 చ॥గ॥ లేదా 28.846 చ॥మీ॥ స్థలము మరియు మొత్తం స్థలములో నిర్మించిన "శ్రీ సాయి నిలయం" **ఈ దిగువ హద్దులలో: తూర్పు:** కొడాలి వెంకటేశ్వరరావు యొక్క ఆస్తి; **దక్షిణం:** స్థల యజమాని యొక్క మిగిలిన ఆస్తి; **పడమర:** కొడాలి జయలక్ష్మి యొక్క ఆస్తి; **ఉత్తరం:** పంచాయతీ రోడ్డు.

షెడ్యూలు-బి ఆస్తి: "శ్రీ సాయి నిలయం" మూడవ అంతస్తులో 931 చ॥అ॥ (ప్లింత్‌ ఏరియా+బాల్కనీ ఏరియా) లోని ఫ్లాట్‌ నెం.టిఎఫ్‌-1 మరియు 230 చ॥అ॥ కామన్‌ ఏరియా మరియు 20 చ॥అ॥ పార్కింగ్‌ ఏరియాతో సహా యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** శూన్యాకాశము; **దక్షిణం:** శూన్యాకాశము; **పడమర:** శూన్యాకాశము; **ఉత్తరం:** ఉమ్మడి వరండా.

4) ఋణగ్రహీత పేరు: మారీదు మహారాణి (ప్రధాన ఋణగ్రహీత), మారీదు నాగరాజు (సహ-ఋణగ్రహీత), డోర్‌ నెం.9-1, కాస కాలనీ, ఆర్‌సియమ్‌ చర్చి దగ్గర, వణుకూరు, కృష్ణా జిల్లా-521151. **లోన్‌ నెం. 711400008188. డిమాండ్‌ నోటీసు తేది: 24-02-2023 మరియు ఇదే డిమాండ్‌ నోటీసు తిరిగివచ్చినందున రెండు దినపత్రికలలో అనగా ఈనాడు మరియు ది హిందూ లో 17-08-2023 న ప్రచురించబడినది. బకాయి సొమ్ము: రూ.30,66,328.49/-** (అక్షరాల ముప్పై లక్షల అరవై ఆరు వేల మూడు వందల ఇరవై ఎనిమిది రూపాయలు మరియు నలభై తొమ్మిది పైసలు మాత్రమే) మరియు మొత్తం బకాయి వసూలు అయ్యేవరకు జమకూడు భవిష్య వడ్డీ, ఆకస్మిక ఖర్చులు & వ్యయాలు మొ॥. **సూచనప్రాయ స్వాధీనత తేది: 03-11-2023.**

స్థిరాస్తి యొక్క షెడ్యూలు / వివరములు : షెడ్యూలు-ఎ ఆస్తి: విక్రయ దస్తావేజు నెం.4136/2020 లోని ఆస్తి. కృష్ణా జిల్లా, కంకిపాడు సబ్‌-రిజిస్ట్రార్‌ ఇలాకా, పెనమలూరు మండలం, వణుకూరు గ్రామపంచాయతీ, వణుకూరు గ్రామము, సమీప డోర్‌ నెం.1-1, విజిటియమ్‌ ఉడా ఫైల్‌ నెం.సి8-1031/2011, యల్‌పి నెం.35/11, ఆర్‌యస్‌ నెం.210/1, 213 నందు ఆర్‌కేస్‌ శ్రీ లక్ష్మీప్రియ నగర్‌ నందు 1148 చ॥గ॥ లేదా 959.87 చ॥మీ॥ విస్తీర్ణముగల ప్లాట్‌ నెం.12, 13, 14 & 15 స్థలములో అవిభాజ్యపు మరియు అనిర్ధిష్టపు భాగమైన 47 చ॥గ॥ లేదా 39.29 చ॥మీ॥ స్థలము మరియు మొత్తం స్థలములో నిర్మించిన "నవయుగాస్‌ ఆర్‌కె రెసిడెన్సీ" **ఈ దిగువ హద్దులలో: తూర్పు:** 40 అ॥ రోడ్డు; **దక్షిణం:** ఇతరుల స్థలము మరియు చెరువు ఉగ్గాభరణ శ్రీనివాసమూర్తి యొక్క ప్లాట్‌ నెం.16 లో మిగిలిన పార్ట్‌ హద్దు; **పడమర:** 40 అ॥ రోడ్డు; **ఉత్తరం:** 40 అ॥ రోడ్డు.

షెడ్యూలు-బి ఆస్తి: "నవయుగాస్‌ ఆర్‌కె రెసిడెన్సీ" మొదటి అంతస్తులో 868 చ॥అ॥ (ప్లింత్‌ ఏరియా+కామన్‌ ఏరియా) లోని ఫ్లాట్‌ నెం.204 మరియు 217 చ॥అ॥ కార్‌ పార్కింగ్‌ ఏరియాతో సహా యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** శూన్యాకాశము; **దక్షిణం:** శూన్యాకాశము మరియు ఉమ్మడి వరండా; **పడమర:** శూన్యాకాశము; **ఉత్తరం:** శూన్యాకాశము.

పైన పేర్కొనబడిన ఋణగ్రహీతలు బకాయిసొమ్ము చెల్లించడంలో విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్‌ 13(4)తో అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ (ఎన్‌ఫోర్స్‌మెంట్‌) రూల్స్‌ నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఎల్‌ఐసి హౌసింగ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌కు తనఖావుంచిన** ఆస్తులను **సూచనప్రాయ స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా నోటీసు ఇచ్చి తెలియజేయడమైనది. సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదనీ, ఎటువంటి లావాదేవీలైనా బకాయిసొమ్ము మరియు వడ్డీ మరియు ఖర్చులు మొ॥నవి **ఎల్‌ఐసి హౌసింగ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌** వారి ఛార్జీకి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. సదరు చట్టంలో సెక్షన్‌ 13 యొక్క సబ్‌ సెక్షన్‌ (8) ప్రకారం ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తేది: 03-11-2023, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, ఎల్‌ఐసి హౌసింగ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌

సంపాదకీయం

కాలుష్యంపై సమిష్టి పోరు

ఢిల్లీతో పాటు, జాతీయ రాజధాని ప్రాంతం (నేషనల్ క్యాపిటల్ రీజియన్-ఎన్‌సిఆర్)లో వాయు కాలుష్యం ఆందోళనకర రీతిలో పెరుగుతుండటం కలవరం కలిగిస్తోంది. కొద్దిరోజుల క్రితం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ స్కేల్‌పై 500 పాయింట్లకు గానూ 400 పాయింట్ల ప్రమాదకర స్థాయిని దాటి కాలుష్యం నమోదైంది. ఈ నెల 2వ తేది అంతకుముందు రోజుతో పోలిస్తే 68 శాతం పెరిగి 2.5 మైక్రాన్ల పరిమాణానికి కణ కాలుష్యం (పర్టిక్యులేట్ మేటర్-పిఎం) చేరింది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సురక్షిత ప్రమాణం కంటే 30 రెట్లు ఎక్కువ! ఆ తరువాత రోజుల్లో కూడా కొంచెం అటు, ఇటుగా ఈ స్థాయి కాలుష్యం కొనసాగుతూనే ఉంది. ఫలితంగా పెద్ద సంఖ్యలో ప్రజానీకం ఆస్థమా, ఎలర్జీలతో పాటు అనేక రోగాల బారిన పడుతున్నారు. రోడ్లన్నీ పొగతో నిండిపోవడంతో, ఊపిరాడని పరిస్థితి నెలకొంది. మాస్కులు లేనిదే రోడ్ల మీదకు రాలేని పరిస్థితి నెలకొంది. ఈ సీజన్‌లో సహజంగా ఉండే పొగమంచుకు కాలుష్యం తోడు కావడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో దాదాపు ఏడు సంవత్సరాల తరువాత దేశ రాజధాని నగరంలో పాఠశాలలను మూసివేశారు. అనేక కార్యాలయాలు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. ఈ విపత్తును కూడా రాజకీయం చేయడానికి ప్రయత్నించడం, ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వంపై విమర్శలు కురిపించడం మోడీ ప్రభుత్వ దిగజారుడు తనానికి పరాకాష్ట! దీంతో జోక్యం చేసుకున్న సర్వోన్నత న్యాయస్థానం వాయు కాలుష్యాన్ని రాజకీయ పోరుగా మార్చవద్దని సూచించాల్సి వచ్చింది.

దేశ రాజధానిలో ఈ సమస్య ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిందేమి కాదు. వాయు కాలుష్యంపై ఢిల్లీ ప్రజానీకం రెండు దశాబ్దాలకు పైగా పోరాటం చేస్తున్నారు. సుప్రీంకోర్టు కూడా అనేకసార్లు జోక్యం చేసుకుంది. అయినా, ఈ సమస్యను అధిగమించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే పంజాబ్, హర్యానా తో పాటు ఢిల్లీ పరిసరాల్లో ఉన్న అనేక రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని సుప్రీంకోర్టు తాజాగా అభిప్రాయపడింది. దీనిని తక్షణం ఆపాలని రాష్ట్రాలను ఆదేశించింది. గతంలోనూ ఈ దిశలో సూచనలు చేసినా అవి అమలు కాకపోగా, ఈ ఏడాది పంజాబ్‌లో పంట వ్యర్థాలను దగ్ధం చేయడం 740 శాతం మేర పెరిగినట్లు అంచనా! పంట కోసిన 10 నుండి 14 రోజుల్లోనే రబీ పంట వేయాల్సి ఉండటంతో మరో మార్గం లేదని రైతులు అంటున్నారు. ఢిల్లీలో కాలుష్యం పెరగడానికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. స్థానిక పరిశ్రమల్లో సహజవాయువును మాత్రమే వినియోగించాలని గతంలో జారీ చేసిన ఆదేశాలు పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. వ్యక్తిగత వాహనాల వినియోగం సాధ్యమైనంత మేర తగ్గించాలని, ప్రజా రవాణా వ్యవస్థను గణనీయంగా పెంచాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదు. 2005-06లో ప్రతి వెయ్యి మందికి 317గా ఉన్న వ్యక్తిగత వాహనాల సంఖ్య 2020-21 నాటికి 655కి చేరింది. 2021-22లో వీటి సంఖ్య తగ్గిందని, ప్రతి వెయ్యి మందికి 472 వాహనాలు మాత్రమే ఉన్నాయని ప్రభుత్వం ప్రకటించింది. వ్యక్తిగత వాహనాలు తగ్గితే ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించే వారి సంఖ్య పెరగాలి కదా! కానీ, అలా జరగలేదు. తాజా ఆర్థిక సర్వే ప్రకారం ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించే ప్రయాణీకుల సంఖ్య 2017-18తో పోలిస్తే 2022-23 నాటికి 48 శాతం తగ్గింది! వీరంతా ఏ వాహనాల్లో తిరుగుతున్నారో అర్థం కాని స్థితి! ప్రజా రవాణా వ్యవస్థలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచాలన్న సుప్రీం ఆదేశాలు కూడా ఇంత వరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదు. 30 శాతం ఢిల్లీ నగరంలో నగరపాలక సంస్థ సేవలు అందకపోవడంతో చెత్తను ఎక్కడపడితే అక్కడ తగలబెడుతున్నారంటే విస్మయం కలగకమానదు.

సమస్యకు కారణమౌతున్న వరిపంట స్థానంలో తృణధాన్యాల వంటి సాంప్రదాయ పంటలను సాగుచేస్తామని, వాటికి కనీస మద్దతు ధర చెల్లించేలా చర్యలు తీసుకోవాలంటూ పంజాబ్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమిష్టి చర్యల ద్వారానే కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్న అంశాన్ని కేంద్రం గుర్తించాలి. పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించడంతో పాటు, కాలుష్య నియంత్రణకు ఢిల్లీ ప్రభుత్వం తీసుకునే చర్యలకు అవసరమైన సహాయ సహకారాలు అందించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే! ఎక్కడికక్కడ ప్రజలను చైతన్యవంతం చేసి, వారిని కూడా ఈ కృషిలో భాగస్వాములను చెయ్యాలి. అప్పుడే కాలుష్య భూతంపై విజయం సాధ్యమవుతుంది.

మహనీయుని మాట



మీరు చేసే పని
అద్భుతంగా ఉండాలంటే
దానిని ప్రేమించడం నేర్చుకోండి.

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్,
ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.

పేదల పాసింజరు రైళ్లు రద్దు - బడాబాబుల విమానాలు రెట్టింపు!

విశ్లేషణ

ఎం. కోటేశ్వరరావు

గరీబ్ కళ్యాణ్ యోజన బియ్యం పథకాన్ని మరో ఐదు సంవత్సరాల పాటు పొడిగించనున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ఒక ఎన్నికల సభలో ప్రకటించారు. ఇదే సమయంలో నవంబరు మూడవ తేదీన అమెరికా న్యూయార్క్ టైమ్స్ పత్రిక 'భారత్ మాదిరి ఎక్కువగా విమానాలను కొనుగోలు చేస్తున్న దేశం మరొకటి లేదు, ఎందుకో ఇక్కడ చూడండి' అనే శీర్షికతో వార్త ఇచ్చింది. చూశారా జనం పట్ల మోడీకి ఎంత శ్రద్ధ ఉందో అని ఉచిత బియ్యం గురించి, విమానాల కొనుగోలులో మనమే టాప్ అంటే పదేళ్లలో మోడీ దేశాన్ని ఎంత అభివృద్ధి చేశారో చెప్పటానికి ఇంతకంటే ఏం కావాలని తబ్బిబ్బు అవుతున్నారు. జనం మీద ఇతర అంశాల్లో లేని ప్రేమ ఉచిత బియ్యం మీద ఎందుకు చూపుతున్నారు? ఐదు రాష్ట్రాల్లో బిజెపికి పరీక్షగా మారిన అసెంబ్లీ, వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాఖీ బహుమతి పేరుతో ఉజ్వల పథక గ్యాస్ సబ్సిడీని 200 నుంచి 400కు పెంచగా, ఇతరులకు రూ.200 రాయితీ ఇచ్చారు. పొయ్యి మీదకు ఐదు కిలోల ఉచిత బియ్యం ఇస్తున్నారు. పొయ్యి కిందకు అవసరమైన గ్యాస్ ధర మోడీ గద్దెనెక్కినపుడు రూ.420 వరకు ఉండగా రూ.1,150కు పెంచారు (రాష్ట్రాలలో ధరల్లో తేడాలు ఉన్నాయి). అంతగా పెంచినపుడు మహిళలు గుర్తుకు రాలేదా? నరేంద్రమోడీ పదేళ్ల ఏలుబడిలో దేశంలో ఆకలి పెరిగింది తప్ప తగ్గలేదన్నది పచ్చి నిజం. 2023 నాటికి అది 125 దేశాలకు గాను 2022లో 121కి 107 కాగా 2023లో 125 దేశాల్లో 111కు దిగజారింది. ఈ సూచికలను ఏనాడూ కేంద్ర ప్రభుత్వం అంగీకరించలేదు, తప్పుల తడక అని చెప్పటం తప్ప...దేశంలో ఆకలి ఎంత ఉందో అసలు లేదో అన్నది కూడా ఇంతవరకు చెప్పలేదు.

భారత్‌కు అదనంగా వెయ్యి విమానాలు కావాల్సి ఉందని 2018 జూన్ మొదటి వారంలో నాటి పౌర విమానయాన శాఖ మంత్రి సురేష్ ప్రభు ప్రకటించారు. మేకిన్ ఇండియాలో భాగంగా విదేశీ కంపెనీలు మన దేశంలోనే తయారు చేస్తాయని కూడా చెప్పారు. రానున్న రెండు దశాబ్దాల్లో భారత్ తమ నుంచి 1,750 కొనుగోలు చేయవచ్చని ఎయిర్ బస్, 2,100 ఆర్డర్లు తమకు రావచ్చని బోయింగ్ కంపెనీ 2017లోనే చెప్పింది. కొత్తగా వెయ్యి విమానాలను కొనుగోలు చేస్తున్నట్లు సంస్థలు ప్రకటించాయి. దీంతో ఎవరికీ పేచీ లేదు. వీటి వలన సామాన్యులకు ఒరిగేదేమిటి? డబ్బున్నోళ్లు ఎక్కుతారు. పెరుగుతున్న రైలు ప్రయాణీకులకు అనుగుణంగా రైళ్లను పెంచాలని నెత్తీ నోరు కొట్టుకుంటున్నా పట్టించుకోలేదు. మూడేళ్లనాటి రైల్వే శాఖ అంచనా ప్రకారం కనీసం ఇరవై వేల రైళ్లు అవసరం కాగా పదమూడు వేలు మాత్రమే ఉన్నాయి.

ఏ చిన్న అవకాశం దొరికినా ప్రయాణీకుల రైళ్లను రద్దు చేయటం పరిపాటిగా మారింది. ఇవి కూడా స్వల్ప దూరాల్లో ప్రయణించేవే కావటం గమనించాలి. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నలకు వచ్చిన సమాధానాలివి. 2022వ సంవత్సరంలో ఆరు నెలల్లో తొమ్మిది వేలకు పైగా రైలు సర్వీసులను రద్దు చేశారు. వాటిలో బొగ్గు రవాణాకు ప్రాధాన్యత ఇచ్చే పేరుతో రద్దు చేసినవి 1,934 ఉన్నాయి. మరో 6,995 రైళ్లను మార్గ మరమ్మతులు, నిర్వహణ పేరుతో రద్దు చేశారు. వీటిలో 3,395 మెయిల్ లేదా ఎక్స్‌ప్రెస్‌లు, 3,600 పాసింజర్లు ఉన్నాయి. సరకు రవాణా లాభసాటి అన్నది తెలిసిందే. ప్రభుత్వం ఆ లాభాలను చూస్తున్నది తప్ప ప్రయాణీకులను గాలికి వదలి వేస్తునది. 2021-22లో రైళ్ల రద్దు, తగినన్ని రైళ్లు లేని కారణంగా కోటీ అరవై లక్షల మంది ప్రయాణించలేదు. విమాన ప్రయాణీకుల పెరుగుదల గురించి చెబుతున్న పాలకులకు రైల్వే ప్రయాణీకులు పెరుగుతున్నారని తెలియదా ?

ఏటా వీటిలో ప్రయాణిస్తున్నవారు 2010 నుంచి 2020 వరకు సగటున ఏడాదికి 811 కోట్ల మంది ఉన్నారు. 2010లో 724 కోట్లు కాగా 2020లో 809 కోట్ల మంది ఉన్నారు. తగినన్ని రైళ్లు లేని కారణంగా ప్రయాణీకులు పెరగటం లేదని ఈ అంకెలు వెల్లడిస్తున్నాయి. నూట నలభై కోట్ల మందికి అవసరమైన రైళ్లను గడచిన ఆరు సంవత్సరాల్లో ఎనిమిది వందలు మాత్రమే పెంచారు. 2022-23 సంవత్సరంలో దేశంలో విమాన ప్రయాణీకులు 37.7 కోట్లు కాగా వారిలో విదేశీయులు 5.9 కోట్ల మంది ఉన్నారు. వీరి కోసం ఈ ఒక్క ఏడాదే వెయ్యి విమానాలు కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించారు. పోనీ అవి ప్రైవేటు సంస్థలు అనుకుందాం, రైళ్లను పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? అసలు సంగతేమంటే జనాలకు అచ్చే దిన్ అని చెప్పిన మోడీ కరోనా పేరుతో రద్దు చేసిన పాసింజరు రైళ్లను, రాయితీలను ఇంతవరకు పునరుద్ధరించలేదు. వాటి మీద ఒక నిర్దిష్ట ప్రకటన కూడా లేదు. అనేక పాసింజర్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చి ప్రయాణీకుల నుంచి జేబులు కొల్లగొడుతున్న సంగతి తెలిసిందే. తక్కువ ఖర్చుతో ప్రయాణించే రైళ్ల బదులు వందే భారత్‌లను ప్రవేశపెట్టేందుకు మాత్రమే శ్రద్ధ చూపుతున్నారు. హైస్పీడు, బుల్లెట్ రైళ్లు వాటికోసం మార్గాల నిర్మాణం గురించి చూపుతున్న శ్రద్ధ సామాన్య జన అవసరాల మీద లేదు. భారత్ విమానాల కొనుగోలు గురించి గొప్పగా రాయటం మోడీని మునగ చెట్టు ఎక్కించే యత్నం తప్ప మరొకటి కాదు.

ఒక్కసారిగా వెయ్యి విమానాలను కొనుగోలు చేస్తే అసలు అవి నిండే అవకాశం ఉందా? ప్రస్తుతం దేశంలో ఇరవై ప్రయాణాలు రైల్లో చేస్తే ఒకటి విమానంలో జరుగుతున్నట్లు అంచనా. విమానం కంటే రైల్లో మొదటి తరగతి చార్జీలను ఎక్కువగా నిర్ణయించి జనాలను విమానాలవైపు వెళ్లేట్లు చేస్తున్నారు. ఇది ప్రైవేటు సంస్థలకు లబ్ధి చేకూర్చే వైఖరి తప్ప మరొకటి కాదు. ఎయిర్ ఇండియాను స్వాధీనం చేసుకున్న టాటా గ్రూపు కొత్తగా 470 విమానాలను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. మరో సంస్థ ఇండిగో మరో ఐదు వందలు కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. తక్కువ ఖర్చుతో ప్రయాణించే విమానాల ద్వారా రద్దీ పెంచుకొని లబ్ధి పొందేందుకు అవి చూస్తున్నాయి. ప్రభుత్వం కూడా గత తొమ్మిది సంవత్సరాల్లో 74గా ఉన్న విమానాశ్రయాలను 148కి పెంచింది, 2030 నాటికి 230కి పెంచుతామని చెబుతున్నారు. ఇది తమ ఘనతగా అధికార బిజెపి ప్రచారం చేసుకుంటున్నది. ఇదే మాదిరి రైలు ప్రయాణీకులకు అవసరమైన ఖర్చు, వేగంగా ప్రయాణించే మార్గాలకు ప్రభుత్వం ఖర్చు పెట్టిందా అంటే లేదు. వందేభారత్ రైళ్లు కూడా పూర్తి వేగంతో నడవటంలేదు. రెండు వందల కిలోమీటర్లకు పైగా తిరిగే అన్ని పాసింజరు రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చటంతో దేశంలో ఐదు వందలకు పైగా రైళ్లు సామాన్యులకు దూరమయ్యాయి. అనేక గ్రామాల్లో ఉన్న రైల్వే స్టేషన్లలో రైళ్లను ఆగకుండా చేశారు. ఈ కారణంగా కలసి వచ్చిన సమయం గురించి చెప్పకుండా వేగం పెంచి ప్రయాణీకులకు మేలు చేసినట్లు చెప్పారు. ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చినందున గతంతో పోలిస్తే ప్రతి ప్రయాణీకుడి మీద 20 నుంచి 60 రూపాయల వరకు అదనపు భారం పడింది. దీనికి తోడు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సాధారణ స్లీపర్ కోచ్‌లను తగ్గించి ఎసి కోచ్‌లను పెంచారు. సీట్లు దొరక్క అనివార్యంగా అదనపు చార్జీలు చెల్లించాల్సి వస్తున్నది. వృద్ధులు, మహిళలకు ఇస్తున్న ప్రయాణ రాయితీలను రద్దుచేశారు. టిక్కెట్ల రిజర్వేషన్, రద్దు చార్జీలను విపరీతంగా పెంచి మరో రూపంలో జేబులను కొల్లగొడుతున్నారు. పేరుకు చార్జీలను పెంచలేదనటం తప్ప కరోనా తరువాత పరోక్షంగా మోపిన భారం మామూలుగా లేదు. రద్దీ ఉన్న మార్గాలలో ఏళ్ల తరబడి ప్రత్యేక రైళ్ల పేరుతో నడుపుతూ జనం దగ్గర అదనపు చార్జీలను వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. వాటినే సాధారణ రైళ్లుగా ఎందుకు నడపరు? ప్రయాణీకుల రైళ్ల నిర్వహణ గిట్టుబాటు కావటం లేదంటూ ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వ పెద్దలు చెబుతుంటారు. ఆ లెక్కలకు ఆధారం ఏమిటో తెలియదు. ప్రతి ప్రయాణీకుడి నుంచి కేవలం 47 శాతమే వసూలు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నది. సామాన్యులకు విమానాలను అందుబాటులోకి తేవాలనే పేరుతో అవి నడిచేందుకు అవసరమైన ఇంధనం మీద రాయితీలు ఇస్తున్నారు. మరోవైపు రాష్ట్రాల్లో ప్రజా రవాణా సంస్థల బస్సులకు ఎలాంటి ఇంధన సబ్సిడీలు లేవు. సరకు రవాణాకు ఎలాంటి రాయితీ లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రయాణీకులకు 2019-20లో ఇచ్చిన సబ్సిడీ మొత్తం రూ.59,837 కోట్లు. సగటున ముందే చెప్పుకున్నట్లు ఏడాదికి ప్రయాణీకులు 811 కోట్లు, అంటే ఒక్కో ప్రయాణం మీద ఇస్తున్న రాయితీ రూ.73.78 మాత్రమే. ఈ మాత్రానికే అంతా దోచిపెడుతున్నట్లు గుండెలు బాదుకుంటున్నారు. నాసిరకం భోజనం, టిఫిన్లు, టీ, కాఫీలకు ప్రయాణీకులు చెల్లిస్తున్న మొత్తాలతో బేరీజు వేస్తే జనమే అధికంగా చెల్లిస్తున్నట్లు స్పష్టం అవుతుంది. ప్రభుత్వ రంగంలోని రవాణా వ్యవస్థలు అయ్యే ఖర్చును మాత్రమే రాబట్టాలి తప్ప లాభాలు తేవాలని చూడటమే తప్పు. ఆ లాభం కూడా సామాన్యుల నుంచి మరో రూపంలో వసూలు చేస్తున్నదే.

ఏ చిన్న అవకాశం దొరికినా ప్రయాణీకుల రైళ్లను రద్దు చేయటం పరిపాటిగా మారింది. ఇవి కూడా స్వల్ప దూరాల్లో ప్రయణించేవే కావటం గమనించాలి. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నలకు వచ్చిన సమాధానాలివి. 2022వ సంవత్సరంలో ఆరు నెలల్లో తొమ్మిది వేలకు పైగా రైలు సర్వీసులను రద్దు చేశారు. వాటిలో బొగ్గు రవాణాకు ప్రాధాన్యత ఇచ్చే పేరుతో రద్దు చేసినవి 1,934 ఉన్నాయి. మరో 6,995 రైళ్లను మార్గ మరమ్మతులు, నిర్వహణ పేరుతో రద్దు చేశారు. వీటిలో 3,395 మెయిల్ లేదా ఎక్స్‌ప్రెస్‌లు, 3,600 పాసింజర్లు ఉన్నాయి. సరకు రవాణా లాభసాటి అన్నది తెలిసిందే. ప్రభుత్వం ఆ లాభాలను చూస్తున్నది తప్ప ప్రయాణీకులను గాలికి వదలి వేస్తునది. 2021-22లో రైళ్ల రద్దు, తగినన్ని రైళ్లు లేని కారణంగా కోటీ అరవై లక్షల మంది ప్రయాణించలేదు. చివరి క్షణాల్లో వారెంత ఇబ్బంది పడి ఉంటారో ఊహించుకోవాల్సిందే. విమా న ప్రయాణీకుల పెరుగుదల గురించి చెబుతున్న పాలకులకు రైల్వే ప్రయాణీకులు పెరుగుతున్నారని తెలియదా ?

ఒక విశ్లేషణ ప్రకారం 2019లో మన దేశంలో తలసరి విమాన సీట్లు 0.13 కాగా చైనాలో 0.52, అమెరికాలో 3.03 ఉన్నాయి. స్టాటిస్టా సంస్థ వెల్లడించిన సమాచారం ప్రకారం 2021లో ఆయా దేశాల్లో నమోదైన విమాన సంస్థల వద్ద ఉన్న వివరాల ప్రకారం అమెరికాలో ప్రయాణీకులు 66.615 కోట్లు, చైనాలో 44.03, ఐరోపా సమాఖ్యలో 25.169, రష్యాలో 9.685, మన దేశంలో 8.396 కోట్ల మంది ఉన్నారు. మన హైదరాబాద్ కంటే తక్కువగా అంటే 70 లక్షల 52 వేల మంది ఉన్న ఐర్లండ్‌లో 7.047 కోట్ల మంది ఉన్నారు. ఈ అంకెలు వాస్తవాలను ప్రతిబింబించవు. ఉదాహరణకు మన దేశంలో ఇండిగో సంస్థ బ్రిటన్-రష్యా మధ్య విమానాలను నడిపితే వాటిలో ఎక్కే ప్రయాణీకులను కూడా మన దేశ ఖాతాలోనే వేస్తారు. రానున్న రోజుల్లో దేశంలోని మధ్య తరగతి జనాలు ఇంకా పెరుగుతారనే అంచనాతో కొత్తగా విమానాలను కొనుగోలు చేసేందుకు పూనుకున్నారు. మిగతా దేశాల వద్ద ఇప్పటికే ఎక్కువ ఉన్నాయి. అందువలన ఏ దేశమూ కొనన్ని విమానాలను మనం కొంటున్నామని ఎవరైనా అంటే మనకు మనమే జబ్బలను చరుచుకోవాల్సిన అవసరం లేదు. ★

సందర్భం

ఉచిత న్యాయ సేవలు...!

చట్టం ముందు అందరూ సమానమని, అందరికీ న్యాయం పొందే ప్రాథమిక హక్కు ఉందని భారత రాజ్యాంగంలో పొందుపరిచిన అధికరణం 14, ఆర్టికల్ 22 స్పష్టం చేశాయి. పేదలకు న్యాయం సత్వరమే అందడం లేదని చరిత్ర చెబుతున్నది. దీనిని దృష్టిలో ఉంచుకొని అందరికీ న్యాయ సేవలు, సత్వరమే ఉచిత న్యాయం అందించే విధానపరమైన అంశాల్లో సామాన్య ప్రజానీకానికి అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా నవంబర్ 9న "జాతీయ న్యాయ సేవల దినం" పాటిస్తున్నాం. ఈ సందర్భంగా పేద, బడుగు, నిరక్షరాస్యులకు ఉచితంగా సివిల్, క్రిమినల్, రెవెన్యూ కోర్టులు, ట్రిబ్యునల్స్ ద్వారా న్యాయ సేవలు అందించే సదుపాయాలకు సంబంధించిన ప్రచారం జరుగుతుంది. నిరుపేదలకు ఉచిత న్యాయ సేవలు, న్యాయ సలహాలు, న్యాయ సేవల విస్తరణ, న్యాయ సేవల అవగాహన, లోక్ అదాలత్‌ల నిర్వహణ, దీర్ఘకాలిక సమస్యలకు సత్వర పరిష్కారం, హింసా బాధితులకు పరిహారం అందించటం వంటి లక్ష్యాలతో న్యాయ సేవల విస్తరణ జరుగుతోంది. ఉచిత న్యాయ సేవలు పొందేందుకు అర్హత కలిగిన వారిలో పేద మహిళలు, పిల్లలు, అంగ వైకల్యంతో బాధ పడేవారు, ఎస్‌సిలు, ఎస్‌టిలు, పారిశ్రామిక కార్మికులు, కస్టడీలో ఉన్నవారు, ప్రకృతి వైపరీత్యాల బాధితులు, కుల వివక్షకు గురైన వారు, భిక్షాటన చేసేవారు, మానవ అక్రమ రవాణాకు గురైన వారు, వార్షిక ఆదాయం ఒక లక్ష లోపు ఉన్నవారు వస్తారు. అన్ని వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించే ప్రత్యామ్నాయ వివాద పరిష్కార సంస్థల్లో జాతీయ న్యాయ సేవా సంస్థ (నల్సా), రాష్ట్ర న్యాయ సేవా సంస్థ, జిల్లా న్యాయ సేవా సంస్థ, సబ్‌డివిజనల్ స్థాయి న్యాయ సేవా సంస్థలు వివిధ స్థాయిల్లో అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటుగా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయ సేవా కమిటీలు తమ విధులను నిర్వహిస్తున్నాయి.

-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
సెల్ : 9949700037

విమర్శ

కళాశాలల్లో చెరిగిపోతున్న చరిత్ర



చిలుకూరి శ్రీనివాసరావు

"ఎక్కడైతే చరిత్ర విస్మరించబడుతుందో... ఆ సమాజానికి గతం, భవిష్యత్తు కూడా ఉండవ"ని ప్రసిద్ధ రచయిత హిస్లీన్ అన్నాడు. అంతటి ప్రాధాన్యత కలిగిన చరిత్ర సబ్జెక్టు చదివే విద్యార్థులు లేక మన రాష్ట్రంలో ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలు వెలవెల పోతున్నాయి. ఇప్పటికే 80 శాతం కాలేజీల్లో హిస్టరీ సబ్జెక్టును ఎత్తేశారు. ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరవకపోతే! "పూర్వం కళాశాలల్లో చరిత్ర బోధించేవారట" అని చెప్పుకోవాల్సి వస్తుంది.

ఈ ఏడాది రాష్ట్రంలో డబ్బై శాతం విద్యార్థులు ఇంటర్లో గణితం చదువుతుంటే! కేవలం మూడున్నర శాతం విద్యార్థులు మాత్రమే చరిత్రను చదువుతున్నారు. ఈ వ్యత్యాస ప్రభావం భావి సమాజంపై తీవ్రంగా పడుతుందనడంలో సందేహం లేదు. మన దేశంలో ఉత్తరాది రాష్ట్రాల్లో హెచ్ఇసి గ్రూపుకు ప్రాధాన్యత కాస్త మెరుగ్గానే ఉంది. దక్షిణాదిన ముఖ్యంగా మన రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ ప్రవాహంలో చరిత్ర సబ్జెక్టు కొట్టుకుపోతోంది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, మోడల్, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, సహకార, కేంద్రీయ, ప్లస్ టు తదితర మేనేజ్‌మెంట్లలో 3,654 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరం అంటే ఈ ఏడాది 20,47,844 మంది విద్యార్థులు ప్రథమ ద్వితీయ సంవత్సరాల్లో మన రాష్ట్రంలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. వారిలో ఏకంగా 15,27,366 మంది గణితం ఉండే ఎంపిసి గ్రూపు చదువుతుంటే కేవలం 53,764 మంది విద్యార్థులు మాత్రమే హిస్టరీ సబ్జెక్టు గ్రూపులు చదువుతున్నారు. ఇటీవల ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మండలానికో పాఠశాలను ప్లస్ టూ గా మార్చి ఇంటర్మీడియట్ కూడా ఏర్పాటు చేసింది. ఈ 292 ప్లస్ టూ లలో ఒకటి కూడా హిస్టరీ గ్రూప్ ఉన్న కళాశాల లేకపోవడం విచారకరం. చదివే విద్యార్థులు లేకపోవడం వల్ల హిస్టరీ గ్రూపును ఏర్పాటు చేయడం లేదని ప్రభుత్వ వాదన. చరిత్ర ప్రాధాన్యతను గుర్తెరిగి, చరిత్రకి ప్రచారం కల్పించి విద్యార్థులను చేర్పించి, చదివించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది. సామాజిక శాస్త్రాలు (సోషల్ సైన్సెస్) లేకపోతే సమాజం సంపూర్ణ ప్రగతి, వికాసం సాధించలేదు. అందుకే ప్రపంచ అగ్ర దేశాలు సాంకేతిక విద్యతోపాటు సమాన స్థాయిలో చరిత్ర బోధనకు ప్రాతినిధ్యం కల్పిస్తున్నాయి. అమెరికా, చైనా, రష్యా, ఇంగ్లండ్ తదితర దేశాలు పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు చరిత్ర బోధనకు పెద్ద పీట వేస్తున్నాయి.

చరిత్ర ఎందుకిలా డీలా!

కేంద్ర మానవ వనరుల శాఖ నేతృత్వంలో ఎన్‌సిఇఆర్‌టి (జాతీయ విద్యా పరిశోధన మరియు శిక్షణా మండలి) 1961 నుంచి దేశంలో అన్ని రాష్ట్రాల్లో మిగతా సబ్జెక్టులతో పాటు చరిత్రకీ ఉన్నత స్థానాన్ని కల్పించి బోధన సాగిస్తోంది. ఎన్‌సిఇఆర్‌టి సూచనల మేరకు ఆయా రాష్ట్రాల్లో ఎస్‌సిఇఆర్‌టి (రాష్ట్ర విద్యా శోధన మరియు శిక్షణ సంస్థ)లు సిలబస్ తయారుచేసుకుని చరిత్రను బోధిస్తున్నాయి. ఆరంభంలో అన్ని కళాశాలలో చరిత్ర మెయిన్‌గా ఉండే హెచ్ఇసి గ్రూపులు విద్యార్థులతో కళకళలాడుతుండేవి. సైన్స్ కంటే ఎక్కువ విద్యార్థులు హిస్టరీ ఉన్న ఆర్ట్స్ గ్రూపుల్లోనే చేరేవారు. గతంలో 'లా' చదవాలంటే కచ్చితంగా హిస్టరీ గ్రూప్ నుంచి వెళ్లేవారు. ఇప్పుడు సైన్స్ గ్రూపుల నుంచి ఎక్కువమంది 'లా' చదువుతున్నారు. సివిల్స్, గ్రూప్స్ వంటి పరీక్షలు హిస్టరీ చదివిన వాళ్ళు ఎక్కువ ఉండేవారు. ఇప్పుడు సర్వం ఇంజనీరింగ్‌గా మారుతోంది. ఐసిహెచ్ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రీసెర్చ్) సంస్థ మన దేశంలో జాతీయ స్థాయిలో చరిత్రను పరిశోధిస్తూ కొన్ని ఆధునిక విషయాలను ఎన్‌సిఇఆర్‌టి ద్వారా ఎస్‌సిఇఆర్‌టి లకు అందిస్తూ వుంటుంది. ఇది కూడా కేంద్ర ప్రభుత్వం గుప్పెట్లో కీలుబొమ్మై రాజకీయ రంగు పులుముకుంటోందని తీవ్ర స్థాయిలో విమర్శలు రావడం మనం చూస్తూ ఉన్నాం. అలాగే ఎన్‌సిఇఆర్‌టి చరిత్రలో కొన్ని కీలక పాఠ్యాంశాలు తొలగించ డం ఇటీవల దేశవ్యాప్తంగా విమర్శలకు, నిరసనలకు దారితీసింది. ఇక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చరిత్ర బోధన మీద శీతకన్ను వేస్తూనే ఉన్నాయి.

ఈ గందరగోళాల నేపథ్యంలో చరిత్ర బోధన ప్రాబల్యం కోల్పోతూ వస్తోంది. రోజు రోజుకి చరిత్ర గ్రూప్ చదివే విద్యార్థుల సంఖ్య తరిగిపోతోంది. ఇప్పటికే చాలా కళాశాలల్లో చరిత్ర చదివే విద్యార్థులు లేక హిస్టరీ గ్రూపుని మూసేశారు. రాబోయే పరిణామాలను పసిగట్టిన అప్పటి కేంద్ర ప్రభుత్వం 1986లో డిగ్రీ చదివే విద్యార్థులందరికీ రెండు కంపల్సరీ సబ్జెక్టులను ప్రవేశపెట్టింది. సైన్స్ విద్యార్థులకు ఆర్ట్స్ పట్ల, ఆర్ట్స్ విద్యార్థులకు సైన్స్ పట్ల కనీస అవగాహన కోసం ఐహెచ్‌సి (భారతీయ సంస్కృతి, వారసత్వం), సైన్స్ అండ్ సివిలైజేషన్ (విజ్ఞానము, పౌరస్మృతి) సబ్జెక్టులు కచ్చితంగా బోధించి తీరాలని నిబంధన పెట్టింది. 2020 తర్వాత నుంచి ఇది 'ఇండియన్ కల్చర్ అండ్ సైన్స్' పేరిట ఏక సబ్జెక్టుగా మారింది. ఇంతవరకు బానే ఉంది. దీన్ని ఐచ్ఛిక సబ్జెక్టుగా పరిగణించడంతో కొందరే ఈ సబ్జెక్ట్‌ని ఎంచుకుంటున్నారు. దీంతో హిస్టరీ ఉనికిపై మరో రాయి పడింది. సాఫ్ట్‌వేర్ మోజులో విద్యార్థులు సాధారణ డిగ్రీల కంటే బిటెక్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో ఇంజనీరింగ్ చదువుల ముందు చరిత్ర డీలా పడుతోంది. దాంతో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ లెక్చరర్ల సంఘం హిస్టరీ గ్రూపుకి పూర్వ వైభవం తేవాలని ఉద్యమం నడుపుతోంది. సైన్సు, ఆర్ట్స్, ఇంజనీరింగ్ ఇలా చదువుకునే వారందరికీ చరిత్ర పరిజ్ఞానం చేరాలంటే... తెలుగు, ఇంగ్లీష్ లాంగ్వేజ్ మాదిరిగా హిస్టరీని కూడా ఒక కంపల్సరీ సబ్జెక్టుగా నేర్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

చరిత్ర బోధన ఎందుకు?

ఆధునిక సాంకేతిక యాంత్రిక యుగంలో మానవుడు చంద్రుడు మీదకు సైతం దూసుకుని వెళుతూ ఉంటే జరిగిపోయిన గతాన్ని తవ్వుకుంటూ చరిత్ర ఎందుకు? అనే విమర్శలు లేకపోలేదు. ఒకవైపు పెత్తందారులు, కార్పొరేట్ సంస్థలు, దళారులు చేతికి అందింది దోచుకుంటున్నారు. ఎంత కష్టపడ్డా రైతులకు, శ్రామికులకు పూట గడవడం కష్టంగా మారిపోతుంది. సమాజంలో అంతరాలు పోయి సమ సమాజ స్థాపన జరగాలి అంటే దానికి చరిత్ర ఒక సాధనం. సాంఘిక శాస్త్రాన్ని (సోషల్ సైన్సెస్) చదవడం వల్ల, తెలుసుకోవడం వల్ల ఒక పరిణితి గల సమాజం ఏర్పడుతుంది. అమెరికన్ ప్రముఖ రచయిత్రి పెరల్.ఎస్.బక్ ఏమన్నారంటే...'ఇవాళ్టి గురించి నీవు అన్వేషించాలనుకుంటే కచ్చితంగా నీవు నిన్నటి గురించి తెలుసుకుని ఉండాలి'. గతం అంటే... చరిత్ర ఎప్పుడూ కూడా గొప్పదే. 'గతం పునాదుల మీదే వర్తమానం నడుస్తుంది, భవిష్యత్తు నిర్మితమవుతుంది'. ఇదే చరిత్ర మూల సిద్ధాంతం.

చరిత్రకు పూర్వ వైభవం

భవిష్యత్ సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూర్చే చరిత్ర సబ్జెక్టుకు కళాశాలల్లో పూర్వ వైభవం దక్కాలంటే ప్రభుత్వాలు కచ్చితంగా ప్రత్యేక దృష్టి సారించాలి. చరిత్ర చదువుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలి. పురావస్తు శాఖ, పర్యాటకం, అటవీ శాఖ, పోలీసు శాఖ తదితర రంగాల్లో హిస్టరీ విద్యార్థులకు ప్రాధాన్యత కల్పించాలి. కాంట్రాక్ట్, ప్రైవేట్ బోధకులతో కాకుండా నిష్ణాతులైన రెగ్యులర్ లెక్చరర్లను నియమించి కళాశాలల్లో వారితో పాఠ్యాంశాలు బోధించేటట్లు చూడాలి. ప్రభుత్వ కళాశాలల్లో హిస్టరీ గ్రూపు నడుపుతూ వాటిలో విద్యార్థులు చేరేలా ప్రభుత్వం ప్రచారం కల్పించాలి. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో కూడా కచ్చితంగా హిస్టరీ గ్రూపులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. హిస్టరీ స్కాలర్లని కూడా పెంచాలి. హిస్టరీ, సైన్స్ సబ్జెక్టుల కాంబినేషన్‌తో కొత్త గ్రూపులు ఏర్పాటుచేసి విద్యార్థులకు దగ్గర చేయాలి. హిస్టరీ ప్రాభవాన్ని, అవసరాన్ని తెలిపి విద్యార్థుల్లో చరిత్ర చదవడానికి ఆసక్తి రేకెత్తించాలి.

/వ్యాసకర్త యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,
సెల్: 8985945506/

కవిత్వం

పచ్చటి చిగురు

బాంబులు
పడుతూనే ఉంటాయి
ఉన్మాదానికి అంతం ఎక్కడ?

పగలో రాత్రో తెలియదు
మట్టి పొరల్లో కదా జీవనం

ఆకలిగొన్నప్పుడే
ఉపరితలంపై పరుగులు
ఆకలికి పసి ఆరాటమే
ప్రాణభయం తెలియదుగా.

చూస్తుండగానే మళ్ళీ బాంబు!
శకలాలుగా మానవ దేహాలు
గుండెలవిసే ఆర్తనాదం
నేలను బాదుకునే ఆక్రందనం

జాతిని, మతాన్ని
తుడిచిపెట్టాలన్నది వాడి దుగ్ధ
అంగీ లాగూలే జాతిమతాలని
వాడికెవడు చెప్పాలి?

కసిగా రగిలే
స్వాభిమాన ఊపిరే
మట్టిపొరల వేడి.

వాడికేం మిగిలింది
శ్రాద్ధం - పిండాకూడు
బాంబు చోటే వాడిది
పుడమంతా పచ్చదనం

మట్టిలోనా మట్టిపైనా
క్షణక్షణం పరుచుకునే
జీవం

మరుభూమిపైనా మొలిచే
పచ్చటి చిగురు.

- కె. శాంతారావు,
సెల్ : 9959745723

మహిళలకు నితీష్ క్షమాపణలు

పాట్నా : జనాభా నియంత్రణ విషయంలో తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నట్లు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ బుధవారం ప్రకటించారు. మహిళలకు క్షమాపణలు తెలుపుతున్నానని, తన మాటలతో తప్పుడు సందేశం వెళ్లి వుంటే వాటిని వెనక్కు తీసుకుంటున్నానని అన్నారు. ఎవరినొప్పించేందుకు ఉద్దేశించినవి వ్యాఖ్యలు కావని, జనాభా నియంత్రణకు విద్య అవసరమని తన ఉద్దేశమని అన్నారు. మహిళల అభివృద్ధి, మహిళా సాధికారత పట్ల నిబద్ధత కలిగి ఉన్నానని చెప్పారు. నితీష్‌కుమార్ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేను మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. బీహార్‌లో సంతానోత్పత్తి రేటు 4.2 నుండి 2.9 శాతానికి పడిపోయిందని పేర్కొంటూ.. మహిళల గురించి వ్యాఖ్యానించారు. "భర్తల చర్యల వల్ల జననాల రేటు పెరుగుతోంది. అయితే చదువుకున్న మహిళకు భర్తను ఎలా నియంత్రించాలో తెలుసు. అందుకే జననాల సంఖ్య తగ్గుతూ వస్తోంది" అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై అసెంబ్లీలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. మహిళలను అవమాన పరిచేవిధంగా వ్యాఖ్యానించారంటూ ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఈ నిరసనలపై నితీష్‌కుమార్ మాట్లాడుతూ.. మీరంతా ఎందుకు రచ్చ చేస్తున్నారు. జర్నలిస్టుల ప్రశ్నకు వివరణనిచ్చానని అన్నారు. ఈ వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌డబ్ల్యుసి) కూడా స్పందించింది. నితీష్‌కుమార్ క్షమాపణలు చెప్పాలని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌డబ్ల్యుసి) చైర్మన్ రేఖా శర్మ డిమాండ్ చేశారు.

మానవ అక్రమ రవాణా కేసుల్లో ఎన్ఐఎ దూకుడు

శ్రీనగర్ : మానవ అక్రమ రవాణాకు సంబంధించిన కేసుల్లో జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఐఎ) బుధవారం విస్తృత సోదాలు చేపట్టింది. పాస్‌పోర్ట్ చట్టాలను ఉల్లంఘించడం, మానవ అక్రమ రవాణా కేసులకు సంబంధించి మయన్మార్ వలదారులు నివసించే ప్రాంతాల్లోనే ప్రత్యేకంగా ఈ దాడులు నిర్వహించినట్లు పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక అధికారి తెలిపారు. ఈ సోదాల్లో 45 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. జమ్ముకాశ్మీర్‌లోని పలు ప్రాంతాలతో పాటు 8 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్ఐఎ సోదాలు జరిపింది. త్రిపుర, అస్సాం, పశ్చిమబెంగాల్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, హర్యానా, రాజస్తాన్, పుదుచ్చేరిల్లో బుధవారం ఉదయం నుండి రాత్రి వరకూ ఈ దాడులు కొనసాగాయి. స్థానిక పోలీసుల సమన్వయంతో ఈ కేసులతో సంబంధం ఉన్న అనుమానితుల నివాసాలపై సోదాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. అంతర్జాతీయ సంబంధాలు కలిగి ఉన్న మానవ అక్రమ రవాణాదారుల అక్రమ రాకెట్‌ను వెలికితీసేందుకు ఈ పది రాష్ట్రాల్లోనూ సోదాలు చేపట్టినట్లు తెలిపారు.

పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు అత్యంత ఆందోళనకరం

సమాజాన్ని పీడిస్తూ లోతుగా పాతుకుపోయిన సమస్య ఇది : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : పని ప్రదేశాల్లో, కార్యాలయాల్లో ఏ రూపంలోనైనా లైంగిక వేధింపులు ఆందోళనకరమని, దీనిని తీవ్రంగా పరిగణించాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఓ పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. లైంగికవేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బి) మాజీ ఉద్యోగికి పెన్షన్‌లో 50 శాతం కోత పెట్టాలన్న ఉత్తర్వులను రద్దుచేస్తూ గౌహతి హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు నిలిపివేసింది. 'ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పు పెద్ద తప్పిదం. దాన్ని కొట్టేస్తున్నాం. పని ప్రదేశంలో లైంగిక వేధింపులను తీవ్రంగా పరిగణించాలి. అలాంటి చర్యలకు పాల్పడ్డ వ్యక్తిని చట్టం నుంచి తప్పించుకోవడానికి అనుమతించకూడదు. అతడికి తగిన శిక్ష పడకపోయినా, తక్కువ శిక్షతో తప్పించుకున్నా, బాధితురాలికి తీవ్ర అవమానం జరిగినట్లే' అని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. 'లైంగిక వేధింపులు అనేవి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాజాలను పీడిస్తున్న ఒక విస్తృతమైన, లోతుగా పాతుకుపోయిన సమస్య. భారతదేశంలో, ఇది తీవ్రమైన ఆందోళన కలిగించే అంశం' అని ధర్మాసనం పేర్కొంది. అసోంలోని రంగియాలో సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బి) సంస్థలో ఏరియా ఆర్గనైజర్‌గా పనిచేసిన దిలీప్ పాల్ అనే అధికారి తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఓ మహిళా ఉద్యోగి ఆరోపించింది. దీనిపై ఉన్నతస్థాయిలో విచారణ జరిగింది. నిందితుడికి నెలనెలా వచ్చే పెన్షన్‌లో 50శాతం కోత విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ దిలీప్.. గువహతి హైకోర్టును ఆశ్రయించాడు. పెన్షన్‌లో కోత పెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టేస్తూ హైకోర్టు 2019లో తీర్పునిచ్చింది. దీనిపై సుప్రీంకోర్టులో కేంద్రం అపీలు చేసింది.

పాలస్తీనాకు సంఘీభావంగా కోల్‌కతాలో భారీ మార్చ్

కోల్‌కతా: గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమానికి భారత ప్రభుత్వం మద్దతు ఇవ్వడం సిగ్గు సిగ్గు అంటూ బుధవారం నాడిక్కడ వామపక్షాల ఆధ్వర్యాన జరిగిన సాలిడారిటీ మార్చ్‌లో ప్రదర్శకులు నినదించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కాల్పుల విరమణకు అనుకూల విధానాన్ని తీసుకోవాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. మహాజాతి సదన్ నుండి రాంలీలా మైదాన్ వరకు ఊరేగింపు నిర్వహించారు. ప్రారంభ మరియు ముగింపుల్లో సంక్షిప్త సమావేశాలు జరిగాయి. రాంలీలా మైదాన్‌లో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం మాట్లాడుతూ.. 'ఆర్ఎస్ఎస్-బిజెపి హిట్లర్ మద్దతుదారులు. హిట్లర్ యూదులను ఊచకోత కోశాడు. ఆర్ఎస్ఎస్ ఆ హిట్లర్‌కు మద్దతుదారు. ఇప్పుడు యూదుల రక్షణ పేరుతో పాలస్తీనా ప్రజల ఊచకోతకు మద్దతిస్తున్నారు.' అని విమర్శించారు. సలీం మాట్లాడుతూ, "ఈ యుద్ధం వెనుక ప్రధాన స్పాన్సర్ అమెరికా". నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆసియాలో అమెరికా కూటమిలో భారత్‌ను ఇరికించింది. అలీనోద్యమం నుంచి అమెరికా అనుకూల విధానం వైపు భారత్‌ను మళ్లించింది. ఐక్యరాజ్యసమితిలో కాల్పుల విరమణ తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది. కానీ 120 దేశాల మద్దతుతో ఈ ప్రతిపాదన ఆమోదించబడింది. భారతదేశం తన సాంప్రదాయ మిత్రుడికి ద్రోహం చేస్తోంది. ఆర్ఎస్ఎస్, బిజెపి దీనిని యూదులు, ముస్లింల మధ్య యుద్ధంగా చిత్రిస్తున్నాయి. కానీ, ఇది నిజం కాదు, ప్రపంచవ్యాప్తంగా చాలా మంది యూదు ప్రజలు ఈ యుద్ధానికి వ్యతిరేకంగా ఉన్నారని విషయాన్ని గుర్తుంచుకోవాలని సలీం అన్నారు. సామ్రాజ్యవాద యుద్ధాలకు వామపక్షాలు మద్దతు ఇవ్వవు. యుద్ధం ఓ వ్యాపారం. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతారు. పాదయాత్ర ప్రారంభంలో మహాజాతి సదన్‌లో జరిగిన సభకు లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్‌బోస్ అధ్యక్షత వహించారు. లెఫ్ట్ ఫ్రంట్‌కు వెలుపల ఉన్న పార్టీలు కూడా పాదయాత్రలో పాల్గొనడం విశేషం. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి స్వపన్ బెనర్జీ, ఆర్‌ఎస్‌పి తపన్ హెూర్, ఫార్వర్డ్ బ్లాక్ నరేన్ ఛటర్జీ, సిపిఐ-ఎంఎల్(లిబరేషన్) అభిజిత్ మజుందార్, ఎస్‌యుసిఐ తరుణ్ మండల్ తదితరులు మాట్లాడారు.

కేరళ మరో పిటిషన్

- బిల్లులపై గవర్నర్ వైఖరికి నిరసన
- పెండింగ్‌లో ముఖ్యమైన బిల్లులు

న్యూఢిల్లీ : కేరళ అసెంబ్లీ ఆమోదించిన ముఖ్యమైన బిల్లులను మంజూరు చేయకుండా నిలుపుదల చేసిన గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ వైఖరిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రెండో పిటిషన్ దాఖలు చేసింది. బిల్లులపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని గవర్నర్‌ను ఆదేశించలేమన్న కేరళ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ముఖ్యమైన బిల్లులను పెండింగ్‌లో ఉంచటంపై రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారించనుండగా, గవర్నర్‌పై చీఫ్ సెక్రటరీ, లా సెక్రటరీ మరో పిటిషన్ వేశారు. గవర్నర్ తీరుపై న్యాయవాది పీవీ జీవేష్ గతంలో కేరళ హైకోర్టును ఆశ్రయించారు. గవర్నర్‌కు కోర్టు కాలపరిమితిని నిర్ణయించదని పేర్కొంటూ.. జీవేష్ పిటిషన్‌ను హైకోర్టు 2022 నవంబర్‌లో కోర్టు కొట్టివేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలపై కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్లు వీలైనంత త్వరగా బిల్లులపై నిర్ణయం తీసుకోవాలంటూ ప్రత్యేక అనుమతి పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అసెంబ్లీ ఆమోదించిన ఎనిమిది ముఖ్యమైన బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచారు. గవర్నర్ పరిశీలనకు పంపిన వాటిలో మూడు బిల్లులు ఇప్పటికే రెండేండ్లు పూర్తయ్యాయి. మరో మూడు బిల్లులపై ఏడాదికి పైగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

తెలంగాణ గవర్నర్‌పై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు, ఆర్టికల్ 200లోని ప్రస్తావించింది. 'సాధ్యమైనంత త్వరగా' అనేది రాజ్యాంగపరంగా చాలా ముఖ్యమైనదనీ, రాజ్యాంగబద్ధంగా ఉన్నవారు ఆ విషయాన్ని మరచిపోకూడదని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయం తెలిసిందే. బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో గవర్నర్ ఉద్దేశ్యపూర్వకంగా జాప్యం చేయడం వల్ల శాసనసభకు, ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. రాజ్యాంగంలోని నిబంధనలను ఉల్లంఘించి, రాజ్యాంగాన్ని ఉల్లంఘించే విధంగా వ్యవహరించే గవర్నర్లకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 రక్షణకు అర్హత లేదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. కాగా, కేరళ తరపున మాజీ అటార్నీ జనరల్, రాజ్యాంగ నిపుణుడు కేకే వేణుగోపాల్ సహా సీనియర్ న్యాయవాదులు హాజరుకానున్నారు.

తూర్పు గాలులతో వర్షాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

దక్షిణ కోస్తా, రాయలసీమలోని తూర్పు గాలుల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బుధవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో తూర్పు గాలులు, వర్షాలు సంభవిస్తున్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సాయంత్రం నుంచి రాత్రి ఏడుగంటల వరకు వర్షం పడింది. వరి పొట్ట దశలో ఉన్నందున ఎక్కువగా వర్షం కురిస్తే నష్టం వాటిల్లుతుందని పలువురు రైతులు వాపోయారు. పత్తి కాయలు, పూత రాలిపోయే ప్రమాదం ఉందన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో పెనుమంట్ర, పోడూరు, మొగల్తూరు తదితర మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురవగా మిగిలిన ప్రాంతాల్లో చెదురుమదురు జల్లులు పడ్డాయి. కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో సాయంత్రం 4.30 గంటల నుంచి ఏడు గంటల వరకు మోస్తారు వర్షం కురిసింది. విజయవాడతో పాటు చల్లపల్లి, నందిగామ, కంచికచర్ల, ఉయ్యూరు, కంకిపాడు మండలాల్లో గంట పాటు భారీ వర్షం కురిసింది. అనంతపురం జిల్లాల్లో మోస్తరు వర్షం పడింది.

వాగులో చిక్కుకున్న వ్యక్తి

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలో ఒమ్మివరం గ్రామానికి చెందిన గోగినేని హనుమంతరావు దర్శిలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. రోజూ తన కారులో నిడమానూరు-గ్రోత్ సెంటర్ మార్గం గుండా దర్శికి వెళ్తారు. కొత్తకోట శివారులో గల హనుమాపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో కారును ముందుకుపోనివ్వడంతో నీటి ప్రవాహనికి కొట్టుకుపోయారు. ఓ తుమ్మ చెట్టును పట్టుకొన్ని ఉన్న హనుమంతరావును స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రెస్క్యూటీం, పోలీసులు, ఫైర్ సిబ్బంది సహకారంతో ఆయనను రక్షించారు.

బంగ్లా దేశ్‌లో గార్మెంట్ కార్మికుల పోరాట విజయం

- కనీస వేతనం 56 శాతం పెంపు

ఢాకా: కనీస వేతన పెంపు కోసం బంగ్లాదేశ్‌లో గార్మెంట్ కార్మికులు వారం రోజులుగా చేస్తున్న సమ్మె విజయవంతమైంది. కనీస వేతనం 56 శాతం పెంచుతున్నట్లు కార్మిక మంత్రి మొన్నుజన్ సుఫియాన్ ప్రకటించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం, కార్మికుల ప్రతినిధులతో చర్చించిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. కొత్త పే స్కేల్ డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. ప్రపంచంలో చైనా తర్వాత బంగ్లాదేశ్ రెండవ అతిపెద్ద వస్త్ర ఉత్పత్తిదారు. చివరిగా 2018లో వేతన సవరణ జరిగింది. కనీస వేతనం 75 డాలర్ల (రూ.6,242) నుంచి 208 డాలర్లకు (రూ.17,313) పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. అయితే 25 శాతం నుంచి 90 డాలర్లు మాత్రమే పెంచుతామని ఫ్యాక్టరీ యాజమాన్యం మొండిగా చెప్పడంతో సమ్మె మొదలైంది. భారీ ర్యాలీలు, బహిష్కరణలు, ఫ్యాక్టరీ దిగ్బంధనాలు జరిగాయి. నిరసనల ఫలితంగా పలుచోట్ల పోలీసులతో వాగ్వాదం చోటుచేసుకుంది. కార్మికులు తమ డిమాండ్‌పై పట్టుబట్టడంతో ప్రభుత్వం చర్చలు జరిపింది. 113 డాలర్లకు (9,406 రూపాయలు) పెంచేందుకు అంగీకారం కుదిరింది. దేశంలో 3500 వస్త్రాల తయారీ కర్మాగారాలు ఉన్నాయి. ఈ రంగంలో 40 లక్షల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. 55 బిలియన్ డాలర్ల (రూ. 4.68 లక్షల కోట్లు) వార్షిక ఎగుమతుల్లో గార్మెంట్స్ రంగం వాటా 85 శాతం దాకా ఉంది.

ఎరువు సబ్సిడీ కోతపై కిసాన్ సభ ఆందోళన

- తగ్గింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్

న్యూఢిల్లీ : గత నెల 26న జారీ చేసిన నోటిఫికేషన్‌లో ప్రకటించినట్లుగా ఎన్‌బిఎస్ పథకం కింద ఎరువులపై సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ఇటీవల గణనీయంగా తగ్గించింది. సబ్సిడీ కుదింపుపై అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఎరువులు ముఖ్యంగా ఫాస్ఫేట్, పొటాష్ సబ్సిడీలు దారుణంగా తగ్గించారని, దీనివల్ల రైతుల దుస్థితి మరింత పెరుగుతుందని పేర్కొంది. 2020 జూన్‌లోని సబ్సిడీ రేటుతో పోల్చుకుంటే ఈ ఏడాది అక్టోబరులో ఫాస్ఫేట్లపై సబ్సిడీ కేవలం 9 శాతమే అధికంగా వుందని డేటా వెల్లడిస్తోంది. కానీ 2002 జూన్‌తో పోలిస్తే రాక్ ఫాస్ఫేట్ అంతర్జాతీయ ధరలు మాత్రం దాదాపు 4.6 రెట్లు పెరిగాయి. పొటాష్ పరిస్థితి మరీ దారుణంగా వుంది. సబ్సిడీని సంక్షోభానికి ముందు స్థాయిలో కేవలం 23 శాతానికి కుదించారు. లేదా మారకపు రేటు తరుగుదలను పరిగణిస్తే దాదాపు 80 శాతంగా వుంది. 2020 జూన్‌తో పోలిస్తే పొటాషియం క్లోరైడ్ అంతర్జాతీయ ధరలు 1.75 రెట్లు ఎక్కువగా వున్న తరుణంలో ఈ పరిస్థితి నెలకొందని ఎఐకెఎస్ విమర్శించింది. సబ్సిడీని ఇంత దారుణంగా కుదించడం వల్ల భారత్‌లో ఎరువుల ధరలు తీవ్రంగా పెరగడానికి దారి తీసే వీలుందని హెచ్చరించింది. తక్షణమే కేంద్రం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

తుమ్మల ఇంటిలో పోలీసుల సోదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఇంట్లో బుధవారం ఉదయం పోలీసులు సోదాలు నిర్వహించారు. పోలీసులతోపాటు కొందరు రెవెన్యూ అధికారులు కూడా సోదాల్లో పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 35 వేల బోగస్ ఓట్లను చేర్పించారని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌పై తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. మంత్రి అజయ్ సూచన మేరకు కలెక్టర్, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు బోగస్ ఓట్లను చేర్పించారని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఎన్నికల అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆ ఫిర్యాదులో తుమ్మల ప్రస్తావించారు. ఈ ఫిర్యాదు చేసిన రెండు రోజుల్లోనే తుమ్మల నివాసంలో పోలీసులు సోదాలు చేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు బుధవారం ఉదయం తుమ్మల తన నివాసం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఆయన వెళ్లిన తర్వాత పోలీసులు తుమ్మల ఇంట్లోకి వచ్చారు. ఆ సమయంలో ఇంట్లో తుమ్మల భార్యతోపాటు కొందరు అనుచరులు ఉన్నారు. మరోవైపు తుమ్మల నివాసంలో సోదాలపై కాంగ్రెస్ శ్రేణులు మండిపడుతున్నారు. బిఆర్ఎస్ పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓటమి భయంతోనే బిఆర్ఎస్ పార్టీ ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ శ్రేణులు ఆరోపిస్తున్నారు.

రాజస్థాన్‌లో తొలిసారిగా ఓటు వేయనున్న 22.71 లక్షల మంది

జైపూర్ : రాజస్థాన్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య ఐదు కోట్లా 29 లక్షలకుపైగా ఉండగా, వారిలో 22 లక్షలా 71 వేల మందికి పైగా కొత్త ఓటర్లు తొలిసారిగా ఓటు వేయనున్నారు. ఈ మేరకు ఎన్నికల ప్రధాన అధికారి ప్రవీణ్ గుప్తా వివరాలను వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో పురుషుల ఓటర్లు 2 కోట్లా 74 లక్షలా 74 వేలా 849 మంది, మహిళా ఓటర్లు 2 కోట్లా 53 లక్షలా 13 వేల 458 మంది ఉన్నారని గుప్తా తెలిపారు. ఈ ఎన్నికల్లో 18 నుండి 19 ఏండ్లలోపు 22 లక్షలా 71 వేలా 647 మంది కొత్త ఓటర్లు తొలిసారిగా ఓటు వేయనున్నారని చెప్పారు.

మానవతా కారిడార్లకు జి7 మద్దతు

టోక్యో : ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న బాంబు దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న గాజాలో కాల్పుల విరమణకు పిలుపివ్వకుండా జి-7 దేశాలు దూరం పాటించాయి. కానీ మానవతా సాయం కోసం కాల్పుల విరమణకు కాస్తంత విరామాలు కల్పించేందుకు, మానవతా కారిడార్ల ఏర్పాటు చేయడానికి మద్దతు తెలిపాయి. ఇక్కడ సమావేశమైన జి-7 దేశాల విదేశాంగ మంత్రులు ఈ మేరకు సంయుక్తంగా ప్రకటన జారీ చేశారు. అలాగే రష్యాతో యుద్ధం జరుపుతున్న ఉక్రెయిన్‌కు కూడా తమ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ ఘర్షణ విషయంలో రష్యాకు మద్దతివ్వరాదంటూ చైనాకు విజ్ఞప్తి చేశారు. "గాజాలో దిగజారుతున్న మానవతా సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అత్యవసర కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం వుందని మేం నొక్కి చెబుతున్నాం. మానవతా సాయం అందేందుకు వీలుగా కారిడార్‌లు ఏర్పాటు చేయడానికి, తాత్కాలికంగా కాల్పుల విరమణలకు మేం మద్దతిస్తున్నాం. బందీలను కూడా తక్షణమే విడుదల చేయాలి." అని సంయుక్త ప్రకటన పేర్కొంది. గత నెల 7వ తేదీన జరిగిన దాడులు వంటివి పునరావృతం కాకుండా నివారించేందుకు అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా తనను కాపాడుకునేందుకు, తన ప్రజలను రక్షించుకునేందుకు ఇజ్రాయిల్‌కు హక్కు వుందంటూ జి-7 మంత్రులు పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
టెండరు షార్ట్ నోటీసు
నం.17(1)/టి.ఓ/2023-24, తేది : 03.11.2023
2023-24 సం॥నకు బెయిలీ వంతెన మరమత్తులు నిమిత్తం మొత్తము 1 పనికి అంచనా విలువ : రూ.10.00 లక్షలకు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు తేది : 10.10.2023, సా.3 గం. నుండి. ఇతర వివరాలను ఈ కార్యాలయములో పొందగలరు. ఫోన్ నెం.08672-252500
సం/- కార్యనిర్వాహక ఇంజనీర్, (ర.భ) శాఖ, మచిలీపట్నం
DIPRNo.11566/CL/ADVT/1/1/2021-22

పాత్రికేయుడి ఫోన్‌లో పెగాసస్ ?

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్రమోడీకి అత్యంత సన్నిహితుడైన గౌతమ్ అదాని సంస్థల అక్రమాలపై పరిశోధనాత్మక కథనాలు అందించిన పాత్రికేయుడు ఆనంద్ మంగ్నాలే ఫోన్‌లో పెగాసస్ స్పైవేర్ అమర్చివుండవచ్చని ఫోరెన్సిక్ నిపుణుడిని ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. మంగ్నాలే ఫోన్‌లో అనుమానాస్పద వైఫల్యాలు కన్పించాయని, అవి గతంలో పెగాసస్ చొరబాట్లను పోలి ఉన్నాయని ఫోరెన్సిక్ సంస్థ 'ఐ వెరిఫై' రాయిటర్స్‌కు వివరించింది. 'నేను అత్యంత నమ్మకంతో చెప్పగలను. మంగ్నాలే ఫోన్‌పై పెగాసస్ దాడి జరిగింది' అని ఐ వెరిఫై వ్యవస్థాపకుడు రాకీ కోల్ చెప్పారు. 'ప్రభుత్వ ప్రేరేపిత వ్యక్తులు మీ ఐఫోన్లను లక్ష్యంగా చేసుకోవచ్చు' అంటూ గత నెల యాపిల్ హెచ్చరికలు అందుకున్న పాత్రికేయుల్లో మంగ్నాలే కూడా ఉన్నారు.

ప్రజల పక్షం ఉన్న వారినే ఎన్నుకోండి

(మొదటిపేజీ తరువాయి)

జగన్‌మోహనరెడ్డి చెబుతున్నారని, అయితే, పన్నుల పేరుతో వారి జేబుల నుంచి లాగుతున్నది ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. వార్డు, గ్రామ సచివాలయాల ఉద్యోగుల మాదిరిగానే అంగన్‌వాడీ, ఆశా, తదితర స్కీం వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి పింఛను సౌకర్యం కల్పించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోరాటాల పురిటిగడ్డ సీతంపేట మండలంలో ప్రారంభమై అల్లూరి సీతారామరాజు నడియాడిన నేలపై పర్యటన పూర్తి చేసుకుని పుచ్చలపల్లి సుందరయ్య నడియాడిన నేలమీదకు యాత్ర రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సురేంద్ర మాట్లాడుతూ కేంద్రం సామాన్యులకు ఉపయోగపడే 500 ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసి డబ్బులున్న వారి కోసం వందే భారత్ రైళ్లను తీసుకొచ్చిందన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు ఎం.నాగమణి, రైతు సంఘం నాయకులు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, రైతుల సమస్యలు ప్రభుత్వాలకు పట్టడం లేదని విమర్శించారు. ఈ సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, సిపిఎం కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కార్యదర్శులు వై.నరసింహారావు, డివి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరికి వినతులు

ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర బృందానికి హనుమాన్ జంక్షన్లో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ముఠా కార్మికులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అసైన్‌మెంట్ భూములకు హక్కులు కల్పించాలని ఎలుకపాడులో, తమ వేతనాల పెంపుదలకు కృషి చేయాలని పంచాయతీ వర్కర్లు గన్నవరంలో వినతిపత్రాలు అందించారు. యాత్ర బృందంపై ఆయా ప్రాంతాల్లో పార్టీ శ్రేణులతోపాటు మహిళలు పూలవర్షం కురిపించారు. యాత్రకు నేతృత్వం వహిస్తున్న వి.శ్రీనివాసరావు మూడు ప్రాంతాల్లో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్దకు యాత్ర బృందం చేసుకొనే సరికి భారీ వర్షం కురిసింది. అయినా, వెరవకుండా ప్రజలు యాత్రకు ఘన స్వాగతం పలికి బైక్ ర్యాలీగా విజయవాడలోని లెనిన్ సెంటర్‌కు తోడ్కొని వచ్చారు.

దశలు దశల భరోసా!

(మొదటిపేజీ తరువాయి)

ఈ నెలాఖరుకు పడతాయని అంచనా వేస్తున్నారు. ఏతావాతా ప్రస్తుతానికి రైతులకు రాష్ట్రం ఇచ్చే రెండు వేలే దిక్కు. అవి కూడా రోజుకు కొంత మందికే పడుతున్నాయి.

కౌల్దార్లపై స్పష్టత లేదు

కౌలు రైతులందరికీ పూర్తి స్థాయిలో భరోసా అని ప్రభుత్వం పేర్కొనగా, కేంద్రం కౌలు రైతులకు అసలు సాయం ఇవ్వట్లేదు. దాంతో రాష్ట్ర సర్కారే రూ.13,500 సాయాన్నీ ఇస్తోంది. సొంత భూమి సాగు చేసుకునే యజమానులకు మల్లే వారికీ ఏడాదిలో మూడు కిస్తుల్లో వేస్తోంది. అయితే యజమానులతో పాటు ఇవ్వట్లేదు. ఈ సంవత్సరం జూన్ 1న ఈ ఏడాది తొలి కిస్తు యజమానులకు ఇవ్వగా మూడు మాసాలు ఆలస్యంగా సెప్టెంబర్ 1న చాలా స్వల్ప సంఖ్యలో కౌలు రైతులకు మొదటి కిస్తు జమ చేశారు. ఇప్పుడు కౌలు రైతులకు కూడా వేసారా లేదా అన్న విషయంపై ఎక్కడా స్పష్టత లేదు. కౌలు రైతులకు, అటవీ హక్కుల చట్టం కింద నమోదైన వారికి, దేవాదాయ భూములు సాగు చేసుకునే వారికి రాష్ట్రం రూ.4 వేలు చొప్పున వేయాలి. వారికి కూడా కొన్ని దశల్లో అప్పుడు కొంత మందికి అప్పుడు కొంత మందికి వేస్తారని తెలుస్తోంది.

విద్యా సంస్థల బంద్ సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

విజయవాడలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రభుత్వ రంగ సంస్థను కూడా ఏర్పాటు చేయలేదని తెలిపారు. పైగా, ఒక పథకం ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోందన్నారు. దీనిలో భాగంగానే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందని దుయ్యబట్టారు. విభజన హామీల్లో భాగమైన కడపలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ హామీని నెరవేర్చకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలు కూడా అమలు కాలేదన్నారు. బంద్‌లో భాగంగా విద్యార్థులు ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు జిల్లాల్లో విద్యార్థి, యువజన సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత వారిని విడుదల చేశారు. విజయవాడలోని మాచవరంలోగల ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ కళాశాల వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి, యువజన సంఘం నేతలను 20 మందిని పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. విశాఖ, నెల్లూరు, గుంటూరు, నంద్యాల్లోనూ పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. తిరుపతి జిల్లా పుత్తూరులో బంద్ విజయవంతానికి కృషి చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులను ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై వారిని విడుదల చేశారు.విశాఖ నగరంలోని ఆంధ్రా యూనివర్సిటీ, ప్రభుత్వ ఐటిఐతోపాటు మిగిలిన విద్యా సంస్థల నుంచి కూడా బంద్‌కు విశేష స్పందన లభించింది. వైఎస్ఆర్ జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో కెజి నుంచి పిజి వరకూ అన్ని ప్రయివేట్ విద్యా సంస్థలకూ ఆయా యాజమాన్యాలు ముందుగానే సెలవు ప్రకటించాయి. ప్రభుత్వ విద్యా సంస్థలను విద్యార్థి, యువజన సంఘాల నాయకులు వెళ్లి బంద్‌కు మద్దతి ఇవ్వమని కోరగానే అన్ని విద్యా సంస్థలూ స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి. విశాఖ, పార్వతీపురం, శ్రీకాకుళం, అనంతపురం, పుట్టపర్తి, శ్రీకాకుళం జిల్లా పలాసలోనూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విజయనగరం, అనకాపల్లి, బాపట్ల, తిరుపతి, ప్రకాశం జిల్లా ఒంగోలులో మానవహారంగా ఏర్పడ్డారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట సిపిఎం, సిపిఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పాల్గొని ప్రసంగించారు.

మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీస్: యూనిట్ నం. 203, అమిత్ బిల్డింగ్, పిరమల్ అగస్త్య కార్పొరేట్ పార్క్, అగ్నిమాపక దళం స్టేషన్ ఎదురుగా కమని జంక్షన్, L.B.S. మెయిన్ రోడ్, కుర్లా (పశ్చిమ) ముంబై - 400 070
బ్రాంచ్ కార్యాలయం: డోర్.నెం: 5-1-451, 3వ అంతస్తు, సుజుకి షోరూమ్ మేడమీద, పల్నాడు రోడ్, నరసరావు పేట , గుంటూరు జిల్లా- 522 601
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
సెక్యూరిటైజేషన్ మరియు రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు - 2002 పరిధిలో ఈ క్రింది సంతకందారు మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇప్పటి నుండి MRHFL గా పరిగణించనది), రిజిస్టర్డ్ కార్యాలయం, మహీంద్రా టవర్స్, 4వ అంతస్తు, Dr.G.M.భోసలే మార్గ్, వర్లి, ముంబై 400 018 ఇండియా వద్ద మరియు బ్రాంచి కార్యాలయం - డోర్.నెం: 5-1-451, 3వ అంతస్తు, సుజుకి షోరూమ్ మేడమీద, పల్నాడు రోడ్, నరసరావు పేట , గుంటూరు జిల్లా- 522 601 వద్ద కలిగియున్న సంస్థ అధీకృత అధికారిగా మరియు సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్ మెంట్) రూల్స్ 2002 యొక్క 3వ రూలుతో కూడిన సదరు చట్టం 13 (12) విభాగం క్రింద సంక్రమించిన అధికారాలతో ఈ క్రింది ప్రతి ఖాతాకు ఎదురుగా సూచించిన మొత్తమును చెల్లించవలసినదిగా సంబంధిత రుణగ్రహీత/లును సదరు నోటిసు స్వీకరణ తేదీ నుండి 60 దినములలోగా చెల్లించవలసినదిగా ప్రతి ఖాతా ఎదురుగా తెలిపిన తేదీలలో డిమాండ్ నోటిసు/లు జారీ చేసినారు. రుణగ్రహీత/లు సదరు మొత్తమును తిరిగి చెల్లింపు చేయుటలో విఫలమైనారు. కనుక రుణగ్రహీత/లుకు మరియు యావన్మంది ప్రజానీకమునకు తెలియచేయునది ఏమనగా సదరు చెప్పిన నియమావళి యొక్క రూ.లు 8 తో కూడిన సదరు చట్టం 13 (4) విభాగం పరిధిలో అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో దిగువ వివరించిన ఆస్తి/ఆస్తులను క్రింది సంతకందారు ప్రతి ఖాతా ఎదురుగా తెలిపిన తేదీన స్వాధీన పరచుకొనినారు. రుణగ్రహీత/లుకు ప్రత్యేకంగాను మరియు యావన్మంది ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు అట్టి లావాదేవీలు ఏవైనను మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి లోను అగ్రిమెంటు ప్రకారం చెల్లించవలసిన మొత్తము మరియు అందుపై వడ్డీ చెల్లింపునకు లోబడి మాత్రమే నిర్వర్తించవలెను. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సదరు చట్టం 13వ విభాగం (8)వ ఉప-విభాగం నియమావళి పరిధిలో తగిన సమయం లభించునని రుణగ్రహీతలకు సూచించటమైనది.

వ. నెం	అగ్రిమెంట్ నెం. / ఫిన్ నెం.	రుణ గ్రహీత /సహ-రుణ గ్రహీత / హామీదారు(లు)	డిమాండ్ నోటీస్ తేదీ	డిమాండ్ నోటీస్ ప్రకారం మొత్తం	స్వాధీన పరచుకున్న తేదీ	స్థిరాస్థి వివరణ
1	XRESNRS0096 2246/1227921	చేకూరి నాగేశ్వరరావు తండ్రి వెంకటేశ్వర్లు, కండ్లకుంట గ్రామం, నకరికల్లు మండలం, గుంటూరు జిల్లా. చేకూరి సాగరి భర్త నాగేశ్వరరావు, కండ్లకుంట గ్రామం, నకరికల్లు మండలం, గుంటూరు జిల్లా. కుమ్మరకుంట మోష తండ్రి పిలుపు, కండ్లకుంట గ్రామం, నకరికల్లు మండలం, గుంటూరు జిల్లా. ఆర్ఎస్ నెం: 468, D.No.7-43, కండ్లకుంట గ్రామం, నకరికల్లు మండలం, గుంటూరు జిల్లా.	09-11-2022	రూ. 1,23,294/- (రూ. లక్షా ఇరవై మూడు వేల రెండు వందల తొంభై నాలుగు రూపాయలు మాత్రమే)	04-11-2023	కండ్లకుంట గ్రామం, నకరికల్లు మండలం, గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ రిజిస్ట్రేషన్ ఆర్.ఎస్. నెం.468, D.No. 7-43, విస్తీర్ణం:1305 చ.మీ.లు సంపూర్ణమైన ఆస్తి సరిహద్దులు: **పడమర:** C.లక్ష్మయ్యగారి ఇల్లు, **తూర్పు:**పంచాయతీ రోడ్, **దక్షిణం:** C.రామయ్యగారి ఇల్లు, **ఉత్తరం:** బి.నర్సయ్య కార్పొ.
2	XRESNRS0089 0226/1104992	తాళ్లూరి అశోక్ తండ్రి ప్రభాకర్, ఆర్ఎస్ నెం:52 D.No. 6-111 చల్లగుండ్ల గ్రామం, నకరికల్లు మండలం, గుంటూరు జిల్లా. తాళ్లూరి ప్రభాకర్ తండ్రి వెంకటేశ్వర్లు, తాళ్లూరి మరియమ్మ భర్త ప్రభాకర్, బొక్కా గురవయ్య తండ్రి వెంకయ్య, D.No: 6-93, చల్లగుండ్ల గ్రామం, నకరికల్లు మండలం, గుంటూరు జిల్లా.	09-11-2022	రూ. 1,17,450/- (రూ. లక్షా పదిహేడు వేల నాలుగు వందల యాభై రూపాయలు మాత్రమే)	04-11-2023	చల్లగుండ్ల గ్రామం, గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ రిజిస్ట్రేషన్ ఆర్.ఎస్. నెం: 52, D.No. 6-111, కింది సరిహద్దులతో 1035 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న సంపూర్ణమైన ఆస్తి సరిహద్దులు: **పడమర:** లింకాయి అన్నమ్మ ఇల్లు, **తూర్పు:** పంచాయతీ రోడ్, **దక్షిణం:** తాళ్లూరి ప్రభాకర్ హౌస్, **ఉత్తరం:** బొక్కా బాబురావు భూమి.

స్థలం : గుంటూరు
తేదీ : 09-11-2023
సం /- అధీకృత అధికారి
M/S. మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

మీ కోసం

గ్లాసు పాలలో చిటికెడు పసుపు వేసి కాచుకొని రోజూ ఉదయాన్నే తాగితే జలుబు, దగ్గు, గొంతు సమస్యలు తగ్గుతాయి.

జీవన సౌరభం

చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే, చెయ్యాలనే కోరిక, సంకల్పం ఉన్నవాడు ఎక్కువ చెయ్యగలడు.

ఊరు మారింది!



భద్రిగూడెం అనే పల్లెటూరికి ఏకోపాధ్యాయ పాఠశాల మాస్టారుగా శేఖరం వచ్చారు. వచ్చిన రోజునే బడి వాతావరణం గమనించారు. బూజులు పట్టిన గదులు, మురికిగా గోడలు, మీద పడేలా పైకప్పు పెంకులు చూసి బాధపడ్డారు. వెంటనే బడి పిల్లలని సమావేశ పరిచి 'పిల్లలూ, ముందు మనం మన బడిని బాగు చేసుకుందాం. తరువాతే పాఠాలు' అన్నారు. మాస్టారు అలా అన్నారో లేదో, ఒక పిల్ల బయటకు పరిగెత్తుకు వెళ్ళి వాళ్ళ అమ్మని, కొంతమంది ఊరువాళ్ళని తీసుకు వచ్చింది. 'చూడు మాస్టారు మీరు పాఠాలు చెబుతానంటే పిల్లలని పంపుతాం. కానీ బడి తుడిపించి, కడిగిస్తానంటే కుదరదు' అన్నారు వచ్చిన వాళ్ళు. 'దీనికే ఇంత కోపమైతే ఎలా? మీ పిల్లలు ఒక్కరోజు కూడా బడి మానరు అని హామీ ఇస్తే, ఇలాంటి పని చేయక్కరలేదు' అన్నారు శేఖర్ మాస్టారు.

'ఒక్కరోజు కూడా మానకుండా ఎలా మాస్టారూ.. నలతలు రావా ఏంటి?' అన్నారు వాళ్ళు. 'అందుకే మనం వుండే చోటు బాగా వుండాలి అనేది. పిల్లలు పగలంతా బడిలో వుంటారు. ఇక్కడ శుభ్రంగా లేకపోతే జబ్బు పడేది వాళ్ళే కదా!' అన్నారు శేఖర్. 'మాకు ఇలా ఎవరూ చెప్పలేదు పంతులు గారూ... పిల్లలతో పాటు మేము కూడా బడిని బాగు చేస్తాం' అంటూ తలా ఒక చేయి వేశారు వచ్చిన పెద్దలు.

ఆ రోజు మధ్యాహ్నానికి బడికి ఒక రూపు వచ్చింది. విషయం తెలుసుకున్న ఆ ఊరి కిరాణా వ్యాపారి బడికి రంగులు వేయించాడు. నాగన్న అనే రైతు, బడి చుట్టూ మొక్కలు నాటించాడు. అందరూ డబ్బులు వేసుకుని బడికి మంచి నీటి సదుపాయం కల్పించారు. వారం రోజులకే పిల్లలకి 'ఇంటి కంటే బడి పదిలం' అన్నట్లు తయారయ్యింది. పిల్లలకి ఎంతో ఉత్సాహంగా పాఠాలు చెప్పడం మొదలు పెట్టారు శేఖర్. పిల్లలకు జబ్బులు రావడం తగ్గిపోయింది. పిల్లలతో పాటు ఊరినీ బాగు చేయాలని శేఖర్ మాస్టారుకు ఓ ఆలోచన వచ్చింది.

పిల్లల హోమ్ వర్క్‌కి రెండు పుస్తకాలు కొనిపించారు. ఒకటి, వాళ్ళు రాయడానికి. రెండవది చదువుకోని వాళ్ళ అమ్మలు రాయడానికి. మొదట వ్యతిరేకించినా తరువాత పిల్లలతో పాటు వాళ్ల కూడా రాయడం, చదవడం నేర్చుకున్నారు. పిల్లలే వాళ్ళ అమ్మలకు పాఠాలు చెప్పేలా ప్రోత్సహించారు మాస్టారు. నెమ్మదిగా ఆ వూరులో అందరూ అక్షరాస్యులుగా మారారు. ఒక మంచి మాస్టారు బడినే కాదు ఊరినీ మార్చగలరని శేఖర్ మాస్టారు నిరూపించారని గ్రామస్తులు కొనియాడారు. విషయం తెలుసుకున్న అధికారులు శేఖర్ మాస్టారుకి అభినందనలు తెలిపారు.

- కూచిమంచి నాగేంద్ర,
91821 27880.

నేను గీసిన బొమ్మ



డి. ధార్విక్,
2వ తరగతి,
ఎల్‌ఎఫ్‌ఎస్
ఇంగ్లీష్ మీడియం స్కూలు,
విద్యానగర్, గుంటూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మైదానంలో మెరిసే మానవత్వం

'టెన్నిస్ ఆటపట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను. కానీ ఈ మధ్య కాలంలో నేను సంతోషంగా లేను. ఇలా చెబుతున్నందుకు నన్ను క్షమించండి. ఇది రాజకీయ సందేశం కాదు. ఇది మానవత్వం. నేను ప్రపంచ శాంతిని కోరుకుంటున్నాను. కొంతకాలంగా మీడియాలో కనబడుతున్న అతి భయానక గాజా యుద్ధ దృశ్యాలు నాకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అక్కడ రోజూ పిల్లలు చనిపోతున్నారు. లోకం చూడని పసివారు అమ్మ కడుపులో ఉండగానే అశువులు బాస్తున్నారు. వృద్ధులు, మహిళలు, పౌరులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు పెడుతున్నారు. కుప్పలు కుప్పలుగా మృతదేహాలు.. అందులో పిల్లలే ఎక్కువ.. గాయాలతో నెత్తురోడిన బిడ్డలను పొత్తిళ్లల్లో పెట్టుకుని పరుగెడుతున్న అమ్మలు, నాన్నలు.. శిథిలాల కింద శిథిలమైన తమ వారిని వెతుక్కుంటున్న ఆప్తులు.. ఆకలి కేకలు.. ప్రతి రోజూ ఈ దృశ్యాలు చూస్తున్న నేను ఏమీ చేయలేకపోతున్నాను. ఆ బాధ నన్ను మరింత కుంగదీస్తోంది' అంటూ కన్నీరు పెట్టింది ట్యునీషియాకు చెందిన ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి ఆన్స్ జబీర్.

ట్యునిసియా టెన్నిస్ క్రీడాకారిణి ఆన్స్ జబీర్ పేరు తెలియని క్రీడాభిమానులు ఉండరు. ఇటీవల మెక్సికోలోని కాంకున్‌లో జరిగిన ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్(డబ్ల్యుటిఎ) ఓటమి అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ఇజ్రాయిల్-గాజా యుద్ధంపై స్పందించారు. ఆ సమయంలో ఆమె కళ్ల నుండి అదేపనిగా కన్నీరు కారుతూనే ఉంది. మానవత్వం నిండిన మనుషులెవరినైనా ఆ భయానక యుద్ధ దృశ్యాలు అంతలా కదిలిస్తాయి మరి. అయితే ఆన్స్ అంతకు మించిన మానవత్వ హృదయంతో స్పందించారు. ఈ పోటీలో తనకు వచ్చిన బహుమతి సొమ్ములో కొంతభాగాన్ని పాలస్తీనా పౌరుల సహాయార్థం విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.

'ఈ సాయం అక్కడి పౌరులకు ఏమాత్రం ఊరటనివ్వదని నాకు తెలుసు. అయినా నేను వారిని అలా చూస్తూ ఉండలేకపోతున్నాను. అక్కడ జరుగుతున్న ప్రస్తుత పరిస్థితులు నన్ను సంతోషంగా ఉండనీయడం లేదు' అంటూ ఆమె చెబుతున్నప్పుడు కన్నీటితో గొంతు పెగల్లేదు. కెమెరా నుండి దూరంగా వెళ్లిపోయింది. ధారాళంగా కారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ తన ప్రసంగాన్ని కొనసాగించింది. గాజా యుద్ధ పరిస్థితిపై తమ అభిమాన క్రీడాకారిణి మాట్లాడినందుకు మెక్సికన్ నగర ప్రజలంతా ఆమెను వేన్నోళ్ల కొనియాడారు. ఆ క్రీడాప్రాంగణమంతా చప్పట్లతో మార్మోగింది. 'ఇది నాకు చాలా కష్టంగా ఉంది. నా గుండె ముక్కలైంది. అందుకే నా ప్రైజ్ మనీలో కొంతభాగం వారికి ఇవ్వాలనుకుంటున్నాను' అని ప్రకటించగానే ప్రపంచ క్రీడాభిమానులు క్రీడాస్ఫూర్తికి మించిన ఆమె మానవత్వాన్ని మనసారా అభినందించారు.

1994లో టునిసియాలో ఓ మధ్యతరగతి కుటుంబంలో ఆన్స్ జబీర్ పుట్టారు. అమ్మ కల నెరవేర్చేందుకు మూడేళ్ల ప్రాయం నుండే టెన్నిస్ బ్యాట్‌ను చేతబట్టిన ఆన్స్ 2021 నాటికి ప్రపంచ టెన్నిస్ క్రీడాకారుల్లో మొదటి పదిమందిలో స్థానం సంపాదించారు. అంతేకాదు, అరబ్‌దేశం నుండి ఎంపికైన తొలి ముస్లిం మహిళగా చరిత్ర సృష్టించారు.

టెన్నిస్ కోర్టులో అడుగుపెట్టింది మొదలు ఆమె పేరుతో రికార్డుల వర్షమే కురిసింది. ఆ విజయాలకు గుర్తింపుగా, క్రీడారంగంలో ప్రపంచదేశాల సరసన టునిసియా పేరు నిలబెట్టినందుకు ఆ దేశం ఆమెను సముచితంగా గౌరవించింది. ఒకచేత్తో పిడికిలి, మరోచేత్తో టునిసియా దేశ పతాకను చేబూనిన ఆమె చిత్రపటంతో స్టాంపు ముద్రించింది. టునిసియా ప్రజలకే కాదు, మధ్య ప్రాచ్యం, అరబ్ దేశాలు, ఉత్తర ఆఫ్రికా మహిళలకు, పిల్లలకు ఆమె ఒక హీరో. ఆటలో ఆమె గెలిచినా, ఓడినా ఆ ప్రజలు ఆమెపై అమిత ప్రేమను కురిపించేవారు. ప్రపంచం మెచ్చే క్రీడాకారిణిగా, గొప్ప హృదయం గల వ్యక్తిగా ఆమె కీర్తిని తమ మనవళ్లకు, మనవరాళ్లకు చెప్పాలని ఆమె ఆటలాడే క్రీడామైదానాలలో నానమ్మలు, అమ్మమ్మలు బారులు తీరి ఉంటారు. అంతేకాదు.. 'ఆన్స్.. నిన్ను చూసే ఆటపై మొగ్గుచూపుతున్నాను. నువ్వు నాలో గొప్ప స్ఫూర్తిని నింపావు' అంటూ అభిమానులు, యువ క్రీడాకారులు ఆమెను కొనియాడుతూ ప్లకార్డులు చేబూనిన దృశ్యాలు ఆ క్రీడామైదానాల్లో కనిపిస్తాయి.

విశేషప్రజాదరణ పొందిన క్రీడాకారులు ఆటలో రాణిస్తూ సంఘర్షణలపై స్పందించడం చాలా అరుదు. కానీ ఆన్స్ అలా కాదు.. తన చుట్టూ నెలకొన్న పరిస్థితులపై స్పందించకుండా ఉండలేరు. గాజాపై ఇజ్రాయిల్ మారణహోమం తలపెట్టిన నాటి నుండి అక్కడి పరిస్థితులను గమనిస్తూ వస్తున్న ఆమె, అనేకసార్లు సోషల్ మీడియా వేదికగా గాజా పౌరులకు సంఘీభావంగా నిలబడ్డారు.

'75 ఏళ్లుగా పాలస్తీనియన్లు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. అక్కడి అమాయక పౌరులు పడుతున్న బాధలు ఎంతో వ్యధాభరితం. వారి మతం ఏదైనా, వారి మూలాలు ఏమైనా హింస ఎప్పటికీ శాంతిని కలిగించదు. నేను హింసతో నిలబడలేను. అలాగే వారి భూములు లాక్కున్న వ్యక్తులతోనూ తలపడలేను. కానీ ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకొని స్పందించగలను. అక్కడ ఏం జరుగుతుంతో తెలుసుకోకుండా ఉండలేక పోతున్నాను. చరిత్రను విస్మరించడం బాధ్యతారాహిత్యం. అది శాంతినీ తీసుకురాలేదు. శాంతి ప్రతి ఒక్కరికి అవసరం. అందుకోసం హింసను ఆపాలి. పాలస్తీనాను విడిచిపెట్టాలి' అని గాజా పౌరులకు మద్దతుగా ఇటీవల తన ఇన్‌స్టాలో ఆమె రాసుకొచ్చారు. ఈ పోస్టు ఆమెలోని క్రీడా స్ఫూర్తికి మించిన గొప్ప మానవతా హృదయానికి ప్రతీకగా నిలుస్తోంది.

కరివేపాకులోనూ ఆరోగ్య ఔషధాలు

భారతీయుల వంటకాల్లో కరివేపాకు సర్వసాధారణంగా వాడుతుంటారు. చాలామంది దీన్ని కేవలం రుచి కోసమే వేస్తారని అనుకుంటారు. పక్కకు తీసి పడేస్తుంటారు. కరివేపాకులో అనేక ఆరోగ్య సంబంధ ఔషధ గుణాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు, వివిధ రకాల ఔషధ గుణాలు ఉన్నాయి. అందువల్ల కేవలం వంటల్లోనే కాకుండా వివిధ ఔషధాల్లోనూ దీన్ని ఉపయోగిస్తారు. యాంటీ కార్సినోజెనిక్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ డయాబెటిక్, హెపటో ప్రొటెక్టివ్ ఎక్కువగా ఉంటాయి. ఇవి కాలేయానికి రక్షణ కల్పిస్తాయి. జుట్టు సమస్యలను నివారణకు, జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. అజీర్తి, ఎక్సెసివ్ యాసిడ్స్ ఉత్పత్తిని నివారిస్తుంది.

చర్మం సంరక్షణకు సహాయపడుతుంది. ఆకులు రసం లేదా పేస్ట్ కాలిన, తెగిన గాయాలు, చర్మం దురదలు తగ్గించడానికి ఉపయోపడతాయి. శరీరంలోని బ్యాడ్ కొలెస్ట్రాల్, ఫ్యాట్‌ను కరిగించి బరువు తగ్గిస్తుంది. ఆమ్లస్రావం, జీర్ణ పూతలు, ఎముకల అరుగుదలకు, డయాబెటిస్, అతిసారం, గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సమస్యలను నియంత్రిస్తుంది. వేర్లను శరీర నొప్పులను తగ్గించేందుకు ఉపయోగిస్తారు. హైపర్గ్లైసీమిక్ డయాబెటిక్ డయాబెటిక్ రోగుల రక్త గ్లూకోజ్ స్థాయిని నియంత్రిస్తాయి. లుకేమియా, ప్రొస్టేట్ క్యాన్సర్, కొలొరెక్టల్ క్యాన్సర్ల నివారణకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. జుట్టు మూలాలను బలపరుస్తుంది. పెరుగుదలకు సహకరిస్తుంది.

న్యూజిలాండ్‌కు కీలకం

నేడు శ్రీలంకతో చివరి లీగ్ మ్యాచ్ ● పొంచివున్న వర్షం ముప్పు

బెంగళూరు: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో న్యూజిలాండ్, శ్రీలంకజట్లు తమ చివరి లీగ్ మ్యాచ్‌లను ఆడనున్నాయి. శ్రీలంక జట్టు సెమీస్ రేసునుంచి ఇప్పటికే నిష్క్రమించగా.. న్యూజిలాండ్ జట్టు నేడు శ్రీలంకపై నెగ్గితేనే సెమీస్ రేసులో నిలవనుంది. మరో రెండు జట్లయిన ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ జట్లు కూడా న్యూజిలాండ్‌తో పోటీగా సెమీస్ రేసులో నిలవడమే ఇందుకు కారణం. ఈ మూడు జట్లకు ఇప్పటికే 8మ్యాచ్‌లు ముగియగా.. ఆ జట్లు 8పాయింట్లతో సంయుక్తంగా ఉన్నాయి. మెరుగైన రన్‌రేట్ తో న్యూజిలాండ్ 4వ స్థానంలో, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ 5, 6 స్థానాల్లో ఉన్నాయి. ఒకవేళ న్యూజిలాండ్ జట్టు నేడు శ్రీలంక చేతిలో ఓడితే సెమీస్ రేసు నుంచి దాదాపు నిష్క్రమించినట్లే. ఎందుకంటే పాకిస్తాన్, ఆఫ్ఘన్ జట్లు మరో మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఇక మంగళవారం ఆస్ట్రేలియా జట్టు ఆఫ్ఘన్ ఓడించి 12పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి ఇప్పటికే సెమీస్‌కు చేరింది. భారత్ (16 పాయింట్లు), దక్షిణాఫ్రికా (12పాయింట్లు) జట్లు టాప్-2లో నిలిచి ఇప్పటికే సెమీస్‌కు చేరాయి.

పొంచివున్న వర్షం ముప్పు...

బెంగళూరులో న్యూజిలాండ్-శ్రీలంక జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి వున్నట్లు ఇక్కడి వాతావరణ శాఖ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయిన పక్షంలో ఇరుజట్లకు ఒక్కో పాయింట్ దక్కనుంది. అదే జరిగితే పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లకు దారి సుగమం కానుంది.

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	భారత్	8	8	0	16	+2.45
2.	దక్షిణాఫ్రికా	8	6	2	12	+1.37
3.	ఆస్ట్రేలియా	8	6	2	12	+0.86
4.	న్యూజిలాండ్	8	4	4	8	+0.39
5.	పాకిస్తాన్	8	4	4	8	+0.03
6.	ఆఫ్ఘనిస్తాన్	8	4	4	8	-0.33
7.	ఇంగ్లండ్	8	2	6	4	-0.88
8.	బంగ్లాదేశ్	8	2	6	4	-1.14
9.	శ్రీలంక	8	2	6	4	-1.16
10.	నెదర్లాండ్స్	8	2	6	4	-1.63

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

కన్సల్టెన్సీల చేతికి కీలక ప్రాజెక్టులు

- ఔట్‌సోర్సింగ్‌కు 500 కోట్ల విలువైన పనులు
- మోడీ ప్రభుత్వ నిర్వాకం
- 16 మంత్రిత్వ శాఖలదీ ఇదే తీరు

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు గడచిన ఐదు సంవత్స రాల కాలంలో ఐదు వందల కోట్ల రూపాయల విలువైన కీలక ప్రాజెక్టులను కన్సల్టెన్సీలకు అప్పగిం చి చేతులు దులుపుకున్నాయి. కేంద్రంలోని 16 మంత్రిత్వ శాఖలు, విభాగాలు పరిపాలనకు సంబం ధించిన వివిధ ప్రాజెక్టులను ప్రముఖ బహుళజాతి కన్సల్టెన్సీ సంస్థలకు కట్టబెట్టాయని 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక తెలిపింది. సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన రికార్డులను పరిశీలించిన ఈ పత్రిక వాస్తవాలను బయటపెట్టింది.

2017 ఏప్రిల్ నుండి గత సంవత్సరం జూన్ వరకూ ప్రైస్‌వాటర్-హౌస్‌కూపర్స్ (పీడబ్ల్యూసీ), డెలాయిట్ టచ్ తోమత్సూ లిమిటెడ్, ఎర్నస్ట్ అండ్ యంగ్ గ్లోబల్ లిమిటెడ్, కేపీఎంజీ ఇంటర్నేషనల్ లిమిటెడ్, అమెరికాకు చెందిన మెకిన్సే అండ్ కంపెనీలకు వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు రూ.500 కోట్ల విలువైన 308 కన్సల్టెన్సీ ప్రాజెక్టులు ఇచ్చాయని ఆ పత్రిక వివరించింది. కేంద్ర ప్రభుత్వంలో 59 మంత్రిత్వ శాఖలు ఉండగా వాటిలో 16 శాఖలు, వాటి ఆజమాయిషీలోని 50 సంస్థలు ఈ ప్రాజెక్టులను కన్సల్టెన్సీలకు అప్పగించాయి. వీటిలో పెట్రోలియం-సహజవాయువు, గ్రామీణాభివృద్ధి, పాలనాపరమైన సంస్కరణలు- ప్రజా ఫిర్యాదులు, పరిశ్రమలు-అంతర్గత వాణిజ్య అభివృద్ధి, బొగ్గు, ఎలక్ట్రానిక్స్-ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి- ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, రక్షణ, పౌర విమానయానం, ప్రభుత్వ రంగ సంస్థలు, సంప్రదాయేతర ఇంధన వనరులు, విద్యుత్, రోడ్డు రవాణా-రహదారులు, పర్యావరణం, అడవులు-వాతావరణ మార్పు, పర్యా టకంవంటి మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఉన్నాయి.

ఏ కంపెనీకి ఎంత?

ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టులు పొందిన బడా కంపెనీల్లో అత్యధికంగా లబ్ది పొందిన సంస్థ పీడబ్ల్యూసీ. ఇది రూ.156 కోట్ల విలువైన 92 కాంట్రాక్టులు సంపాదించింది. డెలాయిట్ కంపెనీ రూ.130.13 కోట్ల విలువైన 59 పనులు చేసింది. అయితే ఈ కాంట్రాక్టుల్లో నాలుగు కాంట్రాక్టులకు సంబంధించిన సొమ్ము వివరాలు తెలియలేదు. ఇక ఈ అండ్ వై సంస్థ రూ.88.05 కోట్ల విలువైన 87 కాంట్రాక్టులు దక్కించుకోగా వాటిలో ఐదింటికి సంబంధించిన సొమ్ము వివరాలు అందలేదు. కేపీ ఎంజీ కంపెనీ రూ.68.46 కోట్ల విలువైన 66 కాంట్రాక్టులు పొందింది. వీటిలో ఐదు కాంట్రాక్టు లకు సంబంధించిన వివరాలు తెలియలేదు. మెకిన్సే సంస్థ రూ.50.09 కోట్ల విలువైన మూడు కాంట్రాక్టులు చేజిక్కించుకుంది.

పెట్రోలియం మంత్రిత్వ శాఖ, దాని పరిధిలోని నాలుగు పీఎస్‌యూల నుండి పెట్రోలియం రంగం అత్యధిక కాంట్రాక్టులు సంపాదించింది. వీటి విలువ రూ.170 కోట్లు. విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన తొమ్మిది సంస్థలు బహుళజాతి కన్సల్టెన్సీ కంపెనీ లకు రూ.166.41 కోట్ల విలువైన కాంట్రాక్టులు ఔట్‌సోర్సింగ్ ఇచ్చింది. ఆర్‌టీఐ చట్టంలోని 'వాణిజ్య రహస్యం' అనే కారణం చూపి సమాచారం అందిం చేందుకు ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నిరాకరించింది.

పర్యాటక మంత్రిత్వ శాఖ తన 'స్వదేశ్ దర్శన్ ఇనిషియేటివ్'లో భాగంగా కనీసం రూ.18 కోట్ల విలువైన పనిని ఒక్క ఈ అండ్ వై సంస్థకే అప్పగిం చింది. ఇదిలావుంటే నిటి ఆయోగ్ 2019-2021 మధ్య ఏడు కాంట్రాక్టుల్ని ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ పథకాలను మదింపు చేసేందుకు ఇచ్చిన ఈ కాంట్రాక్టుల విలువ రూ.17.43 కోట్లు.

2015 నుండే ప్రారంభం

2015 నుండే నరేంద్ర మోడీ ప్రభుత్వం కన్సల్టెంట్లకు పనులు అప్పగించడం మొదలు పెట్టిందని అప్పట్లో పత్రికలు వార్తలు అందించాయి. మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్మార్ట్ సిటీస్, స్వచ్ఛ భారత్, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాల కోసం కేంద్ర ప్రభుత్వం కన్సల్టెన్సీ సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెట్టింది.

ఈ సంస్థలకు మార్చితో అంతమైన సంవత్సరంలో రూ.500 కోట్లు ఫీజుగా సమర్పించారని సీనియర్ కన్సల్టెంట్లను ఉటంకిస్తూ 'ఎకనమిక్ టైమ్స్' పత్రిక 2015 జూలైలో తెలిపింది. సంవత్సర కాలంలో ప్రభుత్వ సంస్థలు ఇచ్చే కాంట్రాక్టుల విలువ రూ.750 కోట్లకు చేరుతుందని వారు అంచనా వేశారు. దాదాపు అన్ని ప్రభుత్వ ప్రాజెక్టులకు కన్సల్టెంట్లను ఏదో ఒక దశలో నియమించారు. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఇదే తంతు కొనసాగింది.

ఇంగ్లండ్‌కు ఊరట

- వరుసగా ఐదు ఓటముల తర్వాత ఓ గెలుపు ● స్టోక్స్ సెంచరీ
- నెదర్లాండ్స్‌పై 160పరుగుల తేడాతో ఘన విజయం

పూణే: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్ జట్టుకు ఊరట లభించింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఇంగ్లండ్ వరుస ఐదు ఓటములకు బుధవారం ఫుల్‌స్టాఫ్ పెట్టింది. మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో నెదర్లాండ్స్‌పై 160పరుగుల భారీ తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 339పరుగులు చేయగా.. అనంతరం నెదర్లాండ్స్‌ను 37.2ఓవర్లలో 179పరుగులకు ఆలౌట్ చేసింది. ఇది ఇంగ్లండ్‌కు ఈ టోర్నమెంట్‌లో లభించిన రెండో విజయం మాత్రమే. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. ఏడో ఓవర్లో ఓపెనర్ జానీ బెయిర్ స్టో(15) వికెట్‌ను కోల్పోయింది. కానీ మరో ఓపెనర్ మలన్ మాత్రం ఫోర్లతో విరుచుకుపడ్డాడు. వాన్ బీక్ వేసిన రెండో ఓవర్లోనే హ్యాట్రిక్ ఫోర్లు కొట్టిన మలన్.. ఆర్యన్ దత్ వేసిన మూడో ఓవర్లో కూడా రెండు బౌండరీలు సాధించాడు. వాన్ బీక్ వేసిన 8వ ఓవర్లో మూడు బౌండరీలు బాదాడు. 36బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసిన మలన్.. రెండో వికెట్‌కు జో రూట్(28)తో కలిసి 85 పరుగులు జోడించాడు. దీంతో ఇంగ్లండ్ జట్టు 20 ఓవర్లు పూర్తయ్యే సరికి 2వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. వాన్ బీక్ వేసిన 21వ ఓవర్లో తన ట్రేడ్ మార్క్ షాట్ వేసిన బంతినిరివర్స్ స్వీప్ ఆడబోయిన రూట్.. క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఓపెనర్ డేవిడ్ మలన్ (87; 74 బంతుల్లో 10 ఫోర్లు, 2సిక్సర్లు)తో మెరిసినా.. హ్యారీ బ్రూక్(11), కెప్టెన్ జోస్ బట్లర్(5), మొయిన్ అలీ(4) తక్కువ స్కోర్లకే పెవీలియన్‌కు చేరారు. 192 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్‌ను బెన్‌స్టోక్స్ సెంచరీతో ఆదుకున్నాడు. బెన్ స్టోక్స్(108; 84 బంతుల్లో, 6ఫోర్లు, 6సిక్సర్లు)కి తోడు ఏడో స్థానంలో వచ్చిన క్రిస్ వోక్స్‌తో కలిసి ఏడో వికెట్‌కు 81బంతుల్లో 129 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 58బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసిన స్టోక్స్.. ఆర్యన్ దత్ వేసిన 45వ ఓవర్లో 4, 6, 6, 6తో 80లలోకి వచ్చాడు. బస్ డే లీడె వేసిన 47వ ఓవర్లో 4, 6 కొట్టి 90లలోకి వచ్చిన స్టోక్స్.. మరుసటి ఓవర్లో బౌండరీ కొట్టి ఈసారి ప్రపంచకప్‌లో తన తొలి సెంచరీని సాధించాడు. 58 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన స్టోక్స్.. తర్వాత 50 పరుగులు చేయడానికి 20 బంతులే తీసుకున్నాడు. వోక్స్ కూడా లీడె వేసిన 49వ ఓవర్లో 6, 4 కొట్టి 44 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. వోక్స్(51; 45బంతుల్లో 5ఫోర్లు, సిక్సర్) అర్ధసెంచరీ చేశాడు. నెదర్లాండ్స్ బౌలర్లలో లీడెకు మూడు, వాన్ బీక్, ఆర్యన్ దత్‌లు తలా రెండేసి వికెట్లు పడగొట్టారు.

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నెదర్లాండ్స్‌ను ఓపెనర్ విస్లే (37) రాణించినా.. ఓవర్డ్స్(5), అకెర్మన్(0) నిరాశపరిచారు. ఆ తర్వాత సైబ్రాండ్(33), ఎడ్వర్డ్స్(38), తేజ నిడమానూరు(41నాటౌట్) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఆదిల్ రషీద్, మొయిన్ అలీకి మూడేసి, విస్లేకు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బెన్ స్టోక్స్‌కు లభించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68